
లోక్‌సత్తా 25వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలతో..

# జనబలం

ప్రజలే ప్రభువులు

ఆగస్టు 2021 లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక రూ.10/-

## స్వేచ్ఛా భారతం @ 75.. ఎ'జెండా'



INDIA
INDEPENDENCE DAY
75TH

# సంఘటితంగా పనిచేస్తే సంస్కరించుకోగలం



భారతదేశ 75వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. ఈ ఏడున్నర దశాబ్దాల్లో చెప్పుకోదగిన విజయాల్నే సాధించాం. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత వలసపాలనలో ఇంత స్థాయిలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టుకున్న దేశం మరొకటి లేదు. మనకు ఎప్పుడూ ఎన్నికైన ప్రభుత్వాలే ఉంటున్నాయి. ఆర్థిక వ్యవస్థ గణనీయంగా వృద్ధిచెందింది.. కానీ లోతుగా చూస్తే ఎన్నో వైఫల్యాలూ కనిపిస్తాయి... స్వాతంత్ర్యం ఉందిగానీ, స్వపరిపాలన లేదు. ఓటు హక్కు ఉందిగానీ, వారసత్వ రాజకీయాల్ని అడ్డుకోలేం. రాజ్యాంగం ఉందిగానీ, సార్వభౌమాధికారం లేదు. అందరికీ ఒకే చట్టం అంటారుగానీ, ఉన్నవారికోన్యాయం లేనివారికో న్యాయం. ఏ చిన్న సమస్యకు పరిష్కారం కావాలన్నా సంచలన, హింసాత్మక ఘటనలకు పాల్పడాల్సిందే. ఈనాటికీ 70శాతంమంది కుల,మత, లింగ వివక్షతల వల్ల ఉన్నత అవకాశాలను కోల్పోక తప్పటం లేదు. బాధ్యతలు, బాధలు ప్రజలవి .. అధికారాలు, ఆడంబరాలు పాలకులవి- ఈ పరిస్థితి మార్చటానికే మనం పోరాటం చేయాలి. అయితే బ్రిటిష్ వారి కాలంలోలా ఈవేళ మనం బానిసల్లా పోరాడాల్సిన పన్లేదు. సార్వభౌముల్లా మనలోని చెడును, వ్యవస్థలోని లోపాల్ని సవరించుకునేందుకు పోరాడాలి. లక్ష్యం సాధించటం కోసం మరో 75ఏళ్లు ఆగాల్సిన పన్లేదు. ఇప్పుడు అవకాశాలు, సాంకేతిక పరిజ్ఞానం, జనమాధ్యమాలు అందుబాటులో ఉన్నాయి. యువత, ఆలోచనాపరులంతా నిజాయతీగా వ్యవస్థలో మార్పు కోసం ముందుకొచ్చి సంఘటితంగా కృషి చేయాలి.

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

ప్రజలే ప్రభువులు

# జనబలం


లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

| సంపుటి | సంచిక | సంపాదకవర్గం | వర్కింగ్ ఎడిటర్ |
|---|---|---|---|
| 24 | 08 | బండారు రామ్మోహనరావు | దూసనపూడి |
| ఆగస్టు 2021 | | శిరమని నరేష్ | సోమసుందర్ |


**జనబలం చందా రుసుము వివరాలు**

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

**చందాదారులకు విజ్ఞప్తి**

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

**కార్టూన్ కార్నర్**





కార్యాలయ చిరునామా : తులిప్స్ అపార్ట్‌మెంట్స్ 6-3-655, ప్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక, సోమాజిగూడ, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288

Email: janabalam.loksatta@gmail.com, loksattaudyamasamstha@gmail.com

సంపాదకీయం

# 75 ఏళ్ల స్వాతంత్ర్యం!

మనం దేశానికి స్వాతంత్ర్యం సాధించుకుని డెబ్బై ఐదేళ్లు కావస్తున్నది. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ పేరుతో ఏడాదిపాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉత్సవాల నిర్వహణకు ప్రధానమంత్రి అధ్యక్షతన 260 మంది సభ్యులుగల ఒక కమిటీకూడా ఏర్పాటయ్యింది. అభివృద్ధి, పరిపాలన, సాంకేతికత, సంస్కరణలు, ప్రగతి శీల విధానాలు అనే ఐదు అంశాలు మూల స్తంభాలుగా అమృత్ మహోత్సవ్‌ను నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించింది. వివిధ మంత్రిత్వ శాఖలు తమ పరిధిలో చేపట్టి పూర్తి చేయగల పదేసి ప్రాజెక్టులను ఎంపిక చేసుకోవాల్సిందిగా ప్రభుత్వం సూచించింది. స్మార్ట్ సిటీ మిషన్ పథకంలో భాగంగా 163 ప్రాజెక్టులను చేపట్టనున్నారు. 100 స్మార్ట్ సిటీలను చెత్త రహిత నగరాలుగా మార్చాలని ప్రతిపాదించారు. 2022 నాటికి దేశంలో 2022 పట్టణాలలో బహిరంగ మల విసర్జన పూర్తిగా నిర్మూలించాలని తలపెట్టారు. ప్లాటినమ్ జూబ్లీ మోడల్ పార్కులను ఓ పదింటిని రూపొందించాలనీ, గ్రీన్‌కంట్రీ క్యాంపెయిన్‌లో 75వేల ఔషధ మొక్కలను, పండ్ల మొక్కలను నాటించాలనీ, భారతదేశంలో వినియోగించే సాంకేతికతలను ప్రపంచానికి చూపేందుకు 'గ్లోబల్ టెక్ ఫెస్టివల్స్'ను నిర్వహించాలనీ తలపెట్టారు. సరస్సుల పునరుద్ధరణ, రివర్ ఫ్రంట్‌ల ఏర్పాటు, స్మార్ స్కూళ్లు, డిజిటల్ లైబ్రరీలు నెలకొల్పాలనీ, బహిరంగ ప్రదేశాల్లో 75 సోలార్ వృక్షాలను ఏర్పాటు చేయాలనీ సంకల్పించారు. సాంస్కృతిక మంత్రిత్వశాఖ సారథ్యంలో పలు కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. స్వతంత్ర పోరాట ఘట్టాలను వేదికలుగా నిలిచిన ప్రదేశాల్లో ప్లాటినమ్ జూబ్లీ మారథాన్‌లను, సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టాలని భావిస్తున్నారు. అన్నిటినీ మించి 2022 ఆగస్ట్ 15 నాటికి పార్లమెంట్ నూతన భవనంలో ఒక ప్రత్యేక సెషన్ నిర్వహించాలన్న ఆలోచన కూడా ఉందంటున్నారు. దండి ఉప్పు సత్యాగ్రహ 91వ వార్షికోత్సవం సందర్భంగా మొన్న మార్చి 12న సబర్మతీ ఆశ్రమ్ నుండి దండి వరకూ కొనసాగే ఒక పాదయాత్రను ప్రధానమంత్రి ప్రారంభించారు. 75వారాల పాటు కొనసాగే అమృత్ మహోత్సవ్ కార్యక్రమాలను కూడా మార్చి 12న సబర్మతీ ఆశ్రమ్‌లోనే ప్రారంభించారు. అమృత్ మహోత్సవ్ సందర్భం వచ్చిన ప్రతిసారీ ప్రధానమంత్రి నరేంద్రమోదీ తనదైన శైలికి భిన్నంగా మాట్లాడుతూ వచ్చారు. పూజ్య బాపూజీ స్ఫూర్తిని దేశమంతటా చాటిచెప్పడానికి అమృత్ మహోత్సవ్ ఒక అవకాశంగా వినియోగించుకోవాలని మోదీ సూచించారు. బాలగంగాధర తిలక్, లాలాలజ్‌పతి రాయ్, భగత్‌సింగ్, జవహర్‌లాల్ నెహ్రూ, బి.ఆర్. అంబేద్కర్ వంటి స్వాతంత్ర్య సమరయోధులు సాగించిన పోరాటాలను, వారి త్యాగాలనూ, వారు కన్నకలల్నీ, స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకునే ఒక ప్రజా ఉద్యమంగా అమృత్ మహోత్సవ్ జరగాలనీ మోదీ పిలుపు ఇచ్చారు. ఆధునిక శాస్త్ర విజ్ఞాన దృష్టి, సాంకేతికత ప్రధాన భూమిక పోషించే, అందరకీ సమాన అవకాశాలు కల్పించే సుసంపన్నమైన దృఢమైన, సురక్షితమైన దేశాన్ని నిర్మించడానికి కృషి జరగాలని అభిలషించారు. దేశంలోని 130కోట్ల మంది ప్రజల్ని కలసికట్టుగా అమృత్ మహోత్సవ్‌లో పాల్గొనేటట్లు సమీకరించాలని ప్రధానమంత్రి లక్ష్య నిర్దేశం చేశారు.

అమృత్ మహోత్సవ్ పేరుతో మోదీ చేస్తున్న ప్రసంగాలు జాతీయోద్యమ ఆదర్శాలూ విలువలు, సృష్టించిన విశాల ఐక్యతా పునాదిని ప్రతిబింబించుతున్నాయి. ప్రసంగాల సారాంశం దివ్యంగా ఉంది. అమృత్ మహోత్సవ్ పేరుతోనయినా దేశాన్నంతటినీ కలుపుకొని వెళ్లే ప్రయత్నం ఆయన చేస్తున్నారన్న ఆశ రేకెత్తింది. అయితే ప్రధానమంత్రి మోదీలోని భావోద్వేగ అపరిచితుడు వెంటనే బైటపడుతూ కన్పిస్తుంటాడు. ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలలో మోదీ తన అజెండాను, ప్రసంగశైలినీ మార్చుకోవడం గమనించవచ్చు. గత 75 ఏళ్లుగా దేశంలో ఏమీ జరగలేదంటూ గంపగుత్తగా ప్రతిపక్షాలను దుమ్మెత్తి పోయడం ఆయనకే చెల్లింది. కాంగ్రెస్ నయవంచక పార్టీ అనీ, కాంగ్రెస్ పాలనా వ్యవస్థను వికృత పరిచిందనీ, రోడ్డు, కరెంట్, ఇల్లు , వంట చెరకు , బ్యాంకింగ్ వంటి సేవలను తామే పేదలకు అందిస్తున్నామని, ప్రజలకు రేషన్ అందించింది తామేనని మోదీ చేసే ప్రసంగాలు విస్తుగొలిపేవిగా ఉన్నాయి.

గత 75 సంవత్సరాలుగా ఏమీ జరగలేదనే ప్రాతిపదికపై అమృత్ మహోత్సవ్‌ను నిర్వహించడం దేశ చరిత్రను నిరాకరించడమే అవుతుంది. స్వాతంత్ర్యోద్యమంలో స్ఫూర్తిదాయక నేతృత్వం అందించిన మహనీయులు స్వపరిపాలనలో చేసిన కృషిని విస్మరించడం కూడా ఘోరమైన తప్పు అవుతుంది.

స్వాతంత్ర్యం సాధించుకున్న నాటికి మన భౌగోళిక సమగ్రత, జాతీయ సమైక్యత తీవ్ర ప్రమాదాలను ఎదుర్కొంటున్నాయి. ఆహారం కోసం విదేశీ సహాయం కోసం ఎదురు చూసే పరిస్థితి. ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అయ్యింది. దేశ విభజన గాయాలు సామాజిక సామరస్యాన్ని తీవ్రంగా దెబ్బతీసాయి. అనేక అవరోధాలు, పరిమితుల మధ్య ఒక రాజ్యాంగ బద్ధ, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని, ఆధునిక నాగరికతా విలువలు కలిగిన రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నాం.

ఆహార స్వయం సమృద్ధి, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి గట్టి పునాది, రహదారుల విస్తరణ, నీటి పారుదల, విద్యుదీకరణ, అణు, అంతరిక్ష రంగాలలో ఒక శక్తిగా భారత్‌ను రూపొందించేందుకు ముందుతరం నేతలు శ్రమించారు. హిందూ.. ముస్లిం ఉద్రిక్తతలను చల్లబరిచి, అన్ని వర్గాలకూ శాంతి, సామరస్యాలు సమాన అవకాశాలు దక్కేందుకు వారు కృషి చేశారు. అందరికీ సంపద, అందరికీ న్యాయం అందించేందుకు, రాజకీయ స్వాతంత్ర్యం పౌరుల వ్యక్తిగత స్వాతంత్ర్యంగానూ, సామాజిక, ఆర్థిక న్యాయంగానూ రూపొందేలా పునాది నిర్మించారు. జాతికి లభించిన స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు పౌరులందరికీ దక్కాలని రాజ్యాంగ నిర్మాతలు సంకల్పించారు. అందుకు శాయశక్తులా కృషి చేశారు. 1956లోనే తొలి అణు రియాక్టర్ అప్సరను ఏర్పాటు చేయగలగడం చిన్న విషయం కాదు. స్వతంత్ర ఎన్నికల కమిషన్, స్వేచ్ఛాయుత మీడియా, స్వతంత్ర న్యాయవ్యవస్థ, సమాఖ్య విధానంలో బాధ్యతల, అధికారాల పంపిణీ చేసుకున్న తీరు అద్భుతమే అని చెప్పాలి. మనది సుస్థిర ప్రజాస్వామ్యంగా నిలబడింది. అయితే ప్రజాస్వామ్యం నాణ్యతపై నీలినీడలున్న మాట నిజం. రాజకీయ పార్టీలు సొంత సామ్రాజ్యాలుగా మారిపోయాయి. అశ్రిత పక్షపాతం, బంధుప్రీతి, నేర, ధన రాజకీయాలు కలగాపులగం కావడం, వ్యక్తుల చేతిలో విపరీతమైన అధికార కేంద్రీకరణా సమస్యలుగా ఘనీభవించి పోయాయి. స్వతంత్ర వ్యవస్థలు బలహీనం అయిపోతున్నాయి. వాక్ స్వాతంత్ర్యం, వ్యక్తి స్వేచ్ఛ తీవ్ర ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుల స్థిరీకరణ కోసం మొరటు హింసాత్మక, విభజనవాద వైఖరులు తీసుకోవడం పెను ప్రమాదంగా తయారయ్యింది.

మన ప్రజాస్వామ్యం కీర్తించదగిన విజయగాథగానే మొదలైన అసంపూర్ణ స్వప్నంగా మిగిలిపోయింది. మన జాతీయ సమైక్యతా ఇంటాబైటా ప్రమాదాలను ఎదుర్కొంటున్నది. న్యాయబద్ధ సమాజం అందని ద్రాక్షగా మారింది. పౌరులందరికీ సమానంగా స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు అందలేదు.

ఆర్థిక పతనం, వ్యవసాయ సంక్షోభం, గ్రామీణ ప్రజల దైన్యం, తారాస్థాయికి చేరిన నిరుద్యోగితా రేటు, జీడీపీలో ప్రతికూల వృద్ధి, దళితులు, మహిళలు, మైనారిటీలపై అత్యాచారాలు, అవినీతి వంటి సమస్యలు దేశాన్ని పట్టి పీడిస్తున్నాయి. వీటిపై చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదు. నూతన భవనం కట్టినా చర్చలు లేని పార్లమెంటు శోభించదు. పార్లమెంటుని పనిచేయించడం పాలక పక్షం బాధ్యత. అమృత్ మహోత్సవ్ సందర్భంగానైనా వివాదాస్పద అంశాలపై అన్ని రాజకీయ పక్షాలతోనూ ప్రధానమంత్రి చర్చించడం అవసరం. 130కోట్ల మందిని కలసి కట్టుగా తీసుకెళ్లాలని అంటున్న ప్రధాని కనీసం అన్ని రాజకీయ పక్షాలనూ విశ్వాసంలోకి తీసుకుంటారా?

డి. సోమ సుందర్

# స్వేచ్ఛా భారతం @ 75.. ఎ'జెండా'

2021 ఆగస్టు 15న భారతదేశం 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటోంది. ఈ చరిత్రాత్మక సందర్భాన్ని ప్రజల భౌతిక, బౌద్ధిక సామర్థ్యాలను నూతన భారతదేశ నిర్మాణం వైపు నడిపించే అవకాశంగా మలచాలని ప్రభుత్వాలు సంకల్పం ప్రకటించాయి. అందుకే 75 వారాల పాటు.. 2022 ఆగస్టు 15 వరకు స్వాతంత్ర్య అమృతోత్సవాల పేరుతో కార్యాచరణను ప్రకటించాయి. చారిత్రక ప్రాధాన్యత కలిగిన 75 చోట్ల వారానికొక ప్రముఖ ఘట్టాన్ని పండుగలా నిర్వహించాలని, పాత, కొత్త తరాల్ని ఉత్తేజితుల్ని చేసి దేశం కోసం బతికేలా చేయాలని నిర్దేశించారు. ఇందుకోసం గవర్నర్లు, యూనియన్ మంత్రులు, ముఖ్యమంత్రులు, రాజకీయ నాయకులు, శాస్త్రవేత్తలు, మీడియా ప్రముఖులు, ఆధ్యాత్మికవేత్తలు, అధికారులు, కళాకారులు, సినీ, క్రీడా ప్రముఖులు, ఇంకా పలు రంగాల్లో సుప్రసిద్ధులతో 259 మందితో ఒక ఉన్నతస్థాయి జాతీయ కమిటీని ఏర్పాటు చేశారు.

"దేశం 75వ స్వాతంత్ర్య వేడుకలు జరుపుకునే వేళ.. ఒకప్పుడు అసాధ్యంగా తోచిన లక్ష్యాల సాధనకు 'సాహసోపేత అడుగులు' వేస్తుంది. ఈ ఉత్సవాలు ఆనాటి ఉద్యమస్ఫూర్తిని ప్రతిబింబించాలి. 1947 నుంచి మనం సాధించిన విజయాలను ప్రపంచానికి చూపేందుకు ఇది మంచి అవకాశం. వేడుకలను ఐదు ఉప విభాగాలుగా వర్గీకరించవచ్చు. ఇందులో స్వాతంత్ర్య ఉద్యమం, 75వ స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్ఫృశించాల్సిన ఆలోచనలు, విజయాలు, చర్యలు, భవిష్యత్ సంకల్పం ఉండాలి. స్వాతంత్ర్యోద్యమ వీరుల త్యాగాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉంది. ఉత్సవాల్లో ప్రజల భాగస్వామ్యమే అత్యంత కీలకం. కార్యక్రమ ఏర్పాట్లలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించటం వల్ల 130 కోట్ల మంది ఆకాంక్షలు, భావనలు, ఆలోచనలు, సూచనలు, కలలకు చోటు దక్కుతుంది. ఈ ఉత్సవాల నిర్వహణ బాధ్యతలు మనకు దక్కిన అదృష్టం" అని కమిటీ తొలి సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.

91 ఏళ్ల క్రితం ఉప్పుతో వలస పాలకుల్ని కదిలించిన దండి సత్యాగ్రహం జరిగిన గుజరాత్‌లోని సబర్మతీ ఆశ్రమం నుంచి మార్చి 12న 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'ని మోదీ ప్రారంభించారు. గాంధీజీ బృందం లాగే 21 రోజుల పాటు అమృతోత్సవ బృందం యాత్ర సాగించింది. ఇదేరోజున వివిధ రాష్ట్రాల్లో కూడా ఉత్సవాల్ని ప్రారంభించారు. గాంధీ




మహాత్ముని స్ఫూర్తిగా తీసుకునే తెలంగాణ ఉద్యమాన్ని నిర్వహించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామని చెబుతూ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఉత్సవాల నిర్వహణకు కమిటీని ప్రకటించారు.

ఈ అమృతోత్సవాలను 75వ స్వాతంత్ర్య సంవత్సరం పూర్తయ్యే 2022 వరకు నిర్వహించటంతోపాటు.. 2023 ఆగస్టు 15 వరకూ కొనసాగింపు కార్యాచరణ అమలు చేస్తారు.

ఇంత ప్రతిష్ఠాత్మకంగా, పెద్ద ప్రణాళికతో కార్యాచరణ చేపట్టిన కొన్ని రోజుల్లోనే కొవిడ్ రెండో దశ కల్లోలం మన జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రభుత్వాల ఘోర రాజకీయ, పాలనా, నాయకత్వ వైఫల్యాల్ని బట్టబయలు చేసింది. 75వ స్వాతంత్ర్య దినోత్సవ సమీక్ష ఆర్భాటంగా కన్నా, లోతైన ఆలోచనతో ఉండాలని చెప్పకనే చెప్పింది.


మన దేశానికి స్వతంత్రం ఇచ్చే ముందూ, 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చాక కూడా.. ఒక సార్వభౌమ దేశంగా సువిశాల భారత్ మనుగడ పట్ల అనేకమంది సందేహాలు వెలిబుచ్చారు. కొందరు విదేశీ ప్రముఖులైతే బాహాటంగానే భారతదేశ స్వయంపాలనా సామర్థ్యాన్ని ఎద్దేవా చేశారు. కానీ అందరి అంచనాల్నీ తల్లకిందులు చేస్తూ భారత్ ఒక స్వతంత్ర దేశంగా 75వ మైలురాయిని దాటుతోంది. పింగళి వెంకయ్య మన జాతీయజెండాకి రూపకల్పన చేసి కూడా ఈ ఏడాదికి వందేళ్లు కావటం విశేషం.

తమ స్వేచ్ఛకు అడుగడుగునా ఉన్న సంకెళ్లను తెంచుకుంటూ సంపూర్ణ స్వేచ్ఛ దిశగా సాగే క్రమంలో, ఒక జాతీయ భావనతో భారత ప్రజలు 1947 పంద్రాగస్టున

దేశానికి స్వాతంత్ర్యం సాధించుకున్నారు.

వలస పాలన నుంచి లభించిన స్వేచ్ఛను కాపాడుకుంటూ విస్తరించుకునేందుకు మెరుగైన మార్గంగా మనం ప్రజాస్వామ్య వ్యవస్థను ఎంచుకున్నాం.

మన జీవితాల్ని మనం నిర్ణయించుకునే బాధ్యత కూడా స్వేచ్ఛతోపాటు వచ్చింది. ఎవరో నాయకులు తమంతట తాము కాకుండా, మనందరం నిర్ణయించుకున్నరీతిలో, మనందరం నిర్ణయించినవారి ద్వారా దేశాన్ని నడిపించుకునే అవకాశం మనందరికీ స్వేచ్ఛా భారతం అందించింది. ఈ స్వేచ్ఛను కాపాడుకుంటూ, తగిన పరిమితుల్లో ఉపయోగించుకుంటూ.. మనందరం ఎదిగేందుకు, నివారించదగ్గ బాధలు లేకుండా హాయిగా దీర్ఘకాలం బతికేందుకు అవసరమైన విధివిధానాలతో ఒక రాజ్యాంగాన్ని రాసుకున్నాం. భారత ప్రజలమైన మేము.. అంటూ ప్రజలుగా మనకు మనమే హామీ ఇచ్చుకున్న సంవిధానమిది. ప్రజాస్వామ్యానికి చిరునామాగా చెప్పుకునే అమెరికా దేశంలో కూడా లేనట్లుగా.. మన దేశంలో ప్రజా ప్రతినిధులు ప్రజాస్వామిక రాజ్యాంగం మీద ప్రమాణం చేస్తారు. స్వతంత్రం వచ్చిన మూడేళ్లలోపే ఈ సంవిధానాన్ని అమల్లోకి తెచ్చారు. మన కోసం జీవితాల్ని ఫణంగా పెట్టిన జాతీయోద్యమ నేతలు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేతృత్వంలో తమ కలల కలనేతగా మన తరపున రాజ్యాంగాన్ని రూపొందించారు. అలా మొదలైన స్వేచ్ఛా భారత ప్రస్థానం ఈ 74 ఏళ్లలో కొన్ని చెప్పుకోదగ్గ విజయాల్ని, పలు నివారించదగ్గ వైఫల్యాల్ని చవిచూసింది.



గణనీయమైన రెండు విజయాల్లో మొదటిది, ఒక దేశంగా ఇన్ని దశాబ్దాలపాటు మనగలగటం. ఇందుకు మనమంతా ప్రధానంగా రుణపడి ఉండాల్సింది మహాత్మాగాంధీకి. లోక్‌సత్తా జేపీ అనేకమార్లు చెప్పినట్లు, గాంధీజీ లేకున్నా దేశానికి స్వతంత్రం వచ్చేది గానీ, ఒక సువిశాల సర్వసత్తాక దేశంగా భారత్ నిలబడేది కాదు. స్వేచ్ఛ అనే మాట మరచి వెయ్యేళ్లు దాటిపోయిన సమాజానికి ఆ స్వేచ్ఛను.. స్వతంత్ర పాలనకు అర్థం మరచిపోయిన సాంస్కృతిక సమూహానికి స్వయంపాలన జాతీయతను గాంధీ నూరిపోశారు. ఈ క్రమంలో భారతీయతలోని మధ్యేమార్గాన్ని గాంధీ అద్భుతంగా వినియోగించారు. సామాన్యుడ్ని - సంపన్నుడ్ని, అణగారిన వర్గాల్ని - పుట్టుకతోనే అవకాశాలు కలిగినవారిని కలుపుతూ అహింసా మార్గంలో జాతీయ ఉద్యమాన్ని నిర్మించి, నలుదిక్కుల నుంచీ దేశాన్ని ఏకం చేశారు. గొప్ప నాయకుడంటే ప్రజల్ని కలిపేవాడు తప్ప, విడదీసేవాడు కాదు అని తన జీవితమే సందేశంగా చాటారు. అలా ఆధునిక భారతదేశానికి పునాది వేయటమే కాకుండా, ప్రపంచ మానవాళికి కూడా మనుగడ మార్గం చూపి మహాత్ముడి స్థాయికి ఎదిగారు. జాతీయోద్యమంలో కొన్ని రాజకీయ నిర్ణయాల్లో పొరపాట్లు, తప్పిదాలు జరిగాయనటంలో సందేహం లేదు. కానీ ఇన్ని భాషలు, మతాలు, కులాలు, తెగలు, ఇంకా రకరకాల వైవిధ్యాలు, సంక్లిష్టతలు ఉన్న సమాజంలో అందరినీ ఒకే లక్ష్యం వైపు, ఒకే జాతి అన్న భావం వైపు నడిపించటం ఓ అసమాన కృషి. ప్రపంచ చరిత్రలోనే ఇలాంటిది ఎక్కడా కనిపించదు. మన కంటే రెండేళ్లు ఆలస్యంగా స్వతంత్రం తెచ్చుకుని, మనతో పోల్చదగిన చైనా విముక్తికి సారథ్యం వహించిన మావోసేటుంగ్‌లా గాంధీ దేశ పాలనా బాధ్యతల్ని స్వీకరించకపోయినా, ఆయన సైద్ధాంతిక కృషి, వ్యక్తిత్వం భారతదేశాన్ని కలిపి ఉంచే శక్తిగా స్వతంత్ర భారత తొలి దశాబ్దాలలో ప్రధానపాత్ర పోషించింది. ప్రజలే కాదు.. గాంధీ పట్ల అంచంచల విశ్వాసం, ఆరాధనాభావంతో స్వతంత్ర భారత తొలి తరంలోని పలువురు నాయకులు సైతం చెక్కుచెదరని దేశభక్తిని ప్రదర్శించారు. జనం కోసం చిత్తశుద్ధితో పనిచేశారు. దీనివల్లే ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ఫెడరల్ స్ఫూర్తిని పరిరక్షించుకుంటూ భారత్ ఒక దేశంగా నిలదొక్కుకుంది.

రెండోది, మన దేశం ఇన్నేళ్లలో ప్రజాస్వామ్యాన్ని కూడా విజయవంతంగా నిలబెట్టుకుంది. ఇందుకు ప్రజాస్వామ్యం పట్ల అనురక్తో, అవగాహనో కారణం కాదు. స్వతంత్రం వచ్చాక మన దేశం ప్రజాస్వామ్యాన్ని ఎంచుకోవటానికి కూడా ఇవి కారణం కావు. గాంధీ గారో, మరికొందరు మహానాయకులో చెప్పటం వల్ల మాత్రమే భారతదేశం ప్రజాస్వామ్యాన్ని ఎంచుకుంది. మరీ కాలంచెల్లుతున్న రాచరిక వ్యవస్థను కాకపోయినా.. కుటుంబ పెద్దలా వ్యవహరించే, భరోసా ఇచ్చే నాయకత్వం ఉండే ఏర్పాటున్న ఏ రకమైన వ్యవస్థనైనా మన దేశం స్వీకరించి ఉండేదేమో. కానీ ప్రజాస్వామ్యాన్ని కాకుండా, ఏకవ్యక్తి లేదా పార్టీ పాలనా విధానాన్ని భారత్ ఎంచుకుని ఉంటే ఒక దేశంగా మనుగడ కూడా ప్రమాదంలో పడి ఉండేది.

ప్రపంచ దేశాల్లో ప్రజాస్వామ్య పవనాలు బలంగా వీస్తుండటం, మన స్వతంత్ర సమరయోధులపై బ్రిటన్ ప్రభావం, జాతీయోద్యమ పోరాట స్వభావం, బ్రిటిష్ ఇండియాలోని ప్రజాస్వామ్య వ్యవస్థలు కొంతమేర వేళ్లూనుకుని కొనసాగటం, మన దేశంలో రాచరిక కాలంలోనూ బలమైన స్థానిక ప్రభుత్వాలుండటంతోపాటు

భారతదేశ సంక్లిష్ట భిన్నత్వాలు కూడా మన దేశం ప్రజాస్వామ్యం వైపు మొగ్గేలా చేసింది. ఇలాంటి అనివార్య పరిస్థితులే మన దేశంలో ప్రజాస్వామ్యాన్ని సాధ్యం చేశాయి. 74 ఏళ్ల స్వతంత్ర భారత చరిత్రలో ఒక కీలక ఘట్టంగా భావించే ఎమర్జెన్సీ సమయంలో కూడా ప్రజాస్వామ్యానికి ప్రత్యామ్నాయ వ్యవస్థ కోసం ప్రయత్నించి అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ సఫలం కాలేకపోయారంటే అందుకు ఈ అనివార్య పరిస్థితులే కారణం.

ఈ అనివార్య పరిస్థితుల వల్లే మైరన్ వీనర్ చెప్పిన ప్రమాణాల ప్రకారం ప్రజాస్వామ్యానికి ఉండాల్సిన ప్రాథమిక కొలమానాల్ని మన దేశం విజయవంతంగా అందుకోగలిగింది..

1) పోటీతో కూడిన ఎన్నికల ద్వారా ప్రభుత్వ నేతలు ఎంపికవుతారు. ప్రతిపక్ష రాజకీయ పార్టీలు కూడా ఉంటాయి.
2) ప్రజల మద్దతును పొందటానికి ప్రభుత్వ వ్యతిరేకులకు సహా అన్ని రాజకీయ పార్టీలకూ హక్కు ఉంటుంది. మీడియాను వినియోగించుకునే అవకాశంతోపాటు చట్టసభలకు సంబంధించిన స్వేచ్ఛ, మాట్లాడే స్వేచ్ఛ, ఏకపక్ష అరెస్టు నుంచి స్వేచ్ఛ వారికుంటాయి.
3) ఎన్నికలలో ఓడిపోయిన ప్రభుత్వాలు దిగిపోతాయి, గెలిచినవారు ఓడిపోయినవారిని శిక్షించరు, ప్రభుత్వంలో ఉన్నప్పుడు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితేతప్ప ఓడిపోయిన నేతలను శిక్షించటం జరగదు, వారికి పడే శిక్ష కూడా చట్టప్రకారం నిర్దేశిత పద్ధతిలోనే ఉంటుంది.
4) ఎన్నికైన ప్రభుత్వాలు ఉత్సవ విగ్రహాలు కావు, అవి అధికారాన్ని వినియోగిస్తూ విధానాలను రూపొందిస్తాయి. సైన్యానికో, రాజుకో, కొందరు మత గురువులకో, అధికారగణానికో, సంపన్న కూటమికో కాకుండా తమను ఎన్నుకున్న ఓటర్లకే ఆ ప్రభుత్వాలు బాధ్యత వహిస్తాయి.

ఈ ప్రజాస్వామ్య ప్రమాణాల్లో.. మనతోపాటు వలస పాలన నుంచి విముక్తి పొందిన అనేక దేశాల కంటే మన దేశం మెరుగ్గా ఉందనటంలో సందేహం లేదు.

ఎన్ని లోపాలున్నా మన వద్ద ప్రజలకు స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశముంది, ఎన్నికలు సక్రమంగా జరుగుతాయి, ఎన్నికల సంఘం స్వతంత్ర ప్రతిపత్తితో వ్యవహరిస్తుంది, ఫలితాల అనంతరం అధికార మార్పిడి శాంతియుతంగా జరుగుతుంది.. ప్రజాస్వామ్యాన్ని నడపటం ఎంత కష్టమో మన పక్కనే ఉన్న పాకిస్థాన్, మయాన్మార్‌ల అనుభవాలను చూస్తే అర్థమవుతుంది. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించటం, పెంపొందించటం ఎంత కష్టమో ప్రజాస్వామ్యానికి పాఠ్యపుస్తకంలాంటి అమెరికాలో ఇటీవలి ఎన్నికల పరిణామాల్ని చూస్తే బోధపడుతుంది. ఈ కోణంలో చూస్తే, మన దేశం ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టుకుందని చెప్పవచ్చు.

ఇదేసమయంలో, మన ప్రజానీకంలో ప్రజాస్వామ్య తత్వం బహుతక్కువ కావటం వల్ల మన ప్రజాస్వామ్య పరిణతి నత్తనడకన జరుగుతోంది. నాణ్యత పెరగటం లేదు. యాదృచ్ఛికంగానో, విధిలేని పరిస్థితుల్లోనో, కాలానుగుణంగానో, కొన్ని సందర్భాల్లో ఎవరైనా సర్వశక్తులూ ఒడ్డి అలుపెరగకుండా మొండిగా పోరాడితేనో తప్ప సంవిధాన ప్రజాస్వామ్యాన్ని మెరుగుపరిచే సరైన సంస్కరణలు మన దేశంలో జరగటం లేదు. సాంకేతికతను దిగుమతి చేసుకున్న, పెంపొందించుకున్నంత తేలిగ్గా ప్రజాస్వామ్యాన్ని పెంపొందించుకోలేకపోతున్నాం. ప్రజాదరణ గల నాయకులు కూడా ఆచరణసాధ్య మార్పుల్ని ప్రవేశపెట్టటానికి, ప్రజల్ని నడిపించటానికి చొరవ చూపటం లేదు.

సాటి మనిషిని పుట్టుకను బట్టి అమానుషంగా అణచివేసే కుల వివక్షను చాలా మామూలే అన్నట్లు శతాబ్దాల నుంచి మన దేశం పాటిస్తోంది. దీనికితోడు పెత్తందారీ సంస్కృతి. కుటుంబం నుంచి ప్రజాజీవితం దాకా కూడా. తప్పులేదు కాబట్టి ఈ అప్రజాస్వామిక ధోరణుల మధ్యే ప్రజాస్వామ్య మార్గాన్ని భారతదేశం స్వీకరించటం, వ్యవస్థీకృత మార్పులకు తగిన ప్రజాస్వామ్య సంస్కరణలు కొరవడటం వల్ల భిన్నత్వంలో ఏకత్వం కన్నా వైరుధ్యాలే ఇంకా ఎక్కువగా కొనసాగుతున్నాయి.

స్వతంత్రం వచ్చిన ఏడు దశాబ్దాలు దాటిన తర్వాత ఇటీవల మన దేశంలో 'ప్యూ రీసెర్చి సెంటర్' సంస్థ జరిపిన సర్వేలో.. భారతీయులుగా ఉండటమంటే హిందువులుగా ఉండటమేనని 64% మంది చెప్పారు. నూటికి 87 మంది మతాంతర వివాహాల పట్ల వ్యతిరేకతను వెల్లడించారు. 67 శాతం మంది హిందువులు తమ అమ్మాయిలు ఇతర మతాలవారిని వివాహం చేసుకోకూడదని బలంగా భావిస్తున్నారు. ముస్లింలలో 80 శాతం, కాలేజీ గ్రాడ్యుయేట్లలో 54 శాతం కూడా ఇలాగే భావిస్తున్నారు. తమ మగపిల్లల విషయంలో మతాంతర వివాహాల్ని వ్యతిరేకించే హిందువులు 65 శాతం దాకా ఉన్నారు. కానీ ఇదే సమయంలో.. ఇతర మతాలకు స్వేచ్ఛ, పరమత సహనం ఉండాలని దేశంలోని అన్ని మతాలవారూ ముక్తకంఠంతో చెప్పారు. ప్యూ సర్వే కులాల గురించి చెప్పకపోయినా, కులాల పరంగా కూడా ఇదే తరహా భావోద్వేగ ఆలోచనాతీరు కొనసాగుతుంటుందనటంలో సందేహం లేదు. రోజూ, చుట్టూ చూస్తూనే ఉన్నాం గదా! ఒక రకంగా కులం ఆధారితం కావటం వల్లే హిందూ మతం.. ఈ మతం నుంచే రూపుదిద్దుకోవటం వల్ల ఇతర మతాలూ పరమతాల పట్ల అంత అంటరానితనాన్ని, ఒంటరితనాన్ని పాటిస్తున్నాయేమో. ఈ ధోరణుల్ని రూపుమాపాల్సిన రాజకీయం వీటిని 'గతమంతా ఘనమైనది' అనే అపోహతో లేదా అవకాశవాదంతో ఉపయోగించుకునే ప్రయత్నం చేయటం వల్ల అవి ఇంకా విజృంభిస్తున్నాయి. ఇది కూడా ప్యూ సర్వేలో తేలింది. మతాన్ని రాజకీయంతో ముడిపెట్టే ఓ రాజకీయ భావజాలాన్ని సమర్థించే ప్రజల్లో ఈ ధోరణి మరింత ఎక్కువగా ఉన్నదని వెల్లడైంది. ఇవన్నీ చూస్తే, మన దేశంలో వైవిధ్యం కంటే వైరుధ్యాలు ఎక్కువగా ఉన్నాయని .. భిన్నత్వంలో ఏకత్వం కంటే వైరుధ్యాల మధ్య సహజీవనం మన సంస్కృతిలో భాగమైందని, ఒక ఉమ్మడి పౌరతత్వం లోపిస్తోందని భావించాల్సి ఉంది.

**ప్రజాస్వామీకరణ ఆలస్యమవుతున్నకొద్దీ స్వేచ్ఛ మూల్యం చెల్లిస్తుంటుంది**

రాజ్యాంగానికి, మన సమాజానికి మధ్య ఉన్న అగాధాన్ని త్వరితగతిన పూరిస్తూ జనావళిలో ప్రజాస్వామ్య సంస్కృతిని పాదుకొల్పకుంటే మన ప్రజాస్వామ్య పరిణతి క్రమం యథాలాపంగా సాగుతూ మన స్వేచ్ఛా వికాసం మూల్యం చెల్లిస్తుంటుంది. మిగతా కొన్ని దేశాల్లా మనకు సమయం లభించే అవకాశం లేని పోటీయుగం కాబట్టి.. మన ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే పరిణామాలు కూడా మన చేతుల్లో లేకుండా వేగంగా చోటు చేసుకునే అవకాశముంది.

**చైనా కంటే ఎక్కువ ఒడుపు, సామర్థ్యం కావాలి**

చైనాలో కమ్యూనిస్టు విధానాలు ఉండటం ప్రగతికి అవరోధం కావటంతో మావో సేటుంగ్ అనంతర కాలంలో డెంగ్ జియావోపింగ్ నాయకత్వం వచ్చాక పెట్టుబడిదారీ వ్యవస్థను, సామ్యవాదాన్ని మిళితం చేసి సంస్కరణల్ని ప్రవేశపెట్టారు. తనకు ముందున్న చైనా సారథులు తిరస్కరించిన లీ క్వాన్ యూ నమూనానే డెంగ్ ఎక్కువగా అమలు చేశారని విశ్లేషకుల అభిప్రాయం. ఆధునిక సింగపూర్ వ్యవస్థాపకుడు లీ క్వాన్ యూ రాజకీయంగా ఉక్కు పిడికిలితో వ్యవహరించారు. స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికల్ని నిర్వహించినా రాజకీయ ప్రత్యర్థుల్ని కఠిన శిక్షలతో అణచివేశాడు. ఏకపార్టీ పాలన సాగించారు. ఇదే సమయంలో ఆర్థిక రంగంలో మాత్రం ప్రపంచం నలుమూలల్నుంచి పెట్టుబడుల్ని, సాంకేతికతను ఆహ్వానిస్తూ స్వేచ్ఛాయుత సంస్కరణల్ని అమలు చేశారు. ఆదాయాలు పెరగటానికి కావలసిన అవినీతిలేని పౌర సేవల్ని, విద్య, ఆరోగ్యం వంటివి ప్రభుత్వం తరపున అందిస్తూ ఉత్పాదకతను పెంచే సంక్షేమాన్ని అమలుచేస్తూ.. వాణిజ్యం, ఉపాధి వంటివన్నీ ప్రయివేటుకు వదిలేశారు. ఈ నమూనాతో అమెరికాతో పోటీ పడగలిగే స్థాయి తలసరి ఆదాయాన్ని (సుమారు 60,000 డాలర్లు) సింగపూర్ సాధించేలా చేశారు. ఇది చైనా కంటే దాదాపు ఆరు రెట్లు ఎక్కువ. సింగపూర్ సక్సెస్ స్టోరీనే డెంగ్ చైనాలో సంస్కరణలతో అమలు చేయటం వల్ల చైనా గణనీయంగా అభివృద్ధిని సాధించిందని నిపుణుల అంచనా. అయితే.. వలస పాలన పేదరికం నుండి సింగపూర్‌ని ప్రపంచస్థాయి సంపన్నదేశంగా మార్చిన లీ క్వాన్ యూ కూడా భారతదేశంలో మౌలిక మార్పులు అంత సులభం కాదని అభిప్రాయపడ్డారు. భారత్ కంటే ఎక్కువ జనాభా ఉన్న చైనాలోనైనా మార్పుని తేవచ్చుగానీ, భారత్‌లో మాత్రం అంత తేలిగ్గా సాధ్యం కాదని ఆయన అన్నారు. దీనికి ప్రధాన కారణంగా రకరకాల కులాలు, మతాలు, భాషలు, ఆచారవ్యవహారాలతో ఇండియా సంక్లిష్ట భిన్నత్వం కలిగి ఉండటమేనన్నారు. ఈ నేపథ్యంలో.. మన దేశానికి అనివార్యంగా తగిన, ఉన్న వ్యవస్థల్లో మెరుగైన ప్రజాస్వామ్యం ఎంతో సున్నితమైనది కూడా కాబట్టి, చైనా కంటే ఎంతో ఒడుపుగా, ఓర్పుగా, ముందుచూపుతో మనం బలోపేతానికి చర్యలు చేపట్టాలి. అప్పుడే చైనా కంటే మిన్నగా సుస్థిరావృద్ధిని సాధించగలం. ఈ లక్ష్యసాధన పూర్తిగా సాధ్యం కూడా.

**స్వేచ్ఛకు లోటేముంది అనిపించొచ్చు, కానీ..**

స్వతంత్ర భారత దేశంలో ప్రజాస్వామ్యం ఉంది, మన ప్రజాస్వామ్య రాజ్యాంగం మనకుస్వేచ్ఛకు భరోసానిచ్చింది. మనకు నచ్చింది మాట్లాడుకోగలుగుతున్నాం కాబట్టి.. స్వేచ్ఛ బ్రహ్మాండంగానే ఉంది కదా అనుకోవచ్చు. కానీ మనకున్న స్వేచ్ఛ మనం, మన పిల్లలు ఎదగటానికి నిజంగా ఉపయోగపడుతోందా? కొంచెం జాగ్రత్తగా ఆలోచిస్తే చాలు, మన దారుణ వైఫల్యాలు కుప్పలుగా కనిపిస్తాయి.

ఉదాహరణకు మనకు కాస్త ఆదాయమున్న ఉద్యోగం రావాలన్నా, పైస్థాయికి ఎదగాలన్నా మంచి చదువు ఉండాలి. ఏదో డిగ్రీ కాగితం ఉంటే చాలదు. సమాజంలో ఉన్న సమస్యల్ని పరిష్కరించి, అవసరమైన సేవల్ని అందించి లాభాల్ని ఆర్జించే శక్తి ఉండాలంటే పైపై చదువులతో సాధ్యం కాదు. కానీ అలాంటి నాణ్యమైన చదువు అందించే స్కూళ్లలో, కాలేజీల్లో మనం చదవగలిగామా? మన పిల్లల్ని చదివించగలుగుతున్నామా?.. కొద్దిమందికి మాత్రమే ఆ అవకాశం ఉంది. అరకొర చదువులతో, సర్టిఫికెట్లలో తప్ప స్థాయిలేని చదువులతో మనలో చాలామందికి పెద్ద ఉద్యోగాలు రావటం లేదు, కొత్త ఆలోచనలతో వ్యాపారాలు చేసి సంపాదించే అవకాశాల్ని అందుకోలేకపోతున్నాము. రిజర్వేషన్ల చుట్టూ రాజకీయాలు తప్ప సరైన చదువును అందించకపోవటంతో ఇతరులతో పోటీపడే అవకాశాల్ని కోల్పోయిన మనకు స్వేచ్ఛ ఉన్నట్లా?

**ఇంకో ఉదాహరణ ఆరోగ్యం.**


ఆరోగ్యమే మహాభాగ్యం, వైద్యుడు లేని ఊళ్లో ఉండకూడదు.. అని స్వతంత్రం రాకముందు నుంచీ భారతదేశంలో ఉన్న నానుడులు. కానీ ఇంత ముఖ్యమైన ఆరోగ్యం కోసం ఎంత ఆధునిక వైద్యాన్నయినా అందుకోగల స్వేచ్ఛ మనలో ఎంతమందికుంది? మనలో చాలామంది ఆరోగ్యం కోసం అప్పుల పాలవటమో, డబ్బు ఖర్చు చేసే స్తోమతు లేక లేదా డబ్బు ఖర్చు చేసినా కూడా ప్రాథమిక దశలో సరైన చికిత్స లేకపోవటం వల్ల అకాల మరణం పాలవటమో, ప్రభుత్వ అరకొర స్కీములతో అనారోగ్యంతో నెట్టుకురావటమో చేస్తున్నాం. వైద్యం కోసం భారతీయులు సొంత జేబు నుంచి తీసి చేసే ఖర్చు 63% మేర ఉన్నట్లు యూనియన్ వైద్యారోగ్య శాఖ సహాయ మంత్రి భారతీ ప్రవీణ్ పవార్ ఈ వర్షాకాల సమావేశాల్లో పార్లమెంటుకి చెప్పారు. తాజా గ్లోబల్ హెల్త్ ఎక్స్‌పెండిచర్ డేటాబేస్ ప్రకారం వైద్యానికి ప్రజలు జేబులో నుంచి చేసే వ్యయం ఫ్రాన్స్‌లో కేవలం 9% ఉందని మంత్రి తెలిపారు. సూడాన్ లాంటి దేశాలు మాత్రమే మన కంటే అధ్వాన్నంగా ఉన్నాయి. మన దేశంలో ఆరోగ్య రంగంలో 2013-14లో 69.1% ఉన్న ప్రజల సొంత ఖర్చు 2016-17 నాటికి 5.9% మేర తగ్గి 63.2%కి చేరిందని (ఆరోగ్యశ్రీ, ఇతర ప్రభుత్వ స్కీములున్నా) మంత్రి తెలిపారు.

మనకు తాగడానికి, సినిమాలు చూడటానికి, కాలక్షేపం కబుర్లు చెప్పుకోవటానికి స్వేచ్ఛ ఉంది తప్ప, మన ప్రాణాలకి, మన సంపాదనకి, మన బిడ్డల భవిష్యత్తుకి అవసరమైన విషయాల్లో మాత్రం స్వేచ్ఛ లేదు. డబ్బున్నవారికి, కొందరు అదృష్టవంతులకు తప్ప, మిగిలినవారికి అరకొర చదువే అందుతుంది. కేవలం వైద్య సేవల ఖర్చు భరించలేక ఏటా మన దేశంలో సుమారు 5 కోట్ల మంది పేదలవుతున్నారు.

సరైన ఆరోగ్యం, మంచి చదువును అందుకునే స్వేచ్ఛ లేకుండా రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛ మనకు ఎంతమేర ఉన్నట్లు? రాజ్యాంగం మనకు ఇచ్చిన స్వేచ్ఛను ఆ రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన ప్రభుత్వాలు సరిగా అమలు చేస్తున్నట్లా?

**ఆ రెండు స్వేచ్ఛలనూ దాటనీయకుండా..**

మనకు భావప్రకటనా స్వేచ్ఛతోపాటు ఓటు వేసే స్వేచ్ఛ కూడా ప్రజాస్వామికం అని చెప్పుకోగలిగే స్థాయిలో ఉంది. అయితే అవి దాటి మన స్వేచ్ఛ విస్తరించకుండా ఒక కుట్ర పన్నినట్లు అడ్డుకుంటుండటం వల్ల.. ఈ రెండు స్వేచ్ఛలు కూడా సద్వినియోగం కాకుండా తరచూ దుర్వినియోగమై లేదా మన ప్రయోజనాలకే విరుద్ధమైన పర్యవసానాలిచ్చే రీతిలో ఉంటున్నాయి. మనం అపరిపక్వత, పేదరికం నుండి పరిజ్ఞానం, ఆదాయాల వైపు ఎదగలేకపోతున్నాం. పౌష్టికాహారం ఇవ్వని, ఉపాధి కల్పించని, ఆదాయాలు పెంచని స్వేచ్ఛ ఉండి ఏం లాభం? ఇప్పటిదాకా మనకేదో ఉందని చెప్పుకుంటున్న భావప్రకటనా స్వేచ్ఛకి కూడా ఈమధ్య కాలం చెల్లిన చట్టాలతో, రకరకాల వక్రమార్గాలతో




కళ్లాలు వేస్తుండటం ఈ వైఫల్యానికి కొసమెరుపు.

**మనం సరైన ప్రశ్నలు అడగాలి**

ఈ మొత్తానికీ మూలం ఎక్కడుందంటే.. మనం సరైన ప్రశ్నలు అడగటం లేదు. మనకున్న హక్కుల్ని తెలుసుకుని వాటి నుంచి ప్రశ్నలు అడగటం లేదు.

మనం అడగాల్సిన సరైన ప్రశ్నలు ఏవీ అంటారా.. చూడండి.

- కరోనా కాలంలో ఎందుకు ఇతర దేశాలు కూడా జాలిపడాల్సిన దారుణమైన పరిస్థితుల్ని మన రాష్ట్రంలో, దేశంలో ఎదుర్కోవాల్సి వచ్చింది?
- కరోనాకు ముందు కూడా ఎందుకు రోజుకు లక్షన్నర మంది కేవలం ఆస్పత్రుల్లో వైద్యం కోసం అప్పులు చేసి పేదలుగా మారిపోతున్నారు?
- ఎందుకు రోజుకు 2000 మంది పసిపిల్లలు అకాల మరణం పొందుతున్నారు?
- ఎందుకు లక్షలమంది రోగాలబారిన పడి పనిచేసే శక్తిని కోల్పోతున్నారు?
- ఎందుకు హైస్కూలు విద్యార్థి రెండో తరగతి లెక్కలు చేయలేకపోతున్నాడు?
- ఎందుకు 16 ఏళ్ల వయసొచ్చినా గడియారం చూసి నిమిషాలు, సెకన్లతో టైమ్ చెప్పలేని విద్యార్థులున్నారు?
- ఎందుకు ఇంజినీరింగ్ చదివినా ఉద్యోగానికి పనికొచ్చే నైపుణ్యాలు ఉండటం లేదు, ఇంట్లో స్కూటర్ బాగు చేసే తెలివి కూడా ఉండటం లేదు?
- ఎందుకు ఎవరోకరి రికమండేషనో, లంచమో లేకుండా పోలీస్ స్టేషన్‌కి వెళ్లటానికి ప్రజలు అంత భయపడుతున్నారు?
- ఎందుకు గవర్నమెంట్ ఆఫీసులో లంచాలు, వేధింపులు లేకుండా పనులు అవటం లేదు?
- ఎందుకు బయటికెళ్లి సురక్షితంగా తిరిగొస్తామన్న ధైర్యం మగవాళ్లకు కూడా ఉండటం లేదు?
- ఎందుకు అమ్మాయిల మీద వేధింపులు, అత్యాచారాలు పెరుగుతున్నాయి?
- ఎందుకు ఆడపిల్లలు చదువుకుని ఉద్యోగాలు చేయటం కన్నా పెళ్లి చేసుకుని అత్తింటికి వెళ్లటమే మేలని ఎక్కువమంది ఇంకా అనుకుంటున్నారు?
- ఎందుకు చట్టం అందరికీ సమానంగా అమలవటం లేదు? డబ్బున్నవాళ్లలా పేదవాళ్లు ఎందుకు బెయిల్ తెచ్చుకోలేకపోతున్నారు?
- ఎందుకు కోర్టులకెళ్తే న్యాయం లభిస్తుందన్న నమ్మకం లేదు? ఎందుకు గూండాలు సెటిల్‌మెంట్లు చేస్తున్నారు?
- ఎందుకు ఇంటి ముందే పరిష్కారమవ్వాల్సిన పనులకు హైదరాబాద్, ఢిల్లీలకు వెళ్లాల్సి వస్తోంది?
- ఎందుకు కష్టపడి పండించిన పంటకు న్యాయమైన ధర రావటం లేదు?
- ఎందుకు..?

.. ఎందుకంటే మనం రాజకీయం అంటే ఏమిటి, ప్రభుత్వాలు ఏం చేయాలి? అనే విషయాల్ని స్వతంత్రం వచ్చి 75 ఏళ్లు అవుతున్నా పట్టించుకోలేదు కాబట్టి. రాజకీయాలు మన జీవితాల గురించే ఉన్నాయి, ప్రభుత్వాలు అంటే మన జీవితాల్ని బాగు చేయటానికి తాత్కాలికంగా, చట్టపరిధిలో పనిచేసేందుకు మనం ఎన్నుకున్న ప్రతినిధులు అని మనం గుర్తించటం లేదు కాబట్టి.

రాజకీయాల్లో ప్రభుత్వాలు చాలా ముఖ్యమైనవి. ప్రభుత్వాలు ఏం చేయాలో మనకు స్పష్టత లేకపోతే, రాజకీయాల వల్ల మనం నష్టపోతూనే ఉంటాం. మన ఓటు ద్వారా ఎన్నికయ్యే ప్రభుత్వాలు మనకు చేయాల్సిన సేవలేంటో మనం గుర్తించకపోబట్టే, కరోనా కాలంలో ఆరోగ్యం అందక అల్లాడిపోయాం, సంక్షోభాన్ని ఎదుర్కొనే నైపుణ్యాల్ని ప్రదర్శించలేకపోయాం, ఆర్థికంగా అనేక సమస్యల్ని ఎదుర్కొన్నాం.

మనం రాజకీయాల్ని, అందులో ప్రభుత్వం చేయాల్సిన పనుల్ని సరిగా అర్థం చేసుకోకపోవటంతో నాయకులు కూడా మన నెత్తిన ఎక్కి పెత్తనం చేస్తున్నారు. ప్రభుత్వాలు చేయాల్సిన పనుల గురించి అడగకుండా, ప్రజలుగా, ఓటర్లుగా మనకున్న విలువను అర్థం చేసుకోకుండా.. మనమేదో చేతులు జాచి తీసుకునేవాళ్లం, వాళ్లేదో ఉచితంగా ఇచ్చేవారు అనే రీతిలో అడగటం వల్ల నష్టపోతున్నాం. పాలకులంటే రారాజులన్నట్లు వారికి తలవంచుతూ ఎన్నికల సమయంలో మాత్రమే మనం శక్తిమంతులమనుకోవటం వల్ల

నష్టపోతున్నాం.

అందుకే.. ప్రశ్నలడిగితే సరిపోదు.. సరైన ప్రశ్నలడగాలి.

అలాగే.. ఎలా పడితే అలా అడిగితే లాభం ఉండదు. ఈ ఊరు మాది, ఈ జిల్లా మాది, ఈ దేశం మాది, పాలకులారా! మీకు కేవలం మా తరపున కొంతకాలంపాటు అధికారం మాత్రమే ఇచ్చాం అని యజమానుల్లా అడగాలి.

**ఎజెండాను మార్చాలి**

ఈ ప్రశ్నల్లోని స్వేచ్ఛలన్నింటికీ అత్యంత ప్రజాస్వామ్యయుతమైన మన రాజ్యాంగం అవకాశం కల్పించినా, అందుకు తగ్గ ఎజెండాను మన పాలనలోకి రాకుండా మన రాజకీయం, సామాజిక ధోరణులు నిలువరిస్తున్నాయి. ప్రజలందరినీ సమానంగా చూస్తూ, సమానంగా ఎదిగే అవకాశాలనివ్వాలన్న ప్రజాస్వామిక దృక్పథానికి విరుద్ధంగా మన నాయకులు వ్యవహరిస్తుండటంతో ప్రజల చేతుల్లో ఉండాల్సిన సార్వభౌమాధికారం పాలకులు, కొందరు సంపన్నులు, అధికార గణం చేతుల్లో బందీగా మారిపోయింది. డెబ్బై నాలుగేళ్ల క్రితం పంద్రాగస్టున మనకు లభించిన స్వేచ్ఛ మన జీవితాల్లో భాగం కావాలంటే మనం ఎజెండాను మార్చాలి. ప్రభుత్వాలు ప్రజాస్వామ్యానికనుగుణమైన విధానాలను తమ మౌలిక బాధ్యతగా గుర్తించి అనుసరించేలా మార్పుల్ని తీసుకురావాలి. ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం, ఉపాధి అవకాశాల పెంపుకి భారీగా మౌలిక వసతులు, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా సేవలు, అధికారాన్ని వికేంద్రీకరించి ప్రధానమంత్రి–ముఖ్యమంత్రి–జిల్లా కలెక్టర్ నుంచి ప్రజల ముంగిట్లో రోజువారీ పాలనకు స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయటం, పొట్ట చేత పట్టుకుని వలసలు పోవాల్సిన అవసరం లేకుండా గ్రామాల మధ్య చిన్న పట్టణాల అభివృద్ధి మనం వేగిరం సాధించుకోవాల్సిన సంస్కరణలు. వీటితోపాటు..

**నగరాలతో మొదలుపెట్టి స్థానిక ప్రభుత్వాల బలోపేతానికి చర్యలు**

నగరీకరణ పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేకించి నగరాలలో మౌలిక వసతుల్ని పెంచేందుకు, స్థానిక స్వయంపాలనను పటిష్ఠం చేసేందుకు చర్యలు అవసరం. అన్నిటినీ ప్రజల భాగస్వామ్యంతో సాంకేతికత వినియోగంతో చేపట్టాలి.

కేంద్రీకృత వ్యవస్థ వల్ల మన స్వయంపాలన ఎంత అధ్వాన్నంగా ఉందంటే, సుమారు 90 ఏళ్ల జాతీయోద్యమ పోరాటంలో అసంఖ్యాక నేతలు రూపుదిద్దుకోగా, స్వతంత్రం వచ్చిన రెండు మూడు దశాబ్దాల నుంచే మన దేశంలో తీవ్ర నాయకత్వ కొరత మొదలైంది. బలహీన స్థానిక ప్రభుత్వాలు.. దళారీతనాన్ని, యాచక ప్రవృత్తిని, మితిమీరిన వ్యక్తిగత ధోరణుల్ని తప్ప నాయకత్వాన్ని పెంచలేకపోతున్నాయి. దాదాపు భారతదేశ జీడీపీతో సమాన ఆదాయం కలిగిన మైక్రోసాఫ్ట్ కంపెనీకి ఛైర్మన్, సీఈఓగా మన తెలుగువాడు ఎంపికైనందుకు పొంగిపోతూ ఇటీవల ఒక న్యూస్ ఛానల్ సత్య నాదెళ్ల సొంత ఊరిలో ప్రజలను కలిసి అభిప్రాయం సేకరించగా, దాదాపు ప్రతి ఒక్కరూ ఆయన వచ్చి తమకు ఏదో చేయాలన్నట్లే, ఆయన నుంచి ఏదో ఆశిస్తున్నట్లే మాట్లాడారు తప్ప ఆయనలా తమ జీవితాల్ని, తమ ఊరిని బాగుచేసుకుంటామన్న ఆత్మవిశ్వాసాన్ని, కొత్త పుంతల ఆలోచనల్ని ప్రకటించలేకపోయారు. 2021లో ఇదీ పరిస్థితి! నగరాలతో మొదలుపెట్టయినా.. స్థానిక ప్రభుత్వాల బలోపేతానికి తగిన చర్యల్ని మనం ప్రారంభించాలి. అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యాలను అందించే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుని, అందులో కీలకమైన పాఠశాల విద్య, ప్రాథమిక వైద్యాలను నిధులు, అధికారాలు ఉన్న స్థానిక ప్రభుత్వాల పరిధిలోకి తేవాలి.

**కార్పొరేటర్‌కి, ఎమ్మెల్యేకి, ఎంపీకి తేడా తెలిసేలా ఎన్నికల వ్యవస్థను సంస్కరించాలి**

అధికారం పట్ల అంతులేని ఆరాధనా భావం ఉన్న మన సమాజంలో.. ఎన్నికల వ్యవస్థ కూడా సమస్యలో భాగంగా మారింది.

ఎవరోకరు అధికారంలోకి వచ్చే రీతిలో ఎన్నికల్లో పాల్గొనటం కాకుండా, సామర్థ్యమున్న సరైన పౌరులు అధికారంలోకి వచ్చేలా ఎన్నికల వ్యవస్థని మనం పునర్నిర్మించుకోవాలి. అమెరికాలాంటి దేశం కూడా చేయలేనిరీతిలో మన దేశం సాహసోపేతంగా అందరికీ వయోజన ఓటుహక్కునిచ్చింది. కానీ ఆ ఆదర్శోత్సాహంలో ఓటును విచక్షణతో వినియోగించే ఏర్పాట్ల మీద తగిన దృష్టి సారించలేదు. మన దేశంలో ఈవేళ ఓట్లు వేస్తున్నవారిలో ఎక్కువమంది పంచాయతీ/మునిసిపాలిటీలోని కౌన్సిలర్ లేదా కార్పొరేటర్‌కి, రాష్ట్ర స్థాయిలో ఎమ్మెల్యేకి, జాతీయ స్థాయిలో ఎంపీకి తేడా తెలిసి ఓట్లు వేయటం లేదు. ముఖ్యమంత్రినో, రాష్ట్రంలో ఎవరో బలమైన నాయకుడినో చూసి అనుకూలంగానో, వ్యతిరేకంగానో ఓట్లు వేస్తున్నారు. అవిద్య విస్తారంగా ఉన్న మన దేశంలో ఈ సమస్య తలెత్తకుండా స్వతంత్రం వచ్చిన తొలినాళ్లలో కొన్ని ఏర్పాట్లు చేసి ఉంటే మన ఎన్నికల వ్యవస్థ మెరుగ్గా ఉండేది. సమర్థంగా పాలించగలిగేవారు గెలవలేరు, గెలిచినవారిలో ఎక్కువమంది సమర్థంగా పాలించలేరు.. అనే దుస్థితి ఏర్పడేది కాదు. అందరికీ ఓటు హక్కును ఇస్తూనే.. అందరికీ నాణ్యమైన విద్యనిందించే ఏర్పాటు చేసి, విద్యార్హతలను బట్టి స్థానిక, రాష్ట్ర, జాతీయ, మూడు ఎన్నికల్లోనూ ఓటు వేసే విధంగా ఓటర్లను వర్గీకరించి ఉండొచ్చు. అప్పుడు.. నిరక్షరాస్యులు, తక్కువ విద్యార్హతలు ఉన్నవారు స్థానిక ప్రభుత్వాల ఓటర్లుగా ఉండేవారు. పౌరుని జీవితంలో దాదాపు 80 శాతం సమస్యలను పరిష్కరించే స్థానిక పాలన బలంగా ఉండటంలో వారి పాత్ర ఎంతో విలువైనదిగా మారేది. అలా మూడు స్థాయిల మధ్య తేడా స్పష్టంగా ప్రజలకు అర్థమయ్యేది, కాలక్రమంలో అందరూ అన్ని స్థాయిల్లోనూ ఓటర్లుగా మారి ఉండేవారు. ఇప్పటికైనా మనం ఓటుకు, మన పన్నుల డబ్బుకి, మన జీవితానికి మధ్య సంబంధం అర్థమయ్యేలా ఎన్నికల వ్యవస్థను నిర్మించుకోవటం అవసరం. ప్రజలు స్వయంగా అడగకపోయినా తమకు మేలు చేసే పనుల్ని ప్రభుత్వాలు చేస్తుంటే కష్టమైనా సమర్థిస్తారనటానికి, కాలక్రమంలో అలా చేసిన పాలకులకు ఓట్లు

పెరుగుతాయనటానికి అనేక ఉదాహరణలున్నా కూడా ఎన్నికల్లో ఆ అంశాలను ప్రస్తావించి ఓట్లు తీసుకునే నాయకత్వ సామర్థ్యాన్ని మన ప్రధాన పార్టీలు ప్రదర్శించలేకపోతున్నాయి. ప్రజల్ని ప్రలోభపెట్టో లేదో రెచ్చగొట్టి విభజించో ఎలాగోలా ఓట్లు సంపాదించటానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నాయి. ఎన్నికల మేనిఫెస్టోల్లో తాత్కాలిక తాయిలాల పథకాలు, ఎన్నికల్లో ప్రలోభాలు, డబ్బు ప్రభావాల్ని కట్టడి చేసేందుకు, చట్టసభల గౌరవాన్ని, చర్చల ప్రమాణాల్ని పెంచేందుకు, ఫిరాయింపుల్ని నిరోధించేందుకు.. రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులకు ప్రత్యక్ష ఎన్నికలు, దేశవ్యాప్తంగా దామాషా ఎన్నికల పద్ధతి మనం వీలైనంత త్వరగా అమలు చేయాల్సిన సంస్కరణలు. ఎలాగూ అధ్యక్ష తరహా ధోరణి దిశగా ఉన్నకొద్దీ వ్యక్తుల మధ్యే మన ఎన్నికలు జరుగుతున్నాయి కాబట్టి.. ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నికను ఓ మెరుగైన పరిష్కారంగా అమలు చేయటానికి ఏ పార్టీకి అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదు.

ఎన్నికల వ్యవస్థలో ఈ ఏర్పాట్ల వల్ల అన్ని అవినీతులకీ తల్లి వేరు లాంటి రాజకీయ అవినీతి కూడా అదుపులోకి వస్తుంది, ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ జోక్యం తగ్గి దళారీలు లేకుండా ప్రజలకు నాణ్యమైన సేవలందే అవకాశాలు మెరుగవుతాయి, రాజకీయ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పాదుకొల్పటం సైతం తేలికవుతుంది. తద్వారా వంశపారంపర్య రాజకీయ నేతల స్థానంలో సేవాభావం, సమర్థత గల సామాన్య జనరాజకీయ నేతలు రాజకీయాల్లో నెగ్గగలుగుతారు. 'ఒకే దేశం - ఒకే ఎన్నిక' కోసం జాతీయస్థాయిలో అధికారంలో ఉన్న పార్టీ ప్రయత్నిస్తున్న నేపథ్యాన్ని ఉపయోగించుకుని ఈ ఎన్నికల సంస్కరణలను సాధించేందుకే ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా 'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' (ఐడీడబ్ల్యూఏ - ఆచరణలో భారత ప్రజాస్వామ్యం) వేదికగా తొలి జాతీయ సదస్సును 2020లో 'ధనరాజకీయాల'పై నిర్వహించింది.

**చట్టబద్ధపాలన ఉంటేనే ముమ్ముందు మనుగడ, వృద్ధి**

కొన్ని చట్టాలు దుర్వినియోగమవుతూ ప్రజల గొంతు నొక్కేస్తుండటంపై ఇటీవల కొందరు గొంతు పెంచారు. ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కానీ ఏదో నచ్చింది మాట్లాడుకునే స్వేచ్ఛ ఉంది అనుకోవటం తప్ప.. భావప్రకటనాస్వేచ్ఛ అనే స్థాయి ఆలోచన, అందుకు అవకాశం మన దేశంలో ఓట్లు వేసే ప్రజల్లో ఎక్కువమందికి ఉందా? అని కూడా మనం ఆలోచించాలి.

స్వతంత్ర భారత చరిత్రలో అతిపెద్ద పరిణామంగా చెప్పుకునే డీమానిటైజేషన్ (పెద్దనోట్ల రద్దు) తర్వాత తమ వద్దనున్న నోట్లకు ప్రత్యామ్నాయంగా వెంటనే నగదును అందించని ప్రభుత్వ నియంతృత్వాన్ని, వైఫల్యాన్ని సైతం సామాన్య ప్రజలు ప్రశ్నించకుండానే భరించారు. ఉపాధి కోల్పోతున్నా క్యూ లైన్లలో నిలబడి ఓపిగ్గా నిరీక్షించారు. రోజుల తరబడి అలా సాగింది. అలాగే 2020లో కొవిడ్ వచ్చాక కఠిన లాక్‌డౌన్‌ను ఎటువంటి వ్యవధి లేకుండా విధించినా కోట్లాదిమంది వలస కార్మికులు నిర్వికారంగా వారాల తరబడి నడుచుకుంటూ స్వస్థలాలకు వెళ్లారు తప్ప సర్కారు ఏకపక్ష ధోరణుల మీద తిరగబడలేదు.

ప్రజల నిస్సహాయతను, అవిద్యను ఎన్నికల రాజకీయ నాయకులు మాత్రం బాగా గుర్తిస్తున్నారు. అధికార క్రీడలో ఉపయోగించుకుంటున్నారు.

ప్రజలందరికీ సమానంగా ఎదిగే అవకాశాలనిచ్చే రంగాల్లో స్వేచ్ఛ కోసం, న్యాయ, పోలీసు వ్యవస్థల్లో సంస్కరణల కోసం గళం విప్పకుండా భావప్రకటనాస్వేచ్ఛలో అవరోధాలపై గొంతు చించుకున్నా పరిస్థితి పెద్దగా మారదు. ప్రజలకు మరింత స్వేచ్ఛనివ్వటంలో ఈ ఏడున్నర దశాబ్దాలలో భారత న్యాయవ్యవస్థ స్ఫూర్తిదాయక కృషి చేసింది. కానీ ఇప్పటికీ వ్యవస్థీకృత పరిణతి మన న్యాయవ్యవస్థలో కొరవడింది. దీన్ని సరిచేస్తే తప్ప చట్టాల దుర్వినియోగం వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించదు. అందుకే చట్టాలపై చర్చతోపాటు చట్టబద్ధపాలనపై కూడా చర్చ సమాజంలో విస్తృతంగా జరగాలి.

ప్రజాస్వామ్యమే కాదు.. ఏ వ్యవస్థలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా రాజ్యవ్యవస్థ బాధ్యతల్లో చట్టబద్ధపాలన ప్రధానమైనది. కానీ ఇప్పటికి మన దేశం చట్టబద్ధపాలనకు తగిన సామర్థ్యాన్ని సంతరించుకోలేదు. అధికారంలో ఉన్నవారు కూడా అరాచకాన్ని ప్రోత్సహించేలా వ్యవహరిస్తుండటం కద్దు. మన కంటే బ్రిటిష్ వాళ్లు చట్టబద్ధపాలనని సక్రమంగా అమలు చేశారని స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నవారు కూడా అనేక సందర్భాల్లో స్వతంత్ర భారతం తీరు చూసి ఆవేదన వ్యక్తం చేశారు. చట్టబద్ధపాలన సక్రమంగా అమలవకపోతే, చట్టం ద్వారా తమకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం సామాన్యులకు లేకుంటే.. ప్రజాస్వామ్యం వేళ్లూనుకోవటం కష్టమవుతుంది. అందువల్ల, ఎటువంటి భిన్నాభిప్రాయాలూ లేకుండా ప్రజాస్వామ్య భారత్ వేగిరం సాధించుకోవాల్సిన అంశం చట్టబద్ధపాలన.

చట్టబద్ధపాలన ప్రజాస్వామ్య మనుగడకు ప్రాణాధారమైనా.. సమాజంలోని కుటుంబ విలువలు వంటి బలాలతో తప్ప ప్రభుత్వం చట్టబద్ధపాలన బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తుండటం వల్ల మన దేశంలో ప్రజలకు భద్రత, మెరుగైన ఆదాయ అవకాశాలు లభించటం లేదు. ప్రజల్లో అత్యధికులు పోలీసులు, కోర్టులు అంటే భయంతో దూరంగా పారిపోతుంటారు. పేదలకు న్యాయం జరిగే పరిస్థితులు కొరవడటం వల్ల సమాజంలో దిగువన ఉన్న 30% మంది ప్రజలకు వ్యవస్థ పట్ల నమ్మకం సడలిపోతోందని ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఆధ్వర్యంలో చట్టబద్ధపాలనపై 2021లో జరిగిన జాతీయ సదస్సును ప్రారంభిస్తూ సుప్రసిద్ధ న్యాయకోవిదుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎన్ వెంకటాచలయ్య హెచ్చరించారు. పోలీసుల పట్ల ప్రజల్లో భయం, అసంతృప్తి ఉండగా.. పోలీసులు తమను తాము బలగాలు అనుకుంటున్నారు తప్ప సేవకులు అనుకోవటం లేదని ఇదే సదస్సులో మాట్లాడిన కామన్వెల్త్ సీనియర్ సలహాదారు మజ దారువాలా కామన్ కాజ్, సీఎస్‌డీఎస్ సర్వే అధ్యయనాలను

ఉటంకిస్తూ తెలిపారు. కేవలం 15% ప్రజలు మాత్రమే పోలీసు సేవల్ని ఏదోకరకంగా ఉపయోగించుకుంటున్నారని, మిగతావారు పోలీసు స్టేషన్లకు దూరంగా ఉండాలని, తమ భార్య, కూతురు ఠాణాకు వెళ్లకూడదని కోరుకుంటున్నారన్నారు. కులం, మతం, వర్గం, మహిళ ప్రాతిపదికన వివక్షలు, రాజకీయ జోక్యం ఆందోళనకర స్థాయిలో కొనసాగుతున్నాయన్నారు. చట్టబద్ధపాలన తమ మౌలిక బాధ్యత అని పోలీసులు అనుకోవటం లేదన్నారు. ఎఫ్ఐఆర్‌ల కోసం లంచం ఇచ్చామని మూడో వంతు ప్రజలు చెప్పారన్నారు ..క్షేత్రస్థాయిలో ఇలాంటి పరిస్థితి ఉంటే, తమకు భద్రత కల్పించాల్సిన వారి మీదే సామాన్య, మధ్యతరగతి ప్రజలకు, మహిళలకు నమ్మకం లేదంటే ఇక మన ప్రజాస్వామ్యం ఎంతమంది ప్రజల స్వామ్యం అయినట్లు? దేశంలోని హైకోర్టుల్లో 57.5 లక్షల కేసులు, దిగువ కోర్టుల్లో 3 కోట్ల 81 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సంఖ్య న్యాయవ్యవస్థ పనితీరుకు సూచిక కాదన్నది వాస్తవమే కానీ.. ఈ కేసుల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల సంఖ్యేమీ తక్కువ కాదు. జైళ్లలో ఉన్నవారిలో 66 శాతం విచారణను ఎదుర్కొంటున్నవారే కావటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఇందుకు న్యాయవిచారణలో జాప్యంతోపాటు అవసరానికి మించి అరెస్టులు, సామాజికంగా పరిష్కరించగల సమస్యలను నేరాలుగా నిర్వచించటం, న్యాయవిచారణలో జాప్యాలు, జైళ్లలో పెట్టటం కాకుండా ఇతర పద్ధతుల్లో సంస్కరించే పద్ధతులు లేకపోవటం మొదలైనవి కూడా కారణాలుగా ఉన్నాయి. ఈ విషయాల్నే ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా చట్టబద్ధపాలన సదస్సులో జైళ్ల శాఖ మాజీ ఐజీ డాక్టర్ ఎంఆర్ అహ్మద్ సవివరంగా పేర్కొన్నారు.

కోర్టుల్లో న్యాయం ఆలస్యంతోపాటు ఖరీదైనదిగా కూడా మారింది. మన దేశంలో కేవలం పేదరికం కారణంగా జైళ్లలో అనేకమంది మగ్గుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవస్థ ద్వారా న్యాయం లభిస్తుందన్న విశ్వాసం ప్రజల్లో సన్నగిల్లింది. ఫలితంగానే, ప్రజాప్రయోజన వ్యాజ్యాలు (పిల్) ఇన్‌స్టంట్ న్యాయంగా ప్రాచుర్యం పొందాయి. ప్రభుత్వం తప్పిదాల్ని సరిచేసేందుకు సామాన్య ప్రజలకు తోడ్పాటునిస్తున్నామనుకుంటూ ఉన్నత న్యాయవ్యవస్థ 'పిల్' పంథాని ప్రోత్సహించింది తప్ప.. దీనివల్ల వ్యవస్థాగత సంక్షోభం పెరుగుతుందే తప్ప తగ్గదని యోచించలేదు. ఈ వాస్తవాన్ని పిల్ ఒరవడికి నాంది పలికిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్ కృష్ణ అయ్యర్‌తో కూడా జేపీ చెప్పారు.

ఈ నేపథ్యంలో ప్రజలకు భద్రతను, చట్టబద్ధపాలనా స్వేచ్ఛను అందించాలంటే పోలీసు, న్యాయ వ్యవస్థల్లో సంస్కరణలే పరిష్కార మార్గం.

పట్టణీకరణ పెరుగుతూ కుటుంబ బంధాలు బలహీనపడుతున్న నేపథ్యంలో చట్టబద్ధపాలనను పటిష్ఠ పరిచే చర్యలు మరింత అవసరం. ఉన్నత న్యాయవ్యవస్థలో సమర్థులు, నిజాయతీపరులు నియమితులయ్యేందుకు జాతీయ న్యాయ నియామకాల కమిటీ ఏర్పాటు నుంచి స్వతంత్ర ప్రాసిక్యూషన్, సామర్థ్యంగల యువత జడ్జిలుగా వచ్చేందుకు అఖిల భారత సర్వీసు, న్యాయవ్యవస్థను జవాబుదారీ చేసే వ్యవస్థ వంటి ఏర్పాట్లు చేయాలి. ముఖ్యంగా దిగువ స్థాయి కోర్టుల్లో న్యాయం తేలిగ్గా, వేగంగా, చౌకగా, నిఖార్సుగా అందే ఏర్పాట్లు ఉండాలి. ప్రజల భాగస్వామ్యం ఉండేలా పోలీసు వ్యవస్థలో సంస్కరణల్ని తీసుకురావటంతోపాటు నేర పరిశోధనను రాజకీయ వ్యవస్థ నుంచి వేరు చేయాలి. ఈ సంస్కరణల్ని తెచ్చి చట్టబద్ధపాలనను భారతీయ సంస్కృతిలో భాగం చేయకుంటే, ముమ్ముందు మనశ్శాంతితో మనుగడ కష్టమవటమే కాదు.. పెట్టుబడులు తగ్గి ఆర్థిక వృద్ధి కూడా దెబ్బతినే ప్రమాదముంది.

**ఎంత ఎక్కువ స్వేచ్ఛ ఉంటే అంత ఆర్థికాభివృద్ధి..**
**ఎంత వృద్ధి ఉంటే అంత ఎక్కువ స్వేచ్ఛ**

స్వతంత్ర భారతదేశం ఆర్థికంగా గణనీయ వృద్ధిని సాధించినప్పటికీ, మన దేశ సామర్థ్యానికి, గత వైభవానికి, ప్రజల అవసరానికి తగ్గ వృద్ధి మాత్రం కాదది. అసలు 1990 వరకూ.. ప్రజాస్వామ్యంలో ప్రభువులైన ప్రజలకు ఆర్థిక స్వేచ్ఛ కూడా ఉండేది కాదు. పాలకులు, అధికారులు కలిసి ప్రజలకు చుక్కలు చూపించేవారు. కానీ 1991లో దేశం తాకట్టులోకి వెళ్లే పరిస్థితి రావటంతో తప్పనిసరి పరిస్థితుల్లో లైసెన్స్ పర్మిట్ రాజ్‌కు చెల్లుచీటీ ఇచ్చి ఆర్థిక సంస్కరణలకు తెర తీశారు. స్వతంత్ర భారత చరిత్రలో ఇది మరో పెద్ద పరిణామం. కానీ ఆర్థిక సంస్కరణలతోపాటు మానవ వనరుల అభివృద్ధికి కీలకమైన విద్య, ఆరోగ్యం వంటివి అందుకునే స్వేచ్ఛ అత్యధికులకి లేకపోవటం, సంఘటిత రంగంలో ఎక్కువమందికి అవకాశాలనిచ్చేలా కార్మిక నిబంధనల సరళీకరణ వంటి సంస్కరణలు కొరవడటంతో వీటి ఫలితాలు కొందరికే పరిమితమై ఆర్థిక అసమానతలు కూడా పెరిగాయి. కొంతమేర ప్రజల ఆదాయాలు పెరిగినా చుట్టూ ఉన్న సమస్యలపై అర్థవంతమైన ఆవేశంతో స్పందించి పరిష్కారాలు సాధించే నాణ్యమైన, ప్రజాస్వామిక దృక్పథమున్న మధ్యతరగతి రూపుదిద్దుకోలేదు. ఫలితంగా సమాజంలో, వ్యవస్థలో మార్పు కోసం పనిచేసే శక్తులకు మన దేశంలో ఆశించిన దన్ను లభించలేదు.

అలాగే ఇటీవలికాలం వరకూ వ్యవసాయంలో ఆర్థిక స్వేచ్ఛ లేకుండా చేశారు. రైతులు తమ కష్టార్జితంగా పండించిన పంటల్ని దేశంలో, ప్రపంచంలో ఎక్కడ డిమాండ్ ఉంటే అక్కడ అమ్ముకోకుండా నిలువరించారు. కొవిడ్ నేపథ్యంలో రైతులకున్న సంకెళ్లను కొంతమేర తొలగించి స్వేచ్ఛా మార్కెట్‌కి అవకాశం కల్పిస్తూ 2020లో వ్యవసాయ చట్టాలను సంస్కరించారు. వీటిని సక్రమంగా, సమగ్రంగా అమలు చేస్తే స్వతంత్ర భారతంలో మరో పెద్ద మార్పుగా చెప్పుకోవచ్చు.

ప్రభుత్వం రాజ్యవ్యవస్థ చేయాల్సిన బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తూ ప్రజలకు ఎంత ఎక్కువ స్వేచ్ఛనిస్తే అంత ఎక్కువ ఆర్థికాభివృద్ధి జరుగుతుంది.. అలాగే ఎంత ఆర్థికాభివృద్ధి జరిగితే అంతగా స్వేచ్ఛ మరింత విస్తరిస్తుంది. సామాజిక సామరస్యత, పర్యావరణహిత సాంకేతికతలతో

## ఈ రంగాల్లో అవకాశాలకన్నా అవరోధాలుంటే.. స్వేచ్ఛా భారతానికి అర్థమేముంటుంది?

ఇతరులతో పోటీపడి మనం ఎదిగే అవకాశాల్ని అందుకోవటంలో కీలకమైన విద్య, ఆరోగ్యాల్లో అత్యధిక సంఖ్యాక ప్రజలకు నాణ్యమైన సేవలను పొందే స్వేచ్ఛ ఉండదు. భద్రతకు, న్యాయానికి కీలకమైన చట్టబద్ధపాలనలో, స్థానికంగా మనకు సంబంధించి మనమే నిర్ణయాలు తీసుకోవటంలో స్వేచ్ఛ లేదు. మనకు నచ్చిన ఉపాధిని పొందే స్వేచ్ఛ లేదు, వలసలు పోకుండా జీవించే స్వేచ్ఛ లేదు, లంచాలు, సిఫార్సులు లేకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో సేవల్ని హక్కుగా పొందే స్వేచ్ఛ లేదు. ప్రజలు తమలో తాము సంఘాలుగా ఏర్పడి పరస్పర సహకారంతో కార్యక్రమాల్ని నిర్వహించుకునే స్వేచ్ఛ లేదు.
ఈ స్వేచ్ఛలను వేర్వేరు రంగాలుగా మనం భావిస్తుండవచ్చు.. కానీ మౌలికంగా వీటన్నిటిలో మనకు స్వేచ్ఛ లేకుండా చేసి, అవకాశాల కన్నా అవరోధాలతో నింపి స్వేచ్ఛా భారతమంటే అర్థమేముంటుంది?

## ఆర్థిక వృద్ధికి అనుగుణంగా వైద్య, విద్యారంగాలు ప్రగతిని సాధించలేదు.. దేశం ప్రాధాన్యతల్ని మార్చుకోవాలి: సంస్కరణలకు 30 సందర్భంగా మన్మోహన్ సింగ్

"ఆర్థిక వృద్ధికి అనుగుణంగా వైద్య, విద్యారంగాలు ప్రగతి సాధించకపోవటం దురదృష్టకరం" అని మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ అన్నారు. భారత్‌లో ఆర్థిక సంస్కరణలు చేపట్టి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 1991లో పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా, సింగ్ ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడే సరళీకరణ విధానాలు, సంస్కరణలకు రూపకల్పన జరిగింది. "ఇది సంతోషించాల్సిన సందర్భం కాదు. ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన సమయం. 1991 నాటి సంక్షోభం కన్నా ప్రమాదకరమైన పరిస్థితులు ఇప్పుడు కనిపిస్తున్నాయి. అందువల్ల ప్రతి ఒక్క భారతీయుడూ ఆరోగ్యం, గౌరవంతో బతికే విధంగా దేశం ప్రాధాన్యతలను మార్చుకోవాల్సి ఉంది" అని మన్మోహన్ సింగ్ అన్నారు.

ఇలాంటి స్వేచ్ఛాయుత ఆర్థిక వృద్ధి.. రాజకీయం, పాలనలో కూడా ప్రజల భాగస్వామ్యాన్ని ముమ్మరం చేస్తుంది. నైతిక ధైర్యమున్న ప్రజాస్వామిక మధ్యతరగతి రూపుదిద్దుకుని ప్రగతిశీల సామాజిక, రాజకీయ మార్పులకు సృజనాత్మకంగా దోహదం చేయగలుగుతారు.

**ప్రజాస్వామ్యం దానంతటదే ఎదగదు**

మనం ఎందుకు ఎంచుకున్నా కూడా ఇప్పుడున్న వ్యవస్థల్లో ప్రజాస్వామ్యం అత్యుత్తమమైనది. స్వాతంత్ర్యం అన్న పదానికి తగిన జీవితాన్ని చిట్టచివరి పౌరురాలు, పౌరుడికి కూడా ఇవ్వగలిగేది. కానీ ప్రజాస్వామ్యం దానంతటదే ఎదగదు. మనం గాలివాటంగా వ్యవహరిస్తుంటే ఎదగదు. సాంకేతికత, ప్రపంచీకరణ విస్తరిస్తున్నకొద్దీ బహుళత్వం సన్నగిల్లుతూ ప్రజాస్వామ్యానికి తగిన వాతావరణం పలుచబడే ప్రమాదం కూడా ఉండొచ్చు. క్రమంగా ప్రజాస్వామ్య నియంతృత్వం రూపుదిద్దుకోవచ్చు. ఓ ప్రచురణకర్త అన్నట్లు, ప్రజాస్వామ్యమంటే మనకు అవసరమైనప్పుడల్లా కొనుక్కోవడానికి వెళ్లే సూపర్ మార్కెట్ కాదు. అది ఒక పంట పొలం. మీరు ఏ విత్తనం నాటితే ఆ ఫలమే లభిస్తుంది. కనుక మంచి విత్తనం నాటేందుకే ప్రయత్నించాలి.

దాదాపు నాలుగున్నర దశాబ్దాలకు పైగా భారతదేశంలో ప్రజాస్వామ్య సంస్కరణల కోసం పోరాడుతూ, పాతికేళ్ల క్రితం నుంచి ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వేదికల ద్వారా ఆ పోరాటాన్ని సమగ్ర స్థాయిలో చేస్తున్న డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ మనం వివిధ రంగాల్లో చేపట్టాల్సిన సంస్కరణల్ని సవిరంగా ఇప్పటికే మనందరికీ అందించారు. ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాల్ని అందించటం, నివారించదగ్గ బాధల్ని తొలగించటం చుట్టూ సరైన వ్యవస్థల నిర్మాణం.. ఆ వ్యవస్థల మధ్య అధికారాల విభజన – జవాబుదారీతనంతో స్వతంత్ర ప్రతిపత్తి.. మూడో అంచె ఫెడరలిజంతో అధికార వికేంద్రీకరణ.. బహిరంగ చర్చ ప్రమాణాలున్న మీడియా, భావప్రకటన.. ఇలా వ్యవస్థీకృత మార్పులతో భారతదేశ జెండాని సమున్నతంగా నిలపగల ఎజెండా అది. వీటిలో కొన్నిటిని మనం ఇక్కడ ప్రస్తావించుకున్నాం. సమగ్ర సంస్కరణల్ని, వివరాల్ని జేపీ సోషల్ మీడియా ఖాతాల్లో, ఎఫ్‌డీఆర్ ఇండియా వెబ్‌సైట్‌లో చూడవచ్చు. అలాగే ప్రతి భారతీయునికీ, ముఖ్యంగా యువతకి కరదీపికలా ఉండాల్సిన రోడ్‌మ్యాప్ ఫర్ ఇండియాను జేపీ త్వరలో పుస్తకరూపంలో కూడా తీసుకొస్తున్నారు. మనం ఈ సంస్కరణల ద్వారా అన్ని రకాల స్వేచ్ఛలనూ రాజ్యాంగ ప్రజాస్వామ్య మార్గంలో సాధించుకోవటమే 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ చేపట్టాల్సిన కార్యాచరణ. ఈ తరంలో రావాల్సిన సంస్కరణల్ని మరో తరానికి వాయిదా వేయకుంటేనే.. 2047లో 100వ స్వాతంత్ర్య దినోత్సవం నాటికి మరింత స్వేచ్ఛను సాధించే దిశగా, అంతిమంగా మన జీవితాలకు సుఖసంతోషాలను, సాఫల్యతను చేకూర్చేందుకు రాజ్యవ్యవస్థతో కుదుర్చుకున్న సామాజిక ఒడంబడిక లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా అడుగులు వేయగలుగుతాం.

**జాతీయోద్యమంలో, దేశ నిర్మాణంలో పాలుపంచుకున్న మహనీయులందరికీ నమస్కరిస్తూ.. 75వ స్వాతంత్ర్య దినోత్సవ సంస్కరణల కార్యాచరణ శుభాకాంక్షలతో...**

# 50 ఏళ్ల బంగ్లా పాఠాలు



**బంగ్లాదేశ్ కూడా ఈ ఏడాది ఒక మైలురాయిని అధిగమిస్తూ అవతరణ స్వర్ణోత్సవాల్ని జరుపుకుంటోంది. జాతిపిత, బంగబంధు షేక్ ముజిబ్‌పూర్ రెహమాన్ శతజయంతిని, బంగ్లా, భారత్ దౌత్య సంబంధాల స్వర్ణోత్సవాల్ని కూడా జరుపుకుంటోంది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల అవసరం రీత్యానే కావచ్చు గానీ.. ఈ నేపథ్యంలోనే ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ కూడా బంగ్లాదేశ్‌ను సందర్శించారు. బంగ్లాదేశ్ నుంచి కొన్ని అంశాల్ని నేర్చుకోవాల్సిన సందర్భం కూడా ఇది.**

మన కళ్ల ముందు, మన తోడ్పాటుతో ఏర్పడిన దేశం .. మన కంటే జనసాంద్రత ఎక్కువ కలిగి ప్రకృతి విపత్తులు కూడా ఎక్కువగా చోటుచేసుకునే దేశం .. మన దేశానికి వలసల భారంగా మారిన దేశం .. అధిక సంతానోత్పత్తితో పాటు ఆధునికతకు అవరోధంగా ఉండే మతతత్వం కలిగినదిగా భావించే దేశం బంగ్లాదేశ్ కూడా ఈవేళ కొన్ని ప్రధానాంశాల్లో భారతదేశానికి ఆదర్శప్రాయంగా నిలుస్తోంది.

బంగ్లాదేశ్ వృద్ధి రేటు మన కంటే మెరుగ్గా ఉంది. ఏదైనా బలమైన గాలి తాకితే కొట్టుకుపోయే తాత్కాలిక వృద్ధి కాదది. సుస్థిరాభివృద్ధికి కావలసిన మౌలిక పునాదుల్ని బలోపేతం చేసుకుంటూ బంగ్లాదేశ్ వృద్ధిని సాధిస్తోంది.

2019లో బంగ్లాదేశ్ వృద్ధి రేటు 8.4 శాతం. అంటే భారత వృద్ధి రేటుకి రెట్టింపు. కొవిడ్ విజృంభణ సమయంలో ప్రపంచంలో కొన్ని దేశాలు మాత్రమే బంగ్లాదేశ్ మాదిరి వృద్ధి రేటును సాధించాయి. కరోనా తాకిడిలోనూ బంగ్లా తలసరి జీడీపీ దాదాపు రూ.1,63,000 ఉంది. ఇది భారత్ కంటే దాదాపు రూ.20,000 ఎక్కువ. మహమ్మారి కాలంలో మన దేశంలో ఆదాయం దాదాపు 8 శాతం కుంగగా, బంగ్లాదేశ్ ఆదాయం 9 శాతం మేర పెరిగిందని నిపుణులు చెబుతున్నారు.

భారతదేశం తాత్కాలిక తాయిలాలు, ఉచితాలు, భావోద్రేకాల చుట్టూ అధికార క్రీడలో మునిగితేలుతుండగా.. బంగ్లాదేశ్ దీర్ఘకాలిక చర్యలతో మన కంటే చురుగ్గా, నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తోంది. సామాజిక ఆరోగ్య కేంద్రాలు బాగా పనిచేస్తుండటం, ఉపాధి అవకాశాల పెంపు, శ్రామిక శక్తిలో మహిళల ప్రాతినిధ్యం పెరగటం, దేశీయ, విదేశీ వాణిజ్య విధానాలను సరళీకృతం చేయటం, ప్రజల ఆదాయం పెరగటానికి క్షేత్రస్థాయిలో సూక్ష్మరుణాల విధానం పకడ్బందీగా అమలు చేయటం బంగ్లా వృద్ధిలో కీలకపాత్ర పోషించాయి.

మన దేశంలో కంటే బంగ్లాలో శిశు మరణాల సంఖ్య తక్కువ, సగటు ఆయుర్దాయం ఎక్కువ. 2019లో భారత్‌లో సగటు జీవితకాలం 69.7 ఏళ్లు కాగా, ఈ విలువ బంగ్లాదేశ్‌లో 72.6 ఏళ్లని మానవాభివృద్ధి సూచీ తెలిపింది.

మన జనాభాలో మహిళలు దాదాపు 48.5 శాతం మేర





ఉన్నారు. కానీ సంపద సృష్టిలో వారి భాగస్వామ్యం మాత్రం ఉన్నకొద్దీ తగ్గిపోతోంది. ప్రతి ముగ్గురు భారతీయ మహిళల్లో ఇద్దరు ఏ విధమైన వృత్తి ఉద్యోగాలూ చేయటం లేదని ప్రపంచ బ్యాంకు నివేదిక తెలిపింది. సంపద సృష్టిలో మహిళల్ని భాగస్వాముల్ని చేయటంలో ప్రపంచంలోని అనేక దేశాల కంటే మన దేశం వెనుకబడుతుండగా, బంగ్లాదేశ్ మాత్రం ముందంజలో ఉంది. శ్రామిక శక్తిలో బంగ్లాదేశ్ మహిళల వాటా 37 శాతం కాగా, భారత్‌లో అది 19 శాతం లోపే. కరోనా కాలంలో ఈ సంఖ్య మరీ తగ్గిపోయింది. మన దేశంలో కొవిడ్ వల్ల ఉపాధి కోల్పోయిన మహిళల్లో ఎక్కువమందికి తిరిగి ఉపాధి లభించకపోవచ్చని అంచనాలు చెబుతున్నాయి.

చైనా వంటి దేశాలు వదిలేసిన తక్కువ ఆదాయ రంగాలను వేగంగా చేజిక్కించుకుని దుస్తుల తయారీలో బంగ్లాదేశ్ ప్రపంచంలోనే గుర్తింపు స్థానాన్ని సంపాదించగలిగింది. తెలుగునాట విజయనగరం జిల్లాలో ఉన్న బ్రాండిక్స్ తరహాలో పలు దుస్తుల తయారీ సంస్థలు బంగ్లాలో మహిళలకు ఇబ్బడి ముబ్బడిగా ఉపాధి అవకాశాలను కల్పించాయి. ఉపాధి కావాలి అనుకోవాలేగానీ, అందరికీ అవకాశాల్ని అందిస్తున్నాయి. దీంతో ఉత్పాదకత పెరగటంతోపాటు అసమానతలు తగ్గాయి.

వియత్నాం తరహాలో బంగ్లాదేశ్ వేగంగా అవకాశాల్ని చేజిక్కించుకుంటూ అభివృద్ధిలో భారత్‌తో పోటీ పడుతోంది. ఇందుకోసం చైనాతో కూడా వ్యూహాత్మక సత్సంబంధాలు నెరపుతోంది. జౌళి పరిశ్రమలు, దుస్తుల తయారీ పరిశ్రమల ద్వారా ప్రపంచ సప్లయ్ చెయిన్‌లోకి అడుగు పెట్టిన బంగ్లాదేశ్.. యూరోపియన్ యూనియన్, కెనడా, ఆస్ట్రేలియా, జపాన్‌లతో వాణిజ్యపరంగా మంచి సంబంధాలను ఏర్పరచుకున్నది. రెడీమేడ్ దుస్తులపై జీరో ఎగుమతి సుంకం సౌలభ్యాన్ని పొందుతోంది. మన దేశం పత్తి ఉత్పత్తిలో ప్రపంచంలోనే అగ్రస్థాయిలో ఉన్నా, దుస్తుల తయారీలో మాత్రం బంగ్లాలా అవకాశాల్ని అందుకోలేకపోయింది.

స్థానిక కంపెనీల్లో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) అనుమతించటం వల్ల భారత కంపెనీలు కూడా బంగ్లాదేశ్‌లో పెట్టుబడులకు ఉత్సాహం చూపుతున్నాయి. మన దేశంలో కంటే ఎక్కువగా అక్కడ మహిళలకు ఉపాధి అవకాశాల్ని కల్పిస్తున్నాయి. వర్క్ ఫ్రం హోమ్ ఉపాధి అవకాశాలు కూడా ఇక్కడి మహిళలకు పెద్దఎత్తున లభిస్తున్నాయి.

ఇండియాలో సూక్ష్మ రుణ సంస్థలపై రాజకీయాలు చేస్తూ రెండడుగులు ముందుకు ఒకడుగు వెనక్కి అన్నట్లు వ్యవహరిస్తుండగా.. సూక్ష్మ రుణాల విషయంలో అభివృద్ధి చెందిన దేశాల్లో బంగ్లాదేశ్ ముందంజలో ఉంది. ప్రపంచంలో విజయవంతమైన సూక్ష్మరుణాల సంస్థలు గ్రామీణ్, బీఆర్ఏసీ వంటి సంస్థలు దేశంలో చిన్న వ్యాపారులకు రుణాలను అందిస్తున్నాయి.

జీడీపీలో సేవారంగం, పారిశ్రామిక రంగం వాటాలో కూడా భారత్ కంటే బంగ్లాదేశ్ కొంత ముందుంది. అలాగే వ్యవసాయంలో కూడా భారత్ కంటే తక్కువ శాతం జనాభా అక్కడ ఉన్నారు. ఇటీవలి కాలంలో వ్యవసాయాభివృద్ధిలో బంగ్లాదేశ్ చెప్పుకోదగిన ఫలితాలను సాధిస్తోంది. అలాగే విద్యుదుత్పత్తి, సహజవాయువు వెలికితీత, ఉత్పత్తి, ఔషధ పరిశ్రమ, విదేశీ చెల్లింపుల్లో పురోగతిని సాధించింది. మన పాలకుల నిర్లక్ష్యం, వ్యాక్సిన్ల తయారీలో ముందుచూపు కొరవడటంతో భారత్‌లో కరోనా రెండో దశ విజృంభించిన సమయంలో మందులు, ఇతర సహాయాలను అందించిన ప్రపంచ దేశాల్లో బంగ్లాదేశ్ కూడా ఉంది.

బంగ్లాదేశ్ కూడా ఈ ఏడాది ఒక మైలురాయిని అధిగమిస్తూ అవతరణ స్వర్ణోత్సవాల్ని జరుపుకుంటోంది. జాతిపిత, బంగబంధు షేక్ ముజిబ్‌పూర్ రెహమాన్ శతజయంతిని, బంగ్లా, భారత్ దౌత్య సంబంధాల స్వర్ణోత్సవాల్ని కూడా జరుపుకుంటోంది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల అవసరం రీత్యానే కావచ్చు గానీ.. ఈ నేపథ్యంలోనే ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ కూడా బంగ్లాదేశ్‌ను సందర్శించారు. అయితే బంగ్లాదేశ్ నుంచి కొన్ని అంశాల్ని నేర్చుకోవాల్సిన సందర్భం కూడా ఇది. పారిశుద్ధ్యం, పౌష్టికాహారం, ఆరోగ్యం, సంపద సృష్టిలో స్త్రీ–పురుష సమానత్వం, దేశీయ విదేశీ వాణిజ్యంలో సరళతర విధానాలను అనుసరించడం, తేలిక రుణ



అవకాశాలను ఎక్కడికక్కడ అందుబాటులోకి తేవటం మొదలైన అంశాల్లో బంగ్లాదేశ్ నుంచి నేర్చుకోవలసి ఉంది.

బలమైన ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థతో ప్రజారోగ్య విధానం అమలు, ప్రత్యేక అభివృద్ధి మండళ్లను ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాలతో పరిశ్రమల అభివృద్ధికి అనువైన వాతావరణాన్ని సృష్టించడం, చిన్న మధ్యతరహా వ్యాపారవేత్తలను ప్రోత్సహించడం, నైపుణ్యాల శిక్షణనివ్వటం, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను అందుబాటులోకి తేవటం బంగ్లా ఫలితాల నేపథ్యంలో 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ భారతదేశం చేపట్టాల్సిన తక్షణ ఆచరణసాధ్య చర్యలు.

# వీఎంఆర్‌డీఏ ప్రణాళికపై ప్రజాసదస్సులు నిర్వహించండి.. అభ్యంతరాలపై గడువు పెంచాలి





విశాఖ మహా ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) రూపొందించిన బృహత్తర ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) 2041 ముసాయిదాపై ప్రజలకు అనేక అనుమానాలున్నాయని, వాటిని తొలగించేందుకు వీఎంఆర్‌డీఏ అధికారులు, విజయనగరం కార్పొరేషన్ అధికారులు ప్రజలతో విస్తృతస్థాయి సమావేశాలు ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా పార్టీ ఏపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బృహత్తర ప్రణాళిక చిత్రపటాన్ని పరిశీలించిన అనంతరం నగర కమిషనర్ వర్మతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, రెండు జిల్లాల్లో వీఎంఆర్‌డీఏ మొత్తం పరిధి 7328.86 చదరపు కిలోమీటర్లు ఉందని, బృహతర ప్రణాళికలో ఉన్నది 4873.38 చ.కి. మాత్రమేనన్నారు. విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో 35 మండలాలు ప్రణాళికలో ఉన్నాయని, రహదారుల విస్తరణ, ఇతర వసతులకు పంట పొలాలు, ఇళ్ల స్థలాలు పోతే రైతులు, సామాన్య, మధ్యతరగతి ప్రజలు నష్టపోతారని, వారికి తగిన పరిహారం, ఇతర ఏర్పాట్లు ఉండాలన్నారు. వీఎంఆర్‌డీఏ బృహత్తర ప్రణాళిక గురించి 90 శాతం ప్రజలకు తెలియదని, ఇప్పటికే విజయనగరం జిల్లా నుంచి 1500కి పైగా ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ సమస్యలపై ఎమ్మెల్యేలు, మంత్రులు దృష్టి సారించాలని, త్వరలో వీఎంఆర్‌డీఏ కమిషనర్ వెంకటరమణారెడ్డిని కలిసి పరిస్థితి వివరిస్తామన్నారు.

## సామాజిక మార్పు కోసం పనిచేసిన విశిష్ట శాస్త్రవేత్త సుధాకర్

లోక్‌సత్తా పార్టీ సీనియర్ నేత, పేరొందిన భూగర్భ జలాలు, మైనింగ్ శాస్త్రవేత్త రామవరపు సుధాకర్ (88) మృతి సమాజానికి పెద్ద లోటని పార్టీ ఏపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. విజయనగరంలో పుట్టి పెరిగిన సుధాకర్ మైనింగ్ శాస్త్రవేత్తగా దేశవిదేశాలు తిరిగి ఎంతోమంది నిపుణులతో పనిచేశారని, విశిష్ట సేవలందించారని అన్నారు. డా॥ జేపీ భావాల పట్ల ఎంతో అభిమానంతో ప్రారంభం నుండీ లోక్‌సత్తా పార్టీలో పనిచేశారన్నారు. విజయనగరం లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుధాకర్‌కి నేతలు ఘననివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్‌లో సుధాకర్ జీవవైవిధ్య విభాగంలో పనిచేశారని, జీవరాశుల వైవిధ్యం దెబ్బతినటం వల్ల వాతావరణంలో ఊహించని మార్పులు వస్తున్నాయని తరచూ ఆవేదన వ్యక్తం చేసేవారని, సామాజిక మార్పు కోసం తుదివరకూ పనిచేశారని లోక్‌సత్తా పార్టీ జిల్లా ప్రతినిధి అల్లంశెట్టి నాగభూషణం అన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా నేతలు తాత్రారాజు రాజారావు, పాలుపర్తి అప్పారావు, బోర రమేష్, పి.ఎల్.ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## తూనికల మోసాల్ని నిలువరించే చర్యలేవీ?

పాతికేళ్ల లోక్‌సత్తా చేసిన తొలి ఉద్యమం తూనికల్లో మోసాల గురించేనని, పెట్రో బంకుల తూనికల్లో అక్రమాలు, కల్తీల వల్ల ప్రజలకు జరుగుతున్న భారీ నష్టాన్ని పౌరుల భాగస్వామ్యంతో రాజ్యాంగబద్ధ పద్ధతిలో బయటపెట్టిందని, అప్పట్లో ప్రభుత్వం ఆ సమస్యపై స్పందించినా క్రమంగా సర్కారీ నిఘా, పౌర చైతన్యం తగ్గటంతో ఇప్పుడు పెట్రో బంకులతో పాటు ఇతర అమ్మకాల్లో కూడా కాటా మోసాలు పెరుగుతున్నాయని లోక్‌సత్తా పార్టీ ఏపీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు మాదాసు భానుప్రసాద్ అన్నారు. మారుతున్న ఆహారపు అలవాట్లననుసరించి ప్రజలు మాంసం, చేపలు వంటివి ఎక్కువ కొనుగోలు చేస్తుండటంతో ఆ తూకాల్లో మోసాలు జరుగుతున్నాయని, చిలకలూరిపేట, చుట్టుపక్కల ప్రాంతాల వినియోగదారులను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని తూనికలు కొలతల శాఖ నరసరావుపేట డివిజన్ అధికారిని కోరారు.

### భారతదేశానికి నూతన దశ, దిశ చూపిన లోక్‌సత్తా

ప్రజాస్వామ్య సంస్కరణలతో భారతదేశంలో సమగ్ర మార్పుకి నాంది పలికిన రాజకీయ ఉద్యమం లోక్‌సత్తా అని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహనరావు అన్నారు. డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ప్రారంభమైన ఈ ఉద్యమంలో వివిధ రూపాల్లో పాల్గొన్నవారికి, అభిమానులకు లోక్‌సత్తా 25వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేశారు.

# సహకార భీమసింగిని ప్రభుత్వం పరిరక్షించాలి





జిల్లాలో ఉన్న ఏకైక సహకార చక్కెర ఫ్యాక్టరీ భీమసింగిని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చొరవ తీసుకోవాలని శృంగవరపుకోట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. షుగర్ ఫ్యాక్టరీని వెంటనే తెరిపించి చెరకు రైతులను ఆదుకోవాలని కోరుతూ అఖిలపక్ష రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో సీపీఐ నేత పి.కామేశ్వరరావు అధ్యక్షతన జామి గ్రామం దొండపర్తి జంక్షన్‌లో జరిగిన చెరకు రైతుల సదస్సులో ఆమె మాట్లాడారు. ఫ్యాక్టరీ ఆధునీకరణ చేసి 2020–21లో గానుగ చేస్తామని ప్రకటించి మాట తప్పారని, మంత్రులు బొత్స సత్యనారాయణ, గౌతం రెడ్డి, కన్నబాబులను మంత్రివర్గ ఉప కమిటీగా వేసినా ఇంతవరకూ ఏ నిర్ణయమూ ప్రకటించలేదని తెదేపా సీనియర్ నేత, మాజీ జెడ్పీటీసీ బండారు పెదబాబు అన్నారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ, భీమసింగి షుగర్ ఫ్యాక్టరీ చైర్మన్‌గా ఉన్న జేసీ కిషోర్ వెంటనే రైతు మహాసభను ఏర్పాటు చేసి రైతులు, కార్మికుల ఆందోళనలకు కారణాలను వినాలన్నారు. ఫ్యాక్టరీ ఏరియాలో 40 వేల టన్నుల చెరకు ఉందని, గానుగ ఈ సంవత్సరం ప్రారంభించటానికి మంత్రులు పూనుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు ఎంతో ఆశపడి సహకార ఫ్యాక్టరీకి సభ్యులుగా ఉన్నారని, వారికి అన్యాయం చేయవద్దని సీపీఎం నేత తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. రైతులు ఎలాంటి ఉద్యమానికైనా సిద్ధంగా ఉండాలని చెరకు రైతు లగుడు రవి కోరారు. సమావేశంలో గంట్యాడ, బొండపల్లి మాజీ జెడ్పీటీసీలు కోరుపోలు రమేష్, బండారు బాలాజీ, కొండపల్లి భాస్కర్ నాయుడు, ఫ్యాక్టరీ కార్మిక సంఘాల నేత కృష్ణంరాజు, జామి మండల నేతలు పైడి బాబు, వేంద్రపు నాయుడు బాబు, వగ్రి రమణ, గార పెంటయ్య, మాజీ ఎంపీటీసీ భీశెట్టి సత్యవతి, మాజీ సర్పంచ్ లక్ష్మీ, వేమలి చైతన్య, కార్మికులు, చెరకు రైతులు, సీపీఐ, సీపీఎం, తెలుగుదేశం, జనసేన, లోక్‌సత్తా పార్టీల నేతలు పాల్గొన్నారు.

# జుగాడ్ ఓటర్ల 50:50 రాజకీయ సంకల్పం
# ఆచరణయోగ్యమైన స్వజాతీయ ప్రజాస్వామ్యం

## "జుగాడ్ ఓటర్ల 50:50 రాజకీయ సంకల్పం" అంటే ఏమిటి?

కొందరు ఓటర్లు ఒక నూతన స్వజాతీయ-రాజకీయ పార్టీని శాంతియుతంగా స్థాపిద్దామని ముందుకు వచ్చారనుకోండి. మన సమాజంలో నూటికి 50 మంది ఆ ఆలోచనను సమర్థిస్తే, మిగతా 50 మందీ దానిని తిరస్కరించే అవకాశం ఉంది. ఏ సమాజంలోనైనా నూటికి 50 మంది ఆశావాదులైతే, మిగతా 50 మందీ నిరాశావాదులు. అందుకే సమాజహితం కోసం ఒక మంచిపని జరగాలంటే ఆశావాదుల సంఖ్య ఎక్కువగా ఉండాలి. ఈ ప్రతిపాదనను బేషరతుగా సమర్థించే ఆశావాదులందరినీ, త్వరలో రాబోతున్న జుగాడ్ ఓటర్ల స్వజాతీయ-ప్రజాస్వామ్య ప్రభుత్వ యంత్రాంగములో అధికారపక్షంగానూ, మిగిలినవారిని సగౌరవంగా ప్రతిపక్షంగానూ పరిగణించాలి. అప్పుడు 75 శాతం మెజారిటీ ప్రజాప్రతినిధులతో రాష్ట్రంలోనైనా కేంద్రంలోనైనా సుస్థిరప్రభుత్వాలు ఏర్పడే అవకాశం ఉంది.

ప్రజాప్రతినిధులుగా మనచేత ఎన్నుకోబడిన "ఓటర్లు" చట్టసభలలో శాంతియుత వాతావరణంలో "నమ్మకంపై ఆధారపడిన పరస్పర సహకారంతో" అంతర్గత ప్రజాస్వామ్యంతో లోపరహిత చట్టబద్ధపాలనా-వ్యవస్థ నిర్మాణం ద్వారా సమస్యలను మాట్లాడి సాధించుకోవడం సభ్యసమాజం యొక్క ఆవశ్యకత. అందుకు భిన్నంగా, హింసామార్గం ద్వారా ఆవేశకావేశాలతో చట్టసభలలోనూ, బయటాకూడా తామనుకున్నది కండబలంతో కొట్లాడి సాధించుకుందామనే ధోరణిని ప్రతిపాదించే "ఓటర్లను" చట్టసభలకు దూరంగా ఉంచడం యావత్-భారత సభ్య సమాజం యొక్క తక్షణ కర్తవ్యం. బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు స్వస్తి పలుకుదాం.

గ్రామ సర్పంచ్ మొదలు దేశాధ్యక్షుడి వ్యవస్థ వరకూ మన సుఖజీవనం కోసం, "ఓటు" అనబడే "స్వాధికార అస్త్రం" ద్వారా స్వపరిపాలనకై అవకాశాన్ని మనకి మనమే రాజ్యాంగంలో ఏర్పాటు చేసుకున్నాం. 'స్వేచ్ఛాయుత జీవనానికి డబ్బులేనిదే ఉచితంగా ఏదీరాదు. మనడబ్బే జీత భత్యాల రూపేణా ప్రభుత్వోద్యోగులకూ, ప్రజాప్రతినిధులకూ లభిస్తోంది. మనది ఏకైక ఓటర్లజాతి. ఓటంటే కోటిరూపాయల విలువైన మూట. దానిని రహస్యంగా బాధ్యతతో, ఎవరికివారే ఉపయోగించుకుంటేనే మనకుటుంబాలకు ఆర్థికాభివృద్ధి సాధ్యం.

ఓటర్లయొక్క లింగవ్యత్యాసం, అమాయకత్వం, కులం, మతం, ప్రాంతం, భాష, యాస, ధూమ-పానం, మద్య-పానం, ఆత్మహత్యలూ, ఆహారపుటలవాట్లు, మొదలైన సామాజిక రుగ్మతలతో పెనవేసుకున్న "డబ్బు"ని విచ్చలవిడిగా వెదజల్లుతూ, ఓటర్ల భావోద్వేగాలకు ఆజ్యంపోస్తూ, "ఆత్మగౌరవం" పేరిట కొందరి ప్రముఖుల వ్యక్తిగత ఇష్టాయిష్టాలే, పొలిటికల్ భావజాలాలుగా చెలామణీ అవుతున్న పార్టీలకు ప్రత్యామ్నాయంగా మనడబ్బుకి మనమే బాధ్యత వహిస్తూ వివరణాత్మక నిర్వచనాలతో, ఇప్పుడున్న చట్టాల పరిధిలోనే మనదంటూ పార్టీ నిర్మించుకుందాం.

అత్యధిక జుగాడ్ ఓటర్ల సమాంతర ఆలోచనలతో, మన కష్టార్జితమైన డబ్బుని ఖర్చులనిమిత్తం, (50+25+15+10), పరిమిత విరాళాల రూపేణా (రూ. 2,000/5,000/10,000) మనమే సమకూర్చుకుని, దేశసంపదనుసమగ్రంగా పరిరక్షించుకుంటూ నమ్మకంపై ఆధారపడిన పరస్పర సహకారం ప్రాతిపదికగా పార్టీ నిర్మాణమే మన ఏకైక లక్ష్యం. విరాళదాత వివాహితులైతే దంపతులిద్దరినీ జుగాడ్ ఓటర్లగానే వ్యవహరిద్దాం. ఎమ్మెల్యే నియోజకవర్గం ప్రాతిపదికగా, ఉభయ తెలుగు రాష్ట్రాలలో పార్టీ ఏర్పడుతుంది. జాతీయపార్టీగా ఎదిగి స్థిరపడుతుంది.



ఎం. పార్థసారథి

(ఫౌండర్ ప్రెసిడెంట్)

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10,

హుడా కాలనీ, సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035

ఈమెయిల్: mpstexer@gmail.com

# ప్రతిపాదిత "జుగాడ్ ఓటర్ల పార్టీ" రూపు-రేఖలు !

1. "జుగాడ్ ఓటర్ల పార్టీ" అన్నది తాత్కాలికపు పేరు మాత్రమే! పార్టీలో అంతర్గత-ప్రజాస్వామ్యమే శిలాశాసనంగా, పారదర్శకత, బాధ్యత, తనను విరాళాలతో సమర్థించిన జుగాడ్ ఓటర్లకు జవాబుదారీగా వ్యవహరించగల నేర్పుతో, సాటికార్యకర్తలతో మరియూ జుగాడ్ ఓటర్లతో కలిసిమెలిసి పనిచేస్తూ ఆనందించే - మొదటి 24 మంది కార్యకర్తలు వచ్చే వరకూ "జుగాడ్ ఓటర్ల ఉద్యమం" అన్నది పార్టీ ఏర్పాటు కోసం కావలసిన ఆర్థిక వనరుల సమీకరణకై కృషిచేస్తూ ఉంటుంది. అంతవరకూ, రాజకీయాలని పవిత్రవ్యాసంగంగా భావిస్తూ - ఈ బృహత్కార్యానికి పదివేల రూపాయల విరాళాలిచ్చే జుగాడ్ ఓటర్లందరూ భావిభారత భాగ్య విధాతలుగా గుర్తించబడతారు. అనుసంధానకర్తగా నేను నిమిత్తమాత్రుడిని మాత్రమే. జుగాడ్ ఓటర్లది సమిష్టి నాయకత్వం, సమిష్టిబాధ్యత.

2. అనునిత్యం ప్రతివిషయాన్నీ శంకిస్తూ, విశ్లేషిస్తూ, అదేపనిగా చర్చిస్తూ కాలంవృధా చేసే ఓటర్లని, జుగాడ్ ప్రతిపక్షానికి చెందిన వారిగా గుర్తించి గౌరవించాలి. మనది అధికారపక్షంగా భావిస్తూ అత్యంత జాగరూకతతో పార్టీలో పనిచేయాలి.

3. పొలిటికల్ పార్టీల ద్వారానే ప్రభుత్వాలు ఏర్పడతాయి అన్నది నగ్న సత్యం. కొన్ని పార్టీలు ఎన్నికలలో గెలిచేందుకు డబ్బునీ, మద్యాన్నీ పంచుతున్నాయి. మన ఓట్లు కొనేందుకు డబ్బుని వెదజల్లుతూ, ఆతరువాత మద్యాన్ని ప్రభుత్వానికి ఆదాయ వనరుగా మలచి, మద్యం ధరలు విపరీతంగా పెంచి, ఓటర్లను "తాగుబోతులు"గా అభివర్ణిస్తూ, వారిని అవమానిస్తూనే నిలువు దోపిడీ చేస్తూ, "మద్యపాన-నియంత్రణ" ముసుగులో మహిళల ఓట్లను కొల్లగొడుతున్నాయి. రాజ్యాంగ విరుద్ధమైన ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలు చట్టబద్ధ పరిపాలనద్వారానే బహిరంగంగా జరుగుతున్నాయి. జుగాడ్ ఓటర్ల పార్టీతో సహా అన్ని రాజకీయ పార్టీలకూ మద్యం తయారీ, అమ్మకాలనూ నియంత్రించే విధానపరమైన స్వేచ్ఛ ఉంది. కానీ ఓటర్లు ఏది తినాలో, ఏది తాగాలో స్వేచ్ఛగా నిర్ణయించే అధికారం మాత్రం ఓటర్లదే!

4. సమస్యల పరిష్కారం సమస్యలలోనే దాగిఉంది. ముల్లుని ముల్లుతోటే తీయడం జుగాడ్ ఓటర్లపార్టీకి పరిష్కార సూత్రం. ఎంతోమంది స్త్రీలూ పురుషులూ మక్కువగా సేవించే తేలికపాటి బీరులో ఆల్కహాల్ 5 శాతంలోపున ఉంటే, కఠిన మద్యంలో ఆల్కహాల్ 40 శాతం పైన ఉంటుంది. అందుచేత బీరుని ఆహారపానీయంగా క్రోడీకరించి, ప్రస్తుతం 150 రూపాయిలకు అమ్ముతున్న సీసాబీరుని, ప్రభుత్వం డ్యూటీల పేరిట చేస్తున్న లూటీని నియంత్రించి, 30 రూపాయిలకు సూపర్ మార్కెట్ల ద్వారా అందించవచ్చు. ఎన్నికల సమయంలో ఓటర్లంతా సమానమే, కాబట్టీ ఓట్ల వ్యాపారం జరగదు. ఓటర్లకు మందు పార్టీలూ, విందు భోజనాలూ ఇవ్వదు. జుగాడ్ పార్టీ అభ్యర్థిని చూడగానే జనాలు గుర్తుపడతారు. కండువాలుండవు, కటౌట్లుండవు, ఫ్లెక్సీలుండవు. ఈపార్టీలో నేరచరితులకు B-FORM లభించదు. ఈపార్టీ పేరున B-FORM పొందిన అభ్యర్థులందరూ గెలుపు గుఱ్ఱాలే. ఎవర్నిఎన్నుకుంటారో ఓటర్ల ఇష్టం. ఎన్నికల నిమిత్తం చేసే ఖర్చు ఎన్నికలకమిషన్ పరిమితికి మించే ప్రసక్తేలేదు.

5. రాష్ట్రాలలో గ్రామస్థాయి నుండి పట్టణ, నగరపాలికా సంస్థలవరకూ ఎక్కడ కక్కడే అధికార వికేంద్రీకరణతో బాటు, ఆర్థికవనరులు కల్పించి, ఉచితవిద్యా, మెరుగైన ఆరోగ్యం, సత్వర న్యాయవ్యవస్థలూ, సామాన్య ప్రజలరక్షణకై పనిచేసే పోలీసు యంత్రాంగం మొదలైన ఇతర మౌలిక వసతుల నిర్మాణమే పార్టీ యొక్క ప్రధాన కార్యక్రమం.

6. Please contact: M.Parthasarathy (9866416798)

Advt.

లోక్‌సత్తా
ప్రజలే ప్రభువులు

# లోక్‌సత్తా 25వ జన్మదినోత్సవం

డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నాయకత్వంలో 1997 ఆగస్టు 3న వ్యవస్థాపితమైన లోక్‌సత్తా భారతదేశంలో పౌరుల చుట్టూ పరిపాలన, అవినీతిరహిత సమాజ స్థాపన, ప్రజల భాగస్వామ్యం, సమానావకాశాల స్వేచ్ఛామార్కెట్, సమన్యాయం తదితర సమూల రాజకీయ, ఆర్థిక, పాలనా మార్పుల కోసం నిరంతరం కృషి చేస్తున్న విశ్వసనీయ రాజకీయ ఉద్యమంగా గుర్తింపు తెచ్చుకుంది. రెండో ప్రపంచయుద్ధం తర్వాత అంతటి కృషిని విజయవంతంగా చేసి ఇన్ని సంస్కరణల్ని సాధించిన సంస్థ ప్రపంచంలో దాదాపు కనిపించదు.

స్వచ్ఛంద సంస్థ అంటే ప్రజలకు కొన్ని రంగాలలో సేవల్ని, వసతుల్ని కల్పించటానికి పరిమితమవటం పరిపాటి. కానీ 1996లో ప్రారంభించిన మాతృసంస్థ ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) సహకారంతో అన్ని సమస్యలకూ తల్లివేరు లాంటి, అన్ని సమస్యలకూ ప్రధాన పరిష్కారం కాగల రాజకీయ, పాలనా రంగాల్ని ప్రక్షాళన చేయటానికి లోక్‌సత్తా నడుం బిగించింది. ప్రపంచదేశాలన్నిటి అనుభవాల్నీ అధ్యయనం చేసి భారతదేశ పరిస్థితులకనుగుణంగా వాటిని రూపొందించి జయప్రకాష్ నారాయణ్ మనదేశంలో సంస్కరణల్ని సాధించే ప్రయత్నం ప్రారంభించారు. అమెరికా, బ్రిటన్, సింగపూర్, చైనా వంటి దేశాలలో సంస్కరణలు మంచి మార్పుల్ని తెచ్చినా, ఎన్నో మతాలు, కులాలు, భాషలు, తెగలు ఉన్న భారతదేశంలో ఆ సంస్కరణల్ని తీసుకురావటం మరేదేశంలోనూ లేనంత కష్టమైన పని. అయినా పెద్దసంఖ్యలో యువత, మునుపెన్నడూ లేనంతస్థాయిలో సాంకేతిక పరిజ్ఞానం, ప్రజలలో మార్పు రావాలన్న అంతర్లీన తపన ఉండటం వల్ల ఇది ఎంత కష్టమైనా కూడా పూర్తిగా ఆచరణసాధ్యమని ఆ మహాకార్యాన్ని లోక్‌సత్తా చేపట్టింది. క్రమంగా ఫలితాలు వస్తున్నాయి. ఈవేళ అందరూ ఏదోకస్థాయిలో లోక్‌సత్తా భాష మాట్లాడుతున్నారు.

**దేశంలో గత 25 ఏళ్లలో వచ్చిన పలు ప్రధాన సంస్కరణలు, మార్పులు ఎఫ్‌డీఆర్ - లోక్‌సత్తా కృషి వల్ల వచ్చినవే. ఒక ఉద్యమ సంస్థగా, ఆ తర్వాత 2006 నుంచి పార్టీగా కూడా లోక్‌సత్తా సాధించిన విజయాల్లో కొన్ని కీలకమయినవి:**

- ✓ పౌర సేవల పత్రం ఆవిష్కరణ, పెట్రోలు బంకుల్లో తూనికల మోసాన్ని చాలావరకు అరికట్టటం
- ✓ ఓటర్ల జాబితాల ప్రక్షాళన
- ✓ అభ్యర్థుల నేరచరితని, ఇతర వివరాలని ప్రకటించే చట్టం (2003)

# వ్యవస్థీకృత మార్పుల కోసం ఉద్యమం లోక్‌సత్తాతోనే మొదలైంది

పాతికేళ్ల క్రితం మన రాజకీయ వ్యవస్థని, పాలనని సమూలంగా సంస్కరించి ప్రజాస్వామ్యంలో లొసుగులని ప్రజల భాగస్వామ్యంతో సరిచేయాలని లోక్‌సత్తా ఉద్యమం ఆవిర్భవించింది. వ్యక్తి స్వేచ్ఛ, స్వపరిపాలన, పౌరులకి పాలనలో భాగస్వామ్యం, చట్టబద్ధ పాలన, పొరపాట్లని ఎప్పటికప్పుడు సరిచేసే స్వయందిద్దుబాటు పద్ధతులు మూలస్తంభాలుగా మన వ్యవస్థని సరయిన గాడిలో పెట్టటం లోక్‌సత్తా మౌలిక లక్ష్యం. ఓటుకు – ప్రజల పన్నుల డబ్బుకు ఉన్న సంబంధాన్ని తెలియచెప్పి, నిజమైన ప్రజాస్వామ్యాన్ని సాధించే సమగ్ర రాజకీయ, పాలనా సంస్కరణోద్యమం భారతదేశంలో లోక్‌సత్తాతోనే మొదలైంది. చాలామంది సూక్ష్మస్థాయిలో ఆ కృషిని చేసినా మొట్టమొదటి సమూల కృషి లోక్‌సత్తాదే. ప్రజల చుట్టూ తిరిగే వ్యవస్థల నిర్మాణాన్ని లోక్‌సత్తా ఒక ఉద్యమంగా మార్చింది.



దేశంలో ప్రజాస్వామ్య ఉద్యమాలకు, ఎన్నో మౌలిక మార్పులకు నాంది పలికింది. ప్రజాస్వామ్యం పీఠంతో ప్రారంభమైన ప్రయత్నం లోక్‌సత్తాగా రూపుదిద్దుకుని తెలుగునాట, దేశవ్యాప్తంగా, విదేశాలలో కూడా అనేకమందిని ప్రభావితం చేసింది.

లోక్‌సత్తా ఉద్యమం తొలినాటి నుంచి ఒక వినూత్నమయిన, విశిష్టమయిన పంథాని అనుసరించింది. లోక్‌సత్తా ఆవిర్భావం వరకూ రాజకీయాలని ద్వేషించటం, తిరస్కరించటం మధ్యతరగతి వర్గానికి, యువతకి ఆనవాయితీ అయింది. లోక్‌సత్తా ఆ సాంప్రదాయానికి విరుద్ధంగా, నిజమయిన రాజకీయం పవిత్ర వ్యాసంగమని నిర్ద్వంద్వంగా ప్రకటించింది. ప్రజాస్వామ్యం, రాజకీయం అవిభాజ్యమని, రాజకీయాన్ని తిరస్కరించటం స్వేచ్ఛకి, ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టవుతుందని లోక్‌సత్తా బలంగా వాదించింది. మన రాజకీయంలో ఉన్న లోపాలకి విరుగుడు మరింత మంచి, మరింత ఎక్కువ రాజకీయమేనని, ప్రజల భాగస్వామ్యంతో జనరాజకీయాన్ని సృష్టించటం అత్యవసరమని ఉద్ఘాటించింది. లోక్‌సత్తా అవిశ్రాంతంగా చేసిన ఈ పోరాటం కాలక్రమేణా దేశంలో విద్యావంతులని, మధ్యతరగతిని, యువతని, మీడియాని గణనీయంగా ప్రభావితం చేసింది. ఈ క్రమంలో మన ప్రజాస్వామ్యం దిశను, భాషను గణనీయంగా ప్రభావితం చేసింది లోక్‌సత్తా. గత మూడు దశాబ్దాలుగా ఎన్నడూలేనంతగా గతంలో రాజకీయాన్ని ద్వేషించిన వర్గాలు ఇప్పుడు రాజకీయం విస్మరించరానిదని, ఏదో ఒక రూపంలో నిజాయతీగా రాజకీయాన్ని ప్రభావితం చేయటం అవసరమని గుర్తిస్తున్నాయి.

మనదేశంలో ఉద్యమాలంటే.. అయితే ప్రభుత్వాలని, పార్టీలని తిట్టిపోయటం, లేదా తాత్కాలికంగా జనాకర్షణలని ఎరచూపించి అన్నీ ఉచితంగా ప్రభుత్వం అందించాలని ప్రజలని సమీకరించటం ఆనవాయితీ అయ్యాయి. లోక్‌సత్తా ఉద్యమం ఈ సంప్రదాయానికి భిన్నంగా వాస్తవాలు, సాక్ష్యాలు ఆధారంగా, హేతుబద్ధమయిన వాదనలతో శాస్త్రీయ పరిష్కారాలని, దీర్ఘకాలిక సంస్కరణలని ప్రతిపాదించింది. ప్రజాస్వామ్యంలో పౌరులు పౌరుల్లాగా ప్రవర్తించాలిగానీ పాలితులుగా కాదంటూ కొత్త ధోరణులతో ద్వేషరహితంగా సామరస్య వాతావరణంలో మంచి బహిరంగ చర్చను సమాజం ముందు పెట్టటంలో లోక్‌సత్తా గొప్ప విజయం సాధించింది. పార్టీల పట్ల పక్షపాత ధోరణి చూపకుండా, ఎన్నికైనవాళ్లంతా ద్రోహులు అన్న నిరాశనిరసన భావాల్ని ప్రదర్శించకుండా రాజ్యాంగ పద్ధతుల ద్వారా, సామరస్యంగా పరిష్కారాల కోసం విశేష కృషి చేయబట్టే ఈ దేశ చరిత్రలో మరే ఉద్యమమూ సాధించనన్ని ఫలితాలను లోక్‌సత్తా సాధించింది. ఎన్నో సందర్భాలలో అన్ని పార్టీల మధ్య ఏకాభిప్రాయాన్ని సాధించి ఎన్నో గణనీయమయిన మార్పులని సులువుగా సాధించింది. ఉదాహరణకి తెహల్కా కుంభకోణం నేపథ్యంలో అన్ని పార్టీలనీ ఒప్పించి నిజాయతీ రాజకీయానికి, ఎన్నికల ప్రచారానికి కావలసిన నిధులని నిజాయతీగా, దాతలకి పన్ను రాయితీలతో సేకరించే సమగ్ర చట్టాన్ని లోక్‌సత్తా సాధించింది. అమాయక ప్రజల ఓట్లు కొనుగోలు, కులం, మతం, ప్రాంతం పేరుతో విద్వేషాలని రెచ్చగొట్టే ఓటుబ్యాంకు రాజకీయాలు, ప్రజాధనంతో మౌలిక సదుపాయాలని, ఉమ్మడి సేవలని అందించకుండా తాత్కాలిక తాయిలాలతో ఆకర్షించే సంస్కృతి ఉన్న దేశంలో ఎన్నికల నిధుల సంస్కరణలు చాలవు. కానీ నిజాయతీ రాజకీయానికి నిజాయతీ పద్ధతులతో నిధులని సమకూర్చటం మన రాజకీయ ప్రక్షాళనలో ఒక కీలకమయిన ముందడుగు. ఇలా ప్రతి

సమస్యకి వాస్తవాలు, తర్కం ఆధారంగా ఆచరణసాధ్యమయిన, జాతి భవిష్యత్తుని పదిలపరిచే దీర్ఘకాల పరిష్కారాలని సూచించటంలోను, దేశప్రజలలోను, రాజకీయ పార్టీలలోను ఏకాభిప్రాయసాధనలోను లోక్‌సత్తా చేసిన కృషి, సాధించిన విజయాలు నిరుపమానమయినవి.

ప్రజాస్వామ్య సమాజంలో రాజకీయం ప్రాధాన్యతని గుర్తించటంలోను, జనజీవనాన్ని ఆటంకపరచకుండా శాంతియుత ఉద్యమాలను రూపొందించటంలోను, హేతుబద్ధమయిన పరిష్కారాలను నిరంతరం జాతి ముందు పెట్టి ఒడుపుగా వాటిని సాధించేందుకు పోరాటం చేయటంలోను లోక్‌సత్తా ఎంతో ముందుచూపుని, వ్యూహపటిమని, ప్రజాస్వామ్య దృక్పథాన్ని ప్రదర్శించింది. ఈ పద్ధతులవల్లనే పార్లమెంటులో ఒక్క సభ్యుడు కూడా లేకుండా లోక్‌సత్తా స్వతంత్ర భారతంలో దేశచరిత్రలో మరే ఉద్యమమూ సాధించనన్ని విజయాలను సునాయాసంగా సాధించగలిగింది. నిజానికి రెండవ ప్రపంచ యుద్ధానంతరం ప్రపంచంలో మరే పౌరసమాజ ఉద్యమమూ శాంతియుతంగా, అధికారం లేకుండా ఇన్ని విజయాలు సాధించలేదు.

గత 25 ఏళ్లలో దేశ రాజకీయాలలో, రాజ్యవ్యవస్థలో కొన్ని మంచి మార్పులు వచ్చాయి, వస్తున్నాయి. కానీ అవి ఈదేశం సుస్థిర అభివృద్ధికి, అందరికీ ఎదిగే అవకాశాలకు భరోసా ఇచ్చేందుకు చాలవు. కొన్ని రంగాలలో సంక్షోభం మరింత పెరుగుతూ వస్తోంది. ఎన్నికలలో అక్రమ ఖర్చు ఈ రెండు దశాబ్దాలలో పది నుంచి ఇరవై రెట్లు పెరిగింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాలలో ఎన్నికల ఖర్చు విపరీతంగా పెరిగిపోయి, రాజకీయం పూర్తిగా వ్యాపారంగా మారిపోయింది. దాంతో ప్రభుత్వాలు మారినా అధికారాన్ని స్వంత లాభం కోసం దుర్వినియోగం చేయటం, రాజకీయంలో అనారోగ్యకరమయిన పోటీ వల్ల ఓట్లు కొనుగోలు చేయటం, పదవులని కేవలం అక్రమార్జన కోసం మార్గాలుగా భావించటం మరింతగా పెరిగిపోయాయి. ఓటుకి, ఎన్నికయ్యే ప్రభుత్వానికి, ప్రజలకంతే నిజమయిన ఫలితాలకి మధ్య సంబంధం తెగిపోవటంతో కుల,మతాల సమీకరణ, ప్రజల దీర్ఘకాల ప్రయోజనాలని తాకట్టుపెట్టి తాత్కాలిక తాయిలాలు ఆశచూపటం సర్వసాధారణమయిపోయాయి.

లోక్‌సత్తా 25 ఏళ్ల కృషిలో భాగస్వాములైనవారిని అభినందిస్తూ, కొత్తతరం వారు కూడా ఈ సంస్కరణల ఉద్యమంలో పాలుపంచుకుంటూ తమ జీవితాల్ని, భవిష్యత్తుని సుసంపన్నం చేసుకోవాలని, సమున్నత భారతదేశ నిర్మాణంలో భాగస్వాములవ్వాలని, చరిత్రకు సరైన పక్షాన నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

**- డా॥ జయప్రకాష్ నారాయణ్,**
**ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు**

✓ పార్టీల విరాళాలలో పారదర్శకతని తెచ్చే చట్టం (2003)
✓ పరోక్ష పన్నుల (సెంట్రల్ ఎక్సయిజ్, కస్టమ్స్) సేకరణలో కీలక సవరణలు
✓ పార్టీ ఫిరాయింపు నిషేధాన్ని బలోపేతం చేసే రాజ్యాంగ సవరణ (91వ సవరణ)
✓ మంత్రివర్గ సభ్యుల సంఖ్యని కుదించే ఏర్పాట్లు (91వ సవరణ - 2003)
✓ పాలనా సమాచార హక్కు చట్టం (2005)
✓ జాతీయ ఆరోగ్య మిషన్ (2005)
✓ స్థానిక న్యాయాలయాల చట్టం (2009)
✓ సహకార సంఘాల స్వయంప్రతిపత్తి (97వ రాజ్యాంగ సవరణ - 2012)
✓ 2 జీ స్పెక్ట్రం లైసెన్సుల రద్దు - సహజ వనరుల వేలం పాట విధానం (2013)
✓ లోక్‌పాల్ చట్టం (2014)
✓ ఉన్నత న్యాయమూర్తుల నియామకం కోసం జాతీయ జ్యుడీషియల్ నియామకాల కమిషన్ (ఎన్‌జేఏసీ - 99వ రాజ్యాంగ సవరణ - 2014).
✓ స్థానిక ప్రభుత్వాలకి నిధుల కేటాయింపులో గణనీయ పెంపు

(2014 నుంచి విద్య, ఆరోగ్యం, స్థానిక ప్రభుత్వాలు, చట్టబద్ధ పాలన, న్యాయవ్యవస్థ - పోలీసు సంస్కరణలు, ప్రభుత్వ సేవలు సకాలంలో అందే సమగ్ర చట్టం, రాజకీయ సంస్కరణలు ఈ రంగాలలో మరిన్ని మౌలిక మార్పుల కోసం లోక్‌సత్తా - ఎఫ్‌డీఆర్ కృషిచేస్తున్నాయి. ఇందులో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతోపాటు పలు ఇతర రాష్ట్రాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలని, కార్యక్రమాలను, సురాజ్య యాత్ర వంటి పర్యటనల్ని నిర్వహించి ప్రజలను చైతన్యపరచటంతోపాటు ప్రభుత్వాలకు నివేదికల్ని, విధానపత్రాల్ని రూపొందించి వాటి అమలుకు కృషి చేసింది. వీటిలో కొన్ని సూత్రప్రాయంగా కార్యరూపం దాల్చాయి).

✓ ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా పౌర సేవల్ని అందించే సర్వీస్ గ్యారంటీకి చట్టబద్ధ ఏర్పాట్లను కొన్ని రాష్ట్రాల్లో సాధించటం
✓ 2020లో కస్తూరి రంగన్ కమిటీ నివేదికతో వచ్చిన జాతీయ నూతన విద్యావిధానం రూపకల్పనలో లోక్‌సత్తా చొరవ, కృషి ఉన్నాయి.
✓ లోక్‌సత్తా ఎన్నో ఏళ్లుగా వాదిస్తున్న వ్యవసాయ, కార్మిక

సంస్కరణల్లో కొన్ని 2020లో అమల్లోకి వచ్చాయి. వ్యవసాయ రంగంలో రైతుకు సంకెళ్లు తెంచి ఆదాయాన్ని పెంచే స్వేచ్ఛామార్కెట్‌కు చట్టబద్ధంగా అవకాశం కల్పించారు.

- ✔ 2020, 2021లో ధనరాజకీయాలు, చట్టబద్ధపాలనపై నిష్ణాతులు, విశేషానుభవజ్ఞులు, రాజకీయ నేతలు తదితరులతో జాతీయ సదస్సుల్ని నిర్వహించి హైదరాబాద్ డిక్లరేషన్ ద్వారా తక్షణ ఆచరణసాధ్య మౌలిక మార్పుల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. వీటిలో కొన్నిటి అమలుకు యూనియన్ ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది.
- ✔ కొవిడ్ కాలంలో నిర్ధారణ, చికిత్సలు, పరిశోధనలు, వ్యాక్సిన్లు, విధానాల రూపకల్పన, ఆర్థిక ప్యాకేజీలు, ఉపాధితో కూడిన ఆర్థిక వృద్ధి తదితర అంశాలపై ప్రభుత్వాలకు ఎప్పటికప్పుడు సలహాసూచనలను ఇవ్వటంతోపాటు.. 2021లో సమగ్ర ప్రజారోగ్య వ్యవస్థ నిర్మాణానికి విధాన పత్రాన్ని రూపొందించి యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, పౌర సమాజం, నిపుణులకు అందించి అమలు కోసం లోక్‌సత్తా కృషి చేస్తోంది.

ఒక శాంతియుత, ప్రజాస్వామ్య భావవిప్లవం ఏ ఆర్భాటం లేకుండా, రాజ్యాంగ పరిధిలో చట్టబద్ధంగా వివిధ రూపాలలో పోరాడుతూ, ఏ అధికారం లేకుండా ఇన్ని విజయాలను సాధించటం ప్రపంచ చరిత్రలోనే అరుదు.

వివక్ష లేకుండా ప్రతి బిడ్డకూ తనలోని శక్తిసామర్థ్యాలను వికసింపచేసుకునే అవకాశాల్ని కల్పించటం, నివారించదగ్గ బాధలు లేకుండా చేయటం, ఈ రెంటినీ సాధించటం ద్వారా ప్రతి వ్యక్తీ తన జీవితంలో తలెత్తుకుని ఆత్మవిశ్వాసంతో, సుఖసంతోషాలతో బతికేలా చేయటం లోక్‌సత్తా సంస్కరణల వెనక ప్రధాన స్ఫూర్తి. ఇందుకోసమే వ్యక్తి సుఖాన్ని, సమాజహితాన్ని అనుసంధానం చేస్తూ నూతన రాజకీయ, పాలనా సంస్కృతిని లోక్‌సత్తా ప్రతిపాదించింది. 'ప్రజలే ప్రభువులు, పాలకులు, ప్రభుత్వోద్యోగులు సేవకులే' అనే నినాదంతో తమ సాధికారత కోసం అవగాహనతో రాజ్యాంగబద్ధంగా పోరాడే పౌరశక్తిగా ప్రజల్ని తయారుచేస్తూ వారికో వేదికగా దీపస్తంభంలా లోక్‌సత్తా పనిచేస్తోంది. లోక్‌సత్తా భావజాలం ఒక దృక్పథంగా, ఆచరణగా మారితే భారత రాజకీయాలలో, ప్రతి భారతీయుని సామాజిక జీవితంలోనేకాక, వ్యక్తిగత జీవితంలో సైతం సంపూర్ణ విప్లవమే వస్తుంది. ఒకరకంగా చెప్పాలంటే ప్రపంచంలోనే అత్యుత్తమ డాక్యుమెంట్‌గా పేరొందిన భారత రాజ్యాంగం లక్ష్యాలు, లోక్‌సత్తా లక్ష్యాలూ ఒకటే.

ప్రజాస్వామ్యం బలోపేతమై ప్రతి పౌరుడూ సాధికారతతో తలెత్తుకుని బతికేందుకు, ఎదిగేందుకు ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ముఖ్యంగా ఐదు కోణాలలో సంస్కరణల కోసం పనిచేస్తున్నాయి:

**1. వ్యక్తి స్వేచ్ఛ:**

వ్యక్తి స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి ప్రాణం. భావ ప్రకటన హక్కు,




ఎక్కడైనా నివశించే హక్కు, మత స్వేచ్ఛ, వృత్తి స్వేచ్ఛ ఇందులో భాగాలు. కానీ వ్యక్తి స్వేచ్ఛను అనేక రూపాలలో హరిస్తున్నారు.

**2. స్వయంపాలన:**

ప్రజాస్వామ్యంలో పౌరులకు తమని తాము ప్రత్యక్షంగా లేదా పరోక్ష ప్రాతినిధ్య పద్ధతిలో పాలించుకునే హక్కు ఉంది. కానీ మన ఎన్నికల వ్యవస్థ లోపభూయిష్టంగా ఉండటం వల్ల ఎన్నికల్లో డబ్బు, కండబలం, కులం, ప్రాంతం, మతం చొరబడి ప్రజలను కేవలం ఓటు వేసే యంత్రాలుగా మార్చేశాయి.

**3. ప్రజల భాగస్వామ్యాధికారం:**

పాలనలో పౌరులకు నిరంతర భాగస్వామ్యం ఉండాలి. కానీ కేంద్రీకృత పాలన వల్ల పౌరుల ప్రమేయం లేకుండా నిర్ణయాలు జరుగుతున్నాయి. పరిపాలన వికృత రూపం దాల్చి ప్రజాస్వామ్య ఫలితాలు ప్రజలకు అందకుండా చేస్తోంది. దీనికి పరిష్కారమైన వికేంద్రీకరణను అణచివేస్తున్నారు.

**4. చట్టబద్ధ పాలన:**

ఎంతటి సంపన్నులైనా, ప్రజాప్రతినిధులైనా, ఉన్నతాధికారులైనా చట్టం ముందు సామాన్యుడితో సమానం కావాలి. చట్టం ఎవరికైనా ఒకటే కావాలి. కానీ ప్రస్తుతం డబ్బు, అధికారం, ఉన్నవాడికో న్యాయం, లేనివాడికో న్యాయం నడుస్తోంది.

**5. స్వయందిద్దుబాటు:**

రాజ్య వ్యవస్థలో స్వయందిద్దుబాటుకి, స్వయంపరివర్తనకి తగిన వ్యవస్థ ఉండాలి. మన పాలనా వ్యవస్థ భయంకరమైన ఉపద్రవాలు వచ్చినప్పుడు తాత్కాలికంగా స్పందించటం తప్ప, ముందుచూపుని, స్వయంపరివర్తనా శక్తిని కోల్పోయింది.

మొత్తం మీద ప్రజాస్వామ్య ఫలితాలను ప్రజలకు అందించాల్సిన వ్యవస్థలు సక్రమంగా పనిచెయ్యటం లేదు. వీటిని చక్కదిద్ది ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసి ప్రజలను ప్రభువులుగా చేసి పాలకులను సేవకులుగా మార్చి జన రాజకీయ, సామాజిక, ఆర్థిక వ్యవస్థను నిర్మించటమే లోక్‌సత్తా ప్రధాన లక్ష్యం. ఈ దిశగా పలు మైలురాళ్లను దాటినా ఇంకా ఎంతో దూరం ప్రయాణించాల్సి ఉంది.

# సహకార సంస్థలపై యూనియన్‌కే కాదు.. రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలకూ పెత్తనం ఉండదు: జేపీ

లోక్‌సత్తా పహలా పచ్చీస్‌లో సాధించిన విజయాల్లో 97వ రాజ్యాంగ సవరణ ఎంతో కీలకమైనది. ప్రజలు ఆర్థికంగా ఎదగటానికి, ప్రజాస్వామ్యం వికసించటానికి దోహదం చేసే సహకార రంగం విజయవంతానికి కావలసిన స్వయంప్రతిపత్తిని కల్పిస్తుంది కాబట్టే ఈ రాజ్యాంగ సవరణను చరిత్రాత్మక సవరణగా ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తరచూ అభివర్ణిస్తుంటారు. ప్రభుత్వాల అనవసర జోక్యం లేకుండా ప్రజలు తమంతట తాము సంఘాలుగా ఏర్పడి ఆర్థిక, సామాజిక కార్యక్రమాలను నిర్వహించుకునే స్వేచ్ఛకు 97వ రాజ్యాంగ సవరణ గ్యారంటీ ఇస్తుంది.

వ్యవసాయం, పాడి తదితర రంగాల్లో నెదర్లాండ్స్, బ్రెజిల్, కెనడా తదితర దేశాలు సహకార రంగంలో ప్రపంచస్థాయి విజయాలు సాధిస్తుండగా మన దేశంలో సహకార రంగం ఇంకా ప్రాధాన్యతను సంతరించుకోలేదు. 97వ రాజ్యాంగ సవరణ వచ్చి దాదాపు దశాబ్దం గడుస్తున్నా ఇప్పటికీ దాని ప్రాధాన్యత గురించి ఇంకా సామాన్య ప్రజల్లోకే కాదు.. కాస్త ఆలోచన చేయగల వారిలోకీ వెళ్లలేదు. లోక్‌సత్తా ఎన్ని ఓట్లు, సీట్లు సాధించిందీ అని అడుగుతుంటారుగానీ.. లోక్‌సత్తా పార్టీగా ఏర్పడ్డాక సైతం ఒక్క పార్లమెంటు సభ్యుడు కూడా లేకుండా 97వ రాజ్యాంగ సవరణ (2012) సహా పలు కీలక విజయాల్ని సాధించింది అని వివరిస్తే ఎక్కువమంది అర్థమయ్యీ కానట్లు తలూపుతారు. ఒక్కోసారి ఏదో గ్రహాంతర భాష మాట్లాడినట్లు చూస్తారు. కాలక్రమంలో మాత్రమే వాటి ప్రాధాన్యతను గుర్తిస్తున్నారు.

ఇటీవల యూనియన్ కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో కొత్తగా సహకార శాఖను ఏర్పాటు చేయటం, మోదీ ప్రభుత్వంలో ఎంతో ముఖ్యమైన అమిత్‌షాకు ఆ శాఖ బాధ్యతలు అప్పగించటంతో ఈ రంగంపై కొంత చర్చ విస్తృతమవుతోంది. రాష్ట్రాల అధికారాల్ని చేజిక్కించుకునేందుకు, రాజకీయ పార్టీల సభ్యులతో నిండిన సహకార సంఘాలపై పట్టు బిగించటం ద్వారా ప్రత్యర్థి పక్షాల అంగ, అర్థ బలాలపై ఆధిపత్యం సాగించేందుకే జాతీయస్థాయి ప్రభుత్వం సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిందన్న వాదనలు రాజకీయంగా వినిపిస్తున్నాయి. నూతన వ్యవసాయ చట్టాలపై రైతుల్లోని అపోహల్ని తొలగించే ప్రయత్నం చేయకుండా అప్రజాస్వామికంగా వ్యవహరించటం వల్ల వచ్చిన వ్యతిరేకతకు విరుగుడు ప్రయత్నాల్లో భాగంగానే ఈ శాఖను ఈ సమయంలో ఏర్పాటు చేశారని కొందరు అంటున్నారు. భారత దేశాన్ని సహకార సమాఖ్య వ్యవస్థగా మలచి రాష్ట్రాలతో సుహృద్భావ సంబంధాల్ని కొనసాగిస్తామన్న మోదీ ప్రభుత్వం ఆచరణలో ఆ స్థాయిని కనబరచకపోవటంతో రాష్ట్రాల్లో, పౌర సమాజంలో కూడా ఎక్కువమంది అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మన దేశంలో వివిధ రంగాల్లో, స్థాయిల్లో దాదాపు 10లక్షల సహకార సంఘాలున్నాయి. సహకార రంగంలో జాతీయ స్థాయి ప్రభుత్వ జోక్యం లేకుంటే అంతా బాగున్నట్లు మనం భావించటం



పొరపాటు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా రాష్ట్రాల్లో ప్రభుత్వాలు సహకార సంఘాలను చేజిక్కించుకునే ప్రయత్నం చేస్తున్నాయన్నది వాస్తవం. సహకార సంఘాల నిర్వహణలో లొసుగులున్నాయన్నదీ నిజం. ఈ నేపథ్యం నుంచే సహకార రంగాన్ని భారత్‌లో బలోపేతం చేసే చర్యలను చేపట్టాలి. సహకార సంఘాలపై రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రభుత్వాలతోపాటు లోక్‌సత్తా ఎంతో బలంగా ప్రతిపాదించే స్థానిక ప్రభుత్వాలు కూడా పెత్తనం చేయకూడదు. సహకార సంఘాల్లో నేరపూరిత చర్యలు ఉంటే మాత్రమే ప్రభుత్వాలు జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలి.

ప్రజలకు ఆర్థిక, సామాజిక అభివృద్ధిని అందించటం భవిష్యత్ భారతానికి ఎంతో కీలకమైన అంశం కాబట్టే.. సహకార రంగం బలోపేతానికి చర్యలు తీసుకోవాలని 2014లో నరేంద్ర మోదీ ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టాక 11 అంశాలతో ఆయనకు పంపిన నోట్‌లో డా॥ జేపీ కోరారు.

కొత్తగా ఏర్పాటు చేసిన మంత్రిత్వ శాఖ ద్వారా యూనియన్ ప్రభుత్వం సహకార రంగాన్ని ఏ రకంగా బలోపేతం చేస్తుందన్నది వేచి చూడాల్సిన అంశం. కానీ ఈ రంగంలో ప్రభుత్వ నిర్ణయాల్ని ప్రభావితం చేయటానికి, చర్యల్ని నిశితంగా పరిశీలించటానికి అవసరమైన స్పష్టత మాత్రం మనకు అవసరం. సహకారం.. 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేళ అత్యంత అవశ్యంగా చర్చించాల్సిన రంగం కూడా. అందుకోసమే.. దాదాపు మూడు దశాబ్దాలకు పైగా సహకార రంగంతో అనుబంధమున్న జేపీ ఇటీవల 97వ రాజ్యాంగ సవరణపై సుప్రీంకోర్టు తీర్పు వరకూ వివిధ సందర్భాల్లో చెప్పిన ఈ కొన్ని మాటలు..

- ✔ భారతదేశంలో సహకార రంగం విజయం సాధిస్తే వ్యవసాయం, ఉపాధి అవకాశాలు, ప్రజాస్వామ్యం మెరుగుపడటం వంటి గణనీయ మార్పులు చోటుచేసుకుంటాయి. ప్రభుత్వాల అనుచిత జోక్యం లేకుండా ప్రజలు తమంతట తాము పరస్పర సహాయ సహకారాలకి




సంఘాలుగా ఏర్పడి ఆర్థిక, సామాజిక కార్యక్రమాలను నిర్వహించుకునే స్వేచ్ఛను లోక్‌సత్తా కృషి వల్ల వచ్చిన 97వ రాజ్యాంగ సవరణ పరిరక్షిస్తుంది.

- ✔ వ్యక్తిగతంగా నేను ఆరాధించే హీరోల్లాంటి వ్యక్తులు ఈ దేశంలో ముగ్గురున్నారు. వారు డాక్టర్ రజనీకాంత్ అరోలీ, వర్గీస్ కురియన్, శరద్ జోషి. ఈ ముగ్గురితో నాకు ఎంతో అనుబంధం ఉంది. సహకార రంగంలో స్వయంప్రతిపత్తి కోసం దాదాపు 4-5 దశాబ్దాల నుంచి కృషి చేసిన వర్గీస్ కురియన్‌కు కోట్లాది రైతులు, ప్రజల తరపున, లోక్‌సత్తా తరపున 97వ రాజ్యాంగ సవరణను అంకితమిస్తున్నాను.
- ✔ నేను రాసిన రాజ్యాంగ సవరణకు కొందరు భేషజాలకుపోయి అనవసర పదాల్ని జోడించటం వల్ల కొన్ని చిన్న చిన్న సమస్యలు తలెత్తాయి. అయితే మొత్తంగా సహకార సంఘాల స్వయంప్రతిపత్తికైతే 97వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్యారంటీ లభించింది.
- ✔ ఒకసారి సహకార సంఘం ఏర్పడ్డాక, 1) దేశసమగ్రతకు భంగం వాటిల్లుతున్నప్పుడు 2) చట్టవిరుద్ధ కార్యకలాపాలు లేదా శాంతిభద్రతల ఉల్లంఘన 3) అశ్లీలత వంటివి ఉన్నప్పుడు (మొరాలిటీ) మూడు సందర్భాలలో మాత్రమే ప్రభుత్వం జోక్యం చేసుకునే అవకాశముంది. కానీ, పక్షపాత, దోపిడీ రాజకీయాల కోసం వాటిని నాశనం చేయటానికి ప్రతి రాష్ట్ర ప్రభుత్వమూ ప్రయత్నిస్తూనే ఉంది. పలుమార్లు న్యాయస్థానాల దాకా వెళ్లి ప్రభుత్వాల పెత్తందారీ ధోరణుల్ని లోక్‌సత్తా అడ్డుకుంది.
- ✔ సహకార సంస్థలు ప్రజల సొంత ఆస్తులు. యూనియన్ ప్రభుత్వానికే కాదు.. రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలకు కూడా వాటిపై పెత్తనం ఉండదు.
- ✔ సహకార సంఘాల స్వయంప్రతిపత్తికి హామీనిచ్చే ప్రామాణికమైన 'మ్యాక్స్' (పరస్పర సహాయ సహకార సంఘాల) చట్టాన్ని 1995లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొచ్చింది. దేశంలోనే అసాధారణమైన ఆ చట్టాన్ని అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి రామారావు తీసుకొచ్చారు. ఆ చట్టం గురించి చర్చ వచ్చినప్పుడు ఆయన నన్ను అడిగారు- బ్రదర్, ఆ రంగం గురించి నాకు అంతగా తెలియదు. మ్యాక్స్ చట్టం వల్ల ఎక్కువ మేలు జరుగుతుందంటారా?.. 'రాజ్యాంగం ఇచ్చిన హక్కుల్ని ప్రజలకు అందివ్వాలంటే ఈ చట్టం రావటం ఎంతో అవసరం' అని నేను స్పష్టంగా చెప్పినప్పుడు ఎన్‌టీఆర్ వెంటనే ఆమోదించి మ్యాక్స్ చట్టం తీసుకొచ్చారు. జెడ్పీ ఛైర్మన్‌గా పనిచేసిన అనుభవముంది కాబట్టి, అసాధారణమే అయినా దేవేందర్ గౌడ్‌గారికి



ప్రొహిబిషన్ శాఖతోపాటు సహకార శాఖ మంత్రిత్వ బాధ్యతల్ని అప్పగించారు. అలాగే ఆ చట్టం తేవాలనే ప్రయత్నం వెనక నేపథ్యం కూడా మనకి కొంత అర్థమవ్వాలి.

- ✔ 1964నాటి సహకార చట్టం వల్ల ఆ సంఘాలు పూర్తిగా ప్రభుత్వ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి నిర్వీర్యమైపోసాగాయి. దివాళా దిశగా సాగటం మొదలుపెట్టాయి. దీనివల్ల కోట్లాది రైతుల జీవితాలు నానాటికీ దిగజారుతూ, రాజ్యవ్యవస్థ పెత్తనం ప్రజల హక్కులను హరించే దిశగా బలోపేతం కాసాగింది. ఈ తరుణంలో మన రాష్ట్రంలో సహకార సంఘాల స్వయంప్రతిపత్తి కోసం కృషి చేసిన ఎం. రామరెడ్డి, శశి రాజగోపాలరెడ్డి, సంపత్ వంటి వారితో కలిసి సహకార సంఘాలను క్రియాశీలకంగా పనిచేసే రీతిలో తయారుచేసే ప్రయత్నం ప్రారంభించాం. మ్యాక్స్ చట్టానికి రూపకల్పన చేశాం. అయితే 1964 చట్టాన్ని కదిలిస్తే, ప్రభుత్వ సాయం అందుతోంది వంటి వంకలతో అడ్డుపుల్లలు వేస్తారనే ముందుచూపుతో ప్రభుత్వ సాయం ఏమాత్రం లేని స్వయంప్రతిపత్తిగల సహకార సంఘాలకు మాత్రం వర్తించేలా మ్యాక్స్ చట్టాన్ని తయారుచేశాం. వీటిల్లో ప్రభుత్వ ఆస్తులేమీ ఉండవు.
- ✔ ఈ చట్టం ద్వారా ఏర్పడిన సహకార సంస్థలు విజయవంతంగా నడుస్తున్న తరుణంలో, రాష్ట్రంలో 2004లో వచ్చిన వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వ హయాంలో మ్యాక్స్ చట్టాన్ని రాత్రికి రాత్రి నిర్వీర్యం చేసి సహకార సంఘాల్ని ఆర్థికంగా దెబ్బతీసే ప్రయత్నాలు జరిగాయి. సహకార సంఘాల స్వయంప్రత్తి కోసం కృషి చేసిన ఇతర పెద్దలతో కలిసి ఆ ప్రయత్నాల్ని లోక్‌సత్తా గట్టిగా అడ్డుకుంది. హైకోర్టు, సుప్రీంకోర్టులలో పోరాడి ఆపింది. 2009 ఆగస్టు 28న సహకార స్ఫూర్తికి, రాజ్యాంగమిచ్చిన హక్కులకు తూట్లు పొడిచేరీతిలో రిజిస్ట్రేషన్ ఆఫ్ సొసైటీస్ చట్టాన్ని సవరించేందుకు అసెంబ్లీలో వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రభుత్వం ప్రయత్నించినప్పుడు నేను లోక్‌సత్తా పార్టీకున్న ఏకైక శాసనసభ్యుడినే అయినప్పటికీ రాజ్యాంగమే ఆయుధంగా ఒక మెజారిటీలా పోరాడాను. ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి సొంత జిల్లా కడపలో, మాజీ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు సొంత జిల్లా చిత్తూరులో, సహకార మంత్రి సొంత జిల్లా గోదావరిలో ప్రభుత్వ డెయిరీలు మూతపడగా, మ్యాక్స్ చట్టం కింద ఉన్న డెయిరీలు లాభాల బాటలో ప్రయాణిస్తూ రైతులకు ఆదాయాన్నిస్తున్న తీరును గణాంకాలతో సహా వివరిస్తూ రాష్ట్రవ్యాప్తంగా కొన్ని వందల సమావేశాలలో






పాల్గొని ప్రజలకు తెలియచెప్పాను. యూపీయే ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ కూడా మాకు అండగా నిలిచారు.

- మనదేశంలో పౌరులు కలిసి సంస్థలు ఏర్పరుచుకోవటానికి వీలుగా 1860లో తెల్లవారి పాలనలో ఈ సొసైటీల చట్టం ఏర్పడింది. ఆరోజు రాజ్యాంగం లేకపోయినా మనకు కొంత స్వేచ్ఛని కల్పించేలా బ్రిటీషువారు ఈ చట్టాన్ని ఏర్పాటు చేశారు. ఆ చట్టంకిందే 1885లో భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పాటైంది. తర్వాత స్వాతంత్ర్యోద్యమం చురుకుగా జరుగు తున్నకాలంలో కూడా రాజకీయ అవగాహన పెంచటానికి సొసైటీలను నమోదుచేసుకునే హక్కును కూడా వలస పాలకులు కల్పించారు. బేషరతుగానే పౌరులకు హక్కుల్ని ఇచ్చారు. ఆ తర్వాత హైదరాబాద్ సంస్థానంలో నిజాం పాలనలో 1940లో కూడా అదే చట్టాన్ని స్వల్ప సాంకేతిక మార్పులతో (1350వ ఫసలీ) యథాతథంగా అమలుచేశారు. 1950లో అమలులోకొచ్చిన భారతరాజ్యాంగం ఇలాంటి సంస్థలు ఏర్పాటుచేసుకునే స్వేచ్ఛను ప్రాథమికహక్కుగా గుర్తించి 19(1) అధికరణంలో హామీనిచ్చింది. దీనివల్ల మన రాష్ట్రంలో లక్షల సంస్థలు రూపుదిద్దుకున్నాయి. వీటి కృషి వల్ల కోట్లమంది స్వేచ్ఛ విస్తరించే అవకాశం లభించింది. తమకి రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛతో, ప్రభుత్వ ప్రమేయం లేకుండా ఉమ్మడి లక్ష్యాల కోసం సంఘటితమయ్యేందుకు ప్రజలకు కొంత వెసులుబాటు దొరికింది.
- భారత రాజ్యాంగానికి 19(1) అధికరణం గుండెకాయ లాంటిది. వాక్‌స్వాతంత్ర్యం సహా అన్నిరకాల పౌరస్వేచ్ఛలకూ ఆ ఆర్టికల్ పూర్తి భరోసా ఇస్తున్నది. అందులోని 19(1)(ఎ) వాక్‌స్వాతంత్ర్యానికి, పత్రికాస్వాతంత్ర్యానికి, 19(1)(బి) శాంతియుతంగా సమావేశమవటానికి, 19(1)(సి) సంఘాలుగా, యూనియన్లుగా ఏర్పడటానికి, 19(1)(డి) ఎక్కడికైనా ప్రయాణం చేయటానికి, 19(1)(ఇ) దేశంలో ఎక్కడైనా నివాసం ఏర్పరుచుకోవటానికి, 19(1)(జి) ఎక్కడైనా వ్యాపార, ఉపాధి కార్యకలాపాలు నిర్వహించుకోవటానికి హామీనిస్తున్నాయి. ఈ ఆరు అధికరణాల కింద స్వేచ్ఛకు ఇస్తున్న హామీల్ని చట్టపరంగా ఎంతవరకూ నియంత్రించవచ్చన్న స్పష్టతనిస్తూ, రాజ్యాంగం మరో ఐదు అధికరణాల్లో వివరణనిచ్చింది. 19(2) ఆర్టికల్ కింద వాక్‌స్వాతంత్ర్యాన్ని, 19(3)కింద సమావేశాలు నిర్వహించుకునే హక్కును, 19(4)కింద అసోసియేషన్లు ఏర్పాటు చేసుకునే హక్కును, 19(5)కింద ఎక్కడికైనా ప్రయాణం చేసే హక్కును, ఎక్కడైనా నివశించే హక్కును, 19(6) కింద వ్యాపార కార్యకలాపాల నిర్వహణహక్కును ఏమేరకు పరిమితం చేయవచ్చో వివరిస్తుంది. ఈ విధంగా 19(4) అధికరణం ప్రకారం సొసైటీల రిజిస్ట్రేషన్ నియంత్రణ ప్రాథమికహక్కులకి భంగం. కేవలం దేశ సార్వభౌమాధికారం, సమైక్యత, శాంతిభద్రతలు, నైతికత (ఇందులో మహిళల అక్రమరవాణా, అశ్లీలత వంటి అంశాలు ఉంటాయి) అనే మూడు కారణాలతో మాత్రమే సొసైటీల రిజిస్ట్రేషన్‌ను నియంత్రించవచ్చు. అలాంటి నియంత్రణ కూడా హేతుబద్ధమైన మేరకు మాత్రమే చేయవచ్చని రాజ్యాంగంలో 19(4) అధికరణం స్పష్టంచేస్తుంది. ఈ మొత్తాన్నీ పరిశీలిస్తే... రాజ్యాంగంలో 13(2) అధికరణం ప్రకారం మనదేశంలో పార్లమెంటుతోసహా ఏ చట్టసభకీ ప్రాథమిక హక్కుల్ని పరిమితం చేస్తూ చట్టం చేసే అధికారం లేనే లేదు. ఇలాంటి చట్టం చేసే అధికారం రాజ్యాంగం అధికరణం 13 (2)కింద అసెంబ్లీకి ఎంతమాత్రం లేదని సొసైటీల ఆవిర్భావం, తదనంతర సంబంధిత చట్టాల తీరును చూసినా అర్థమవుతుంది. అది పూర్తిగా ప్రాథమికహక్కుల ఉల్లంఘనే. ఈ విషయాన్ని విపులంగా వివరిస్తే, సంఘాలకి, యూనియన్లకి సంబంధించిన 19(4) అధికరణాన్ని పక్కనబెట్టి, దేశంలో ఎక్కడికైనా ప్రయాణం చేసే హక్కును, ఎక్కడైనా నివసించే హక్కును నియంత్రించే అధికారాన్నిచ్చే 19(5) అధికరణం ప్రకారం సొసైటీలను నియంత్రించవచ్చని వాదించటం విడ్డూరం! రాజ్యాంగాన్ని రక్షిస్తామని ప్రమాణం చేసిన మంత్రివర్గం ప్రాథమికహక్కులను ఇంత అలవోకగా ఉల్లంఘించే దుస్సాహసానికి పాల్పడటం ప్రజల విజ్ఞతను చులకన చేయటమే.
- ఈ చట్టంలో ఏపీ ప్రభుత్వం చెప్పిన సవరణలు (2009) అమలైతే, రిజిస్ట్రార్ ఎప్పుడు తల్చుకుంటే అప్పుడు సొసైటీని రద్దుచేసి అక్కడ ఇంఛార్జి అధికారిని నియమించవచ్చు. ఈ తరహాలో ప్రభుత్వం వెళ్తే... బార్ అసోసియేషన్లు, విద్యార్థి సంఘాలు, మహిళామండళ్లు, యువజన సంఘాలు, విద్యాసంస్థలు, మెడికల్ అసోసియేషన్లు, వేలాది స్వచ్ఛంద సంస్థలు తదితర అన్నిరకాల అసోసియేషన్లు, గ్రామాభివృద్ధి సంఘాలు, క్రీడాసంఘాలు, మూవీ ఆర్టిస్టుల సంఘం, వృత్తిపరమైన సంఘాలు, పాత విద్యార్థుల సంఘం వంటివాటిని కూడా రద్దుచేయవచ్చు. ఆంధ్ర లయోలా, సిద్ధార్థ వంటి విద్యాసంస్థల్ని, వైద్యసంస్థల్ని, చివరకు అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కళాశాలను కూడా స్వాధీనం చేసుకోవచ్చు. అంటే, పౌరులు స్వచ్ఛందంగా కలిసి ఏర్పాటుచేసుకునే ప్రతిసంస్థలోనూ ప్రభుత్వం జోక్యం చేసుకుని పెత్తనం చేయవచ్చు! ఇదే సూత్రాన్ని ట్రేడ్ యూనియన్లకి, దానం చేసే ట్రస్టుకి కూడా వర్తింపచేస్తే (అవి కూడా రాజ్యాంగంలో 19(1)(సి), 19(4) అధికరణాల వల్ల ఏర్పడేవే) బ్లడ్ బ్యాంకులు, నేత్రసంస్థలు, అన్నిరకాల ట్రేడ్‌యూనియన్లు–

## ప్రధాని చేపట్టాల్సిన 11 కీలకాంశాలు -2015లో మోదీకి జేపీ పంపిన నోట్-

బీహార్ అసెంబ్లీ ఓటమిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక అవకాశంగా మలచుకోవాలి. తన శక్తిసామర్థ్యాల్ని రాష్ట్రాల్లో ఎన్నికల కోసం వినియోగించే ధోరణికి స్వస్తి చెప్పి 2014 ఎన్నికలలో తాను ఇచ్చిన హామీలు, చూపిన లక్ష్యాల మీద ఇకనైనా ఆయన దృష్టి పెట్టాలి. ఇప్పటికే విలువైన సమయం వృధా అయింది. ఉన్న సమయాన్నయినా సద్వినియోగం చేసుకునేందుకు మోదీ జాతి సేవకునిగా, నిజమైన నాయకుడిలా వినమ్రంగా ముందుకు రావాలి అని పేర్కొంటూ.. తక్షణం చేపట్టాల్సిన 11 జాతీయ స్థాయి ప్రాధాన్యతాంశాలను ప్రధానికి ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ 2015లో నోట్ రూపంలో పంపారు. అవి:

1. పాఠశాల విద్య సంస్కరణలు
2. స్థానిక ప్రభుత్వాలకు నేరుగా తలసరి నిధుల కేటాయింపు. ఉదాహరణకు ఏటా రూ.1000-2000 వార్డు స్థాయికి
3. పరిశ్రమలను ప్రోత్సహించి పెద్ద ఎత్తున ఉద్యోగాలను అందించటం
   ఎ. భూ సేకరణ చట్టాన్ని సరళతరం చేయటం
   బి. కార్మిక చట్టాలలో సంస్కరణలు
4. జాతీయ వనరులపై అప్పనంగా లాభాలు ఆర్జించేవారిపై పన్ను (విండ్‌ఫాల్ ప్రాఫిట్స్ ట్యాక్స్) విధించటం
5. వ్యవసాయాన్ని పరిరక్షించటం
   ఎ. ప్రజాపంపిణీ వ్యవస్థ స్థానంలో అవినీతికి ఆస్కారంలేని ప్రభావశీలమైన ఆహార భద్రత
   బి. పప్పుదినుసులు, వంటనూనె గింజలపై దిగుమతి సుంకాలు
   సి. వ్యవసాయ వ్యర్థాలను పరిష్కరించటం, అదనపు విలువ చేకూర్చటం
   డి. వ్యవసాయంలో ఇతర సంస్కరణలు
6. సహకార సంఘాలకు స్వయంప్రతిపత్తి
7. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, వేధింపులు లేకుండా నిర్ణీత గడువులోగా ప్రజలకు హక్కుగా సేవలందించే, గడువు దాటితే పరిహారం చెల్లించే సర్వీస్ గ్యారంటీలు
8. న్యాయ సంస్కరణలు
   ఎ. ఉన్నత స్థాయి న్యాయ నియామకాల కమిషన్
   బి. అఖిల భారత జ్యుడీషియల్ సర్వీసు (ఎఐజేఎస్) ఏర్పాటు
   సి. స్థానిక కోర్టుల ఏర్పాటు, మహిళల రక్షణ
9. సివిల్ సర్వీసు సంస్కరణలు
10. చట్టసభలలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు ప్రత్యామ్నాయ బిల్లు
11. పోటాపోటీ అసంబద్ధ జనాకర్షక పథకాలు, ఉచితాలను కట్టడి చేయటం, ప్రజాప్రాతినిధ్య చట్ట సవరణ

ప్రజల సాధికారతను పెంచే ఈ సంస్కరణలను రూపొందించటంలో, అమలులో ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా తమ పూర్తి సహకారాన్ని అందిస్తాయని జేపీ ఈ సందర్భంగా తెలిపారు.

వీటన్నింటినీ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవచ్చు! ఇంతకంటే హాస్యాస్పదమైన చట్టం, ఇంతకంటే మన స్వేచ్ఛని హరించే చట్టం మరొకటుంటుందా?

✔ అయితే ఒక స్వచ్ఛందసంస్థగాని, మరో సంఘంగాని, ఓ ట్రేడ్‌యూనియన్‌గాని సమాజానికి హాని చేస్తే ప్రభుత్వం మౌనంగా చూస్తూ కూర్చోవాలా? లేదు. రాజ్యాంగంలోని 19(4) అధికరణం ప్రకారం దేశసార్వభౌమత్వాన్ని, ఐక్యతని దెబ్బతీసే సంస్థల్ని నిషేధించవచ్చు. ఆ విధంగానే ఉగ్రవాద సంస్థల్ని నిషేధిస్తున్నారు. శాంతిభద్రతలకి ముప్పుతెచ్చి, హింసనే మార్గంగా ఎంచుకున్న సంస్థలని నియంత్రించవచ్చు. ఆ విధంగానే కొన్ని పార్టీలను అదుపు చేస్తున్నారు. నైతికతను దెబ్బతీసే సంస్థలని (మహిళల్ని అమ్మ టం, చిన్నపిల్లలని లైంగికంగా ఉపయోగించటాన్ని ప్రోత్సహిం చటం లాంటి కార్యకలాపాలకు పాల్పడే సంస్థలు) నిషేధిస్తు న్నారు. అంతేకాదు, ఏ నేరానికైనా ఓ సంస్థ పాల్పడితే నేర న్యాయ చట్టాల ప్రకారం వారిని శిక్షించవచ్చు. అంతేకాని, ఆ వంకతో మనందరి ప్రాథమికహక్కులని కాలరాచే ప్రయత్నం చేయటం అవివేకం, అప్రజాస్వామికం, ప్రమాదకరం.

✔ రాజ్యాంగాన్ని చిన్నచూపు చూడటం క్షంతవ్యం కాని తప్పు. భేషజాల కన్నా రాజ్యాంగం మిన్న అని గుర్తించేలా పాలకుల కళ్లు తెరిపించటం అవసరం. ప్రభుత్వాలు అసలు తాము చేయాల్సిన పనులని- విద్య, ఆరోగ్యం, శాంతిభద్రతలు, న్యాయం, మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన వగైరా- విస్మరించి, తమకి అధికారంలేని పనులలో జోక్యం చేసుకోవటం పరిపాటి అయింది. రాజ్యానికి ఉన్న పరిమితులుగాని, రాజ్యాంగ విలువలుగాని తెలియనివారు రాజకీయంలో ఉండి సమాజాన్ని శాసిస్తే జరిగే కీడుకి ఇదో దృష్టాంతం. రాజ్యాంగం లేకపోతే తమ అధికారాలు, పదవులు ఉండవని, వాటి అంతిమలక్ష్యం ప్రజలకు సేవచేయటంతప్ప ప్రజాప్రయోజనాలను హరించటం కాదనే వాస్తవాన్ని వారికి బోధపరచాలి. ఇందుకోసం మీడియా, పౌరసమాజం కలసిరావాలి. ప్రజల్లో చైతన్యం పెంచి ప్రభుత్వం మీద ఒత్తిడితెచ్చి రాజ్యాంగం సర్వోన్నతం, దాని పరిధిలోనే చట్టం అనే అవగాహనను, స్పృహను కలిగించాలి.

✔ కాంగ్రెస్ పార్టీ జాతీయస్థాయిలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, ఆ పార్టీ అధికారంలో ఉన్న సుమారు 8 రాష్ట్రాలలో కూడా మ్యాక్స్ తరహా చట్టాన్ని తీసుకొచ్చింది. జాతీయస్థాయిలో అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా అలాంటి చట్టాన్ని అమలుచేస్తామని ఆ పార్టీ తన ఎన్నికల ప్రణాళికలో సైతం పేర్కొంది. 2004లో యూపీయే అధికారంలోకి వచ్చాక, నేను జాతీయ సలహా మండలిలో పనిచేసే అవకాశాన్ని వినియోగించుకుని జాతీయస్థాయిలో సహకార సంస్థల స్వయంప్రతిపత్తి కోసం 97వ రాజ్యాంగ సవరణను ప్రతిపాదించాను. 2012లో ఇది సాకారమైంది.

✔ 2016లో చంద్రబాబు, వైఎస్సార్‌ల బాటలోనే తెలంగాణ ప్రభుత్వం జీవో 28ని జారీ చేసినా 97వ రాజ్యాంగ సవరణ ద్వారా లోక్‌సత్తా చేసిన ప్రయత్నంతో జీవోను పక్కనపెట్టింది.

✔ పౌరులు సంఘాలుగా, ట్రేడ్‌యూనియన్లుగా ఏర్పడే అవకాశాన్ని కల్పిస్తూ రాజ్యాంగం 19 (1-సి) అధికరణంలో కల్పించిన హక్కును విస్తరిస్తూ సహకార సంఘవ్యవస్థగా కూడా ఏర్పడే అవకాశాన్ని చేరుస్తూ 97వ రాజ్యాంగ సవరణ తేవాలన్న నా సూచనకు ఆమోదం తెలుపుతూనే, కొంత మూర్ఖత్వం, కొంత సాంప్రదాయ రాజకీయ ధోరణి, కొంత అవగాహనారాహిత్యంతో ఒక అధ్యాయాన్ని (9బి) ఆ సవరణలో భాగంగా చేర్చారు. దాంతో 73, 74వ రాజ్యాంగ సవరణలలోలాగా కొంత గందరగోళం, అనవసర పొడిగింపులు, అవాంఛనీయ పదాలు ఈ సవరణలో వచ్చి చేరాయి. ఉదాహరణకు, కేంద్రం (కేంద్ర ప్రభుత్వం) అనే పదాన్ని వాడారు. అలాంటి పదమే రాజ్యాంగంలో ఉండదు. యూనియన్ గవర్నమెంట్ అనే ఉంటుంది. అలాగే చట్టం పరిధిలో రాజ్యాంగం ఉంటుందనే భావనను కల్పించే వాక్యాలు రాశారు. 9బి అధ్యాయం అనవసరం. దీనివల్ల 19(1)(సి)లో సహకార సంఘాల ఏర్పాటుకు గ్యారంటీ ఇచ్చిన హక్కుకు అవరోధాల్ని కల్పించింది, రాష్ట్రాల హక్కులు ఉల్లంఘనకు గురయ్యాయి. గుజరాత్ హైకోర్టులో దీనిపై న్యాయవివాదం మొదలైంది. 2013లో గుజరాత్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీలుతో వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. 2021 జులైలో 9బి ని సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఇది ఆహ్వానించదగ్గ తీర్పు. మొత్తంగా, ప్రజలు స్థానిక ప్రభుత్వాలు, రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా తమ సొంతంగా సహకార సంఘాలను ఏర్పాటు చేసుకునే హక్కు మాత్రం 97వ సవరణ ద్వారా సమకూరింది. రాజ్యాంగం కల్పించిన ఓ కీలకహక్కు ప్రజలకు అందివచ్చింది.

✔ ఇప్పుడు మనం మ్యాక్స్ చట్టాన్ని కాపాడుకోవటంతోపాటు దాన్ని పరిపుష్టం చేసేందుకు కూడా కొన్ని చర్యలు తీసుకోవాలి. 1964 చట్టాన్నయితే పూర్తిగా మార్చాలి. రాష్ట్రంలోని మ్యాక్స్ చట్టంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి, రిజర్వేషన్లకు సంబంధించి రెండు సవరణల్ని చేరిస్తే చాలు.

✔ ఎన్నికలను ఒకేసారి జరిపి, రాజకీయ వేడి వాతావరణాన్ని సృష్టించకుండా రాజ్యసభ తరహాలో 1/3 వంతు మందిని ఎన్నుకునేలా చేయాలని నేను చేసిన సూచన.. రాజ్యాంగ సవరణ పేరాను కలిపిన మూర్ఖులకు అర్థంకాక కేవలం ఎన్నికలను విధిగా 5ఏళ్లకోసారి నిర్వహించాలన్న పదం కలిపారు. అయితే, ఎన్నికలను విధిగా నిర్వహించే ఏర్పాటు వచ్చింది కాబట్టి, ఎవరు నిర్వహించాలో స్పష్టత తెచ్చుకుంటే, మనం ఆశించిన కొన్ని ఫలితాలనైనా సాధించవచ్చు. ఎన్నికల నిర్వహణకు మళ్లీ ఇంకో వ్యవస్థను ఏర్పాటు చేసి ఫోజ్లు, ఫ్యూజ్లు పేరుతో ప్రభుత్వ ఖజానా మీద భారం మోపే కంటే, రాష్ట్ర ఎన్నికల సంస్థ ఒకటుంది కాబట్టి, ఆ రాజ్యాంగ సంస్థకు స్థానిక ఎన్నికలు నిర్వహించటం మినహా వేరే ఏమీ కార్యక్రమాలు లేవు కాబట్టి ఆ సంస్థను వినియోగించుకోవచ్చు. ఈ దిశగా సవరణను మ్యాక్స్ చట్టంలో చేర్చాలి.

✔ రెండోది, సామాజిక పరిస్థితుల దృష్ట్యా ప్రజాస్వామీకరణలో భాగంగా మహిళలు, దళితులకు తగు ప్రాధాన్యతను రాజ్యాంగ సవరణలో పేర్కొన్న రీతిలో కల్పించాలి. దీని మీద అభ్యంతరాలు చెప్పాల్సిన అవసరమేమీ లేదు.

✔ సహకార సంఘాలలో సభ్యత్వ నమోదు గురించి రాజ్యాంగ సవరణలో లేదు. ఎవరిని పడితే వారిని సభ్యులుగా చేర్చుకుంటే, బోగస్ సభ్యత్వాలు ఎక్కువై రాజకీయ, పెత్తందారీ శక్తులు వాటిని కబ్జా చేసే అవకాశముంది. కాబట్టి కులం, మతం వంటి విభజనలేవీ చేయనంతకాలం, డిపాజిట్ పెట్టటం (ఉదాహరణకు రూ.5,000), ఏదోక క్షేత్రస్థాయి కార్యక్రమంలో కనీసం ఏడాదిపాటు పాలుపంచుకున్నవారికే సంబంధిత సహకార సంస్థలో సభ్యులుగా చేరే అవకాశం కల్పించటం వంటి నిబంధనల్ని చేర్చాలి. పాలు, చెరకు ఇలా ఏదోక రంగంలో తగిన సేవలు అందించినవారికే వ్యవసాయ సహకార సంఘంలో సభ్యులయ్యే అవకాశం ఉండాలి. అలాగే సభ్యత్వ నమోదు జరిగాక ఓటుహక్కు ఇవ్వటానికి కనీసం ఏడాది పరిమితి ఉండేలా చూడాలి.

✔ సహకార బ్యాంకింగ్ రంగ ఆడిటింగ్‌కు సంబంధించి.. సూచించిన ప్యానల్ చార్టర్డ్ అకౌంటెంట్లతో నిర్వహించుకునేలా తగిన ఏర్పాట్లు చేసుకోవచ్చు.

✔ అర్బన్ బ్యాంకుల విషయానికొస్తే, మొత్తం వ్యవహారాల పర్యవేక్షణ బాధ్యతను రిజర్వుబ్యాంకు పరిధిలోకి తీసుకెళ్లటం మేలని నా అభిప్రాయం. ఎందుకంటే, సభ్యత్వ నమోదు, పాలన, ఎన్నికల నిర్వహణ ఇలాంటివన్నీ వేర్వేరు పర్యవేక్షణల కింద ఉన్నప్పుడు సమన్వయానికి ఒక సమర్థ వ్యవస్థ అవసరం.

✔ అయితే అంతిమంగా మనం గుర్తించుకోవాల్సి విషయం ఏమంటే, చట్టం, రాజ్యాంగంలో ఏర్పాటు కేవలం ఒక పార్శ్వం మాత్రమే. పరపతి సహకార సంస్థలు ప్రధానంగా దెబ్బతింటున్నది అంతర్గత నిర్వహణలో డొల్లతనం, పెత్తందారీ ధోరణి, తొందరపాటుతనం, పేరాశల వల్లే. వీటి వల్లే అవి నష్టాలలో కూరుకుపోతూ డిపాజిటర్ల ప్రయోజనాల్ని దెబ్బతీస్తున్నాయి. ఎవరెన్ని చెప్పినా, డిపాజిటర్ ప్రయోజనాలని పరిరక్షిస్తేనే సంస్థలు మనుగడ సాగిస్తాయి. డిపాజిటర్ల ప్రయోజనాల పరిరక్షణ సాకుతోనే ప్రభుత్వాలు సంస్థలలో జోక్యం చేసుకుని పెత్తనం మొదలుపెడతాయి. కాబట్టి ఈ విషయంలో సహకార సంఘాలు అప్రమత్తమై తమ పనితీరును సమర్థవంతం చేసుకోగలగాలి.

✔ సహకార వ్యవస్థకి, ప్రజాస్వామ్యానికి, జనహితానికి మధ్య సంబంధం అర్థమైన నాయకత్వం అందిన ప్రతి చోటా ఈ సంఘాలు అద్భుత ఫలితాల్ని సాధించాయి. ముఖ్యంగా సంక్షోభంలో ఉన్న వ్యవసాయానికి ఇవి పెద్ద అండనందించాయి.

✔ ప్రభుత్వాలు తాత్కాలిక తాయిలాల ధోరణిని వీడి సహకార వ్యవస్థల బలోపేతం వంటి సంస్కరణలతో ఆర్థిక, సామాజిక అభివృద్ధిని సాధించాలి.

✔ 97వ రాజ్యాంగ సవరణలోని వివరాలు సహా ఈ అంశాలన్నిటినీ అవగాహన చేసుకుంటేనే, మనం సంఖ్యాబలం లేకపోయినా రాజ్యాంగం ఇచ్చిన బలాన్ని ఆసరాగా చేసుకుని సహకార సంస్థల్ని కబ్జా చేసేందుకు ప్రభుత్వాలు వేసే వెర్రిమొర్రి వేషాలను ఆపగలం.

# కనీసం 'సమాజానికి ఉపయోగపడేవారి'పై బురద జల్లకూడదనే రూల్ పాటిద్దాం!

**అన్నపూర్ణ. ఎ, కేలిఫోర్నియా**

భారతదేశ 75వ స్వాతంత్ర్య దినోత్సవ, లోక్‌సత్తా 25వ ఆవిర్భావ దినోత్సవ వేళ చర్చించుకోవాల్సిన ఓ ముఖ్యమైన అంశం బహిరంగ చర్చా ప్రమాణాలు. సామాజిక, రాజకీయ రంగాలలో బహిరంగ చర్చ ప్రమాణాలను ప్రతిష్ఠించటం లోక్‌సత్తా నూతన రాజకీయ సంస్కృతిలో ఓ భాగం. లోక్‌సత్తా కృషి వల్ల కొన్ని మౌలిక మార్పులు, కొన్ని రంగాల్లో కీలక మార్పులు వచ్చాయి, ఓ అజరామర భావజాలం విత్తనాలుగా వెదజల్లబడిందిగానీ.. కొన్ని రంగాల్లో మాత్రం పరిస్థితి పాతికేళ్ళ క్రితం కంటే క్షీణించింది. అందులో ఒకటి బహిరంగ చర్చా ప్రమాణాలు. అవి గతం కంటే ఇంకా దిగజారాయి. పౌరులకు గళానిచ్చి, వారి స్వేచ్ఛ, ప్రయోజనాల పరిరక్షణలో కీలకంగా ఉన్న సామాజిక మాధ్యమాల్లోనయితే ఈ దిగజారుడు మరీ దిగ్భ్రాంతికరంగా ఉంది. ఈ ధోరణులు సమాజంలో అపోహల్ని, అనుమానాల్ని, విద్వేషాన్ని, హింసని ప్రేరేపిస్తుండటంతోపాటు.. సమాజానికి ఉపయోగపడేవారి విలువైన భావాల్ని కూడా పెదవి దాటి రాకుండా అణచివేస్తున్నాయి. తద్వారా సమాజానికి పెద్ద హాని చేస్తున్నాయి. ఈ కీలక మలుపులోనైనా సామాజిక మాధ్యమాల్లో బహిరంగ చర్చా ప్రమాణాలపై మనం నిర్మొహమాటంగా చర్చించుకోవాలి.

నిజానికి ఈ అంశంపై ఎప్పటి నుంచో చెప్పాలనుకుంటున్నాను. ఒక రచయిత్రిగా, సమాజహిత కార్యక్రమాల్లోనూ పాల్గొనే వ్యక్తిగా సోషల్ మీడియాను కొంత ఎక్కువ ఆసక్తితోనే గమనిస్తూంటాను. అలా యూట్యూబ్ వీడియోలు, టీవీ చర్చలు, ప్రసంగాలూ ఫాలో అవుతుంటాను. లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ్ మాటల్ని మాత్రం క్రమం తప్పకుండా వింటుంటాను.

లోక్‌సత్తాపై, జేపీపై తప్పుడు వీడియోలు, అర్థంపర్థం లేని విమర్శలను చూస్తుంటే మాత్రం బాధ, ఆవేశం కలుగుతుంటుంది. హేతుబద్ధ వాస్తవాలు లేని చౌకబారు విమర్శలకు స్పందించనక్కర్లేదు అనే ఉద్దేశంతో చాలారోజుల పాటు పెద్దగా పట్టించుకోలేదు. కానీ 2019లో జేపీపై కొన్ని నిరాధార నిందల వీడియోలను కొన్ని ప్రధాన పార్టీల వెబ్‌సైట్‌లలోను, చివరకు మార్పు కోసం వచ్చామని చెప్పుకునే ఓ రాజకీయ పార్టీ సైట్‌లోకూడా పెట్టారు. ఇతరులపై అలాంటి పోస్టింగులను, అందులోనూ ఏమాత్రం హేతుబద్ధత, తర్కంలేని ఆరోపణలను లోక్‌సత్తా వెబ్‌సైట్‌లో పెట్టటాన్ని ఊహించను కూడా లేము. లోక్‌సత్తాలో అలాంటివి పోస్ట్ చేయటాన్ని జేపీ




ఏనాడూ సహించరు. అలాంటి వాటిపై స్పందించటం కూడా అనవసరమని నాబోటి వాళ్లం యధావిధిగా సంశయించాం. కానీ కొత్తగా వచ్చే యువత, రోజువారీ జీవితంలో బిజీగా ఉంటూ ఎప్పుడో రాత్రి పూటో, ప్రయాణంలోనో సోషల్ మీడియాను చెక్ చేసుకునేవాళ్లు కొంత గందరగోళపడే అవకాశముందనిపించింది. దాంతోపాటు, జేపీపై పోస్టింగులు పెట్టిన వారిలో కూడా అత్యధికులు దుర్మార్గులు కాదు. డబ్బు, పదవులు వంటి తక్షణ ఆకర్షణీయ ప్రోత్సాహకాలు లేకుండా లోక్‌సత్తా భావజాలం కోసం పనిచేస్తే మన దేశంలాంటి చోట కలిగే తాత్కాలిక నిరాశానిస్పృహలను అధిగమించలేని వారు చేసే విమర్శలే ఇందులో ఎక్కువగా ఉన్నాయి. వ్యాపారంలో లాభాలార్జించినంత తేలిక కాదు గదా, ఒక దేశంలో, అందునా ఇండియా వంటి దేశంలో మార్పు తేవటం! కొన్నేమో ఇతర రాజకీయ శక్తుల నుంచి వచ్చే ప్రలోభాలకు లొంగినవారు చేస్తున్న విమర్శలున్నాయి. ఇటీవల ఎన్నికల రాజకీయ ప్రచారంలో కన్సల్టెన్సీలు, సోషల్ మీడియా పాత్ర పెరగటంతో వీరి సంఖ్య కూడా పెరుగుతోంది. వీరి అవకాశవాదాన్ని మనం సహించనక్కర్లేదుగానీ.. వీరు కూడా తమ తాత్కాలిక దృష్టిని అధిగమించేలా చేయటానికి అప్పుడప్పుడూ అయినా వాస్తవాలు చెబుతుండాలనిపించింది. అందుకే 2019లో ఎన్నికల తర్వాత ప్రజల్లోకి ఒక బహిరంగ లేఖను రాశాను. కానీ దాన్ని ఇప్పటికీ విడుదల చేయలేదు. నా లేఖ ఆశించిన ప్రభావాన్ని చూపుతుందా? మిత్రులు సరిగా రిసీవ్ చేసుకుంటారా? చదివే కొంతమంది ప్రజల్లోనైనా ఆలోచనను పెంచుతుందా? అన్న సందేహాలతో ఆ సమయంలో వెనకడుగు వేశాను.

ఆ తర్వాత ఇటీవల కొన్ని టీవీ ఛానళ్ల లైవ్ షోలలో మంచీచెడు విచక్షణ లేకుండా కొందరు గౌరవనీయులైన వక్తలపై వస్తున్న అసభ్య, అనుచిత కామెంట్లను కూడా చూడాల్సి వస్తోంది. ఒక రోజు కాదు, ఒక ఛానల్ కాదు.. ఇదో ఒరవడిలా

మారిపోయింది. ఇందులో లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ్‌పై కూడా కామెంట్లు ఉంటున్నాయి.

పింఛను (ఇప్పుడు రిటైర్డ్ ఐఏఎస్‌లకు నెలకు రూ. 1,50,000 దాకా పెన్షన్ వస్తోందని సమాచారం), సొంత ఇంటి స్థలం (ప్రభుత్వాన్ని ఉపయోగించుకుని ఐదో అంతస్తులో స్విమ్మింగ్‌పూల్ కట్టుకున్న ఐఏఎస్‌లు ఉన్నారు) కూడా తీసుకోకుండా ఐఏఎస్‌ఉద్యోగానికి రాజీనామా చేసి తన అసమాన మేధస్సును, యవ్వన కాలాన్ని, వ్యక్తిగత సమయాన్ని, అధికార పటాటోపాన్ని, ప్రైవేటు రంగంలోకి వచ్చి కోట్లాది రూపాయలు సంపాదించే అవకాశాల్ని అన్నిటినీ జనజీవితంలో అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే మౌలిక మార్పు కోసం అంకితం చేసి తెలుగు గడ్డ నుంచి దేశవ్యాప్త కొత్త రాజకీయ ఉద్యమానికి శ్రీకారం చుట్టి, అందుకోసం దశాబ్దాలుగా కృషి చేస్తూ మాలాంటి వారికి, ఈతరం యువతకు స్ఫూర్తిగా, మార్గదర్శిగా దిశానిర్దేశం చేస్తున్న జేపీ గారి గురించి అలాంటి కామెంట్లు మీడియాలో ఉన్నవారికి, మరికొందరికి మామూలే అనిపించవచ్చుగానీ.. నాలాంటి వారికి మాత్రం బాధాకరంగా అనిపిస్తోంది.

వీటన్నిటికీ తోడు, కరోనా సంక్షోభం తర్వాత ప్రజల్లో పెరిగిన చైతన్యాన్ని కూడా పక్కదోవ పట్టించే తీరు, సమాజం కోసం మాట్లాడటానికి మీరెవరు అనే రకం మూర్ఖత్వాన్ని చూశాక, 2019 లేఖలోని అంశాలను పంచుకోవటం అవసరమనిపించింది. డెబ్భయి అయిదవ స్వాతంత్ర్య దినోత్సవం, లోక్‌సత్తా 25వ ఆవిర్భావ దినోత్సవం కూడా సరైన సందర్భం అనిపించింది. లేఖాంశాల్లో కొన్ని అప్పటి సంగతుల్లా, ఎన్నికల సీజన్ విషయాల్లా అనిపించొచ్చుకానీ, ముమ్మందు కూడా రాజకీయాస్త్రాలుగా ఉపయోగించే నకిలీ, తప్పుడు వార్తలు, ఆరోపణలు అవి. అందుకే వాటి మీద స్పష్టతను ప్రజల ముందుంచటం అవసరం. వివిధ రంగాల్లోని ఫేక్‌న్యూస్ ఒకరంగా సమాజాన్ని కుంగదీస్తుంటే, జనహితం కోసం పనిచేసే జేపీలాంటి వారిపై ఫేక్‌ఆరోపణలు సమాజానికి మరోరకంగా తీవ్ర నష్టానికి గురిచేస్తున్నాయి.

**ఈ ప్రశ్నకు సమాధానంతో మొదలవ్వాలి**

ఒక వ్యక్తికి సమాజం ప్రాముఖ్యతనిచ్చేందుకు కొలమానం ఏమిటి?.. ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకోవటమే ఈ సమస్యకు పరిష్కారాన్ని మన ముందుంచుతుంది.

ఈ ప్రశ్నకు జవాబు తెలిస్తే.. మనకున్న భావప్రకటనా స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్నామో, సద్వినియోగం చేస్తున్నామో తెలిసిపోతుంది.

ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకోవటం వల్ల మనం ఇతరులను చూసే దృష్టే కాకుండా, ఇతరుల పట్ల వ్యవహరించే తీరే కాకుండా.. మన పట్ల, మన ఎదుగుదల పట్ల కూడా మన దృక్పథంలో మార్పు వస్తుంది.

'ఒక వ్యక్తి వల్ల సమాజానికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎంత మేలు జరుగుతుంది లేదా జరిగే అవకాశముంది' అన్నది మాత్రమే.. ఆ వ్యక్తికుండే ప్రాముఖ్యత లేదా గొప్పతనానికి కొలమానం!

ఈ కొలమానాల్ని ఇప్పుడు జేపీపై నిందారోపణల విషయంలో చూద్దాం. ఏ ప్రమాణాల ప్రకారం చూసినా.. జేపీ భావజాలం, ఆయన కృషి వల్ల భారతీయ సమాజానికి అత్యున్నత మేలు జరుగుతుంది. ఆయనలో వ్యక్తిత్వ లోపాలేమన్నా ఉన్నా కూడా వాటిని అధిగమించగల శక్తి, తగిన ప్రమాణాలు ఆయన భావజాలానికి, రాజకీయ సంస్కృతికి ఉంది.

జేపీ భావజాలం, విధానాల ప్రకారం ప్రజాజీవితంలో ఆయనతోపాటు ఎవరూ తప్పుచేసే అవకాశం ఉండదు, ఒకవేళ తప్పు చేసినా ఆ దుష్పరిణామాలు, శిక్షలు వారి వ్యక్తిగతానికే పరిమితమవుతాయి. తనలోని లోపాలను వదిలేసి మంచిని మాత్రమే తీసుకోవాలని జేపీ స్వయంగా అనేక సందర్భాల్లో చెప్పారు. జేపీ లోపాలు వ్యక్తిగతం, ఆయన భావజాలం, విలువలు, ఇతర బలాలు సామాజికం! అంతటి స్వయందిద్దుబాటు గల భావజాలాన్ని ఆయన తెలుగు వారికి, ఈ దేశానికి అందించారు.

జేపీ భావజాలంలో ఏదైనా పొరపాటో, తప్పో ఉంటే కచ్చితంగా లేవనెత్తొచ్చు. కానీ అందుకు హేతుబద్ధ సాక్ష్యాధారాలు చూపించాలి. లోక్‌సత్తా ఆవిర్భవించిన దగ్గర్నుంచి ఇప్పటివరకూ అలా ఎవరూ నిరూపించిన దాఖలాలు లేవు. అందుకే ప్రముఖ పాత్రికేయుడు రాజ్‌దీప్ సర్దేశాయి, స్వరాజ్ ఇండియా పార్టీ వ్యవస్థాపకుడు యోగేంద్ర యాదవ్ వంటి వారు జేపీని 'బహుశా భారతదేశంలోనే అత్యంత విజ్ఞుడైన మేధావి'గా అభివర్ణించారు. జేపీ విధానాల మీద, విధానపరమైన నిర్ణయాల మీద, ఆయన రాజకీయ విజ్ఞత మీద సరైన విమర్శ ఒక్కటంటే ఒక్కటి ఆయన మీద బురద జల్లుతున్న పోస్టుల్లో కన్పించలేదు. కేవలం భావోద్రేకాలు రెచ్చగొట్టి లబ్ధిపొందే ప్రయత్నం మాత్రం వాటిల్లో ఉంది.

ఒక కులంలో, మతంలో, ఒక ప్రాంతంలో పుట్టటమనేది కేవలం యాదృచ్ఛికం. ఆ వ్యక్తి సంకుచిత ధోరణుల్ని బలోపేతం చేయటానికి, ఘనీభవింప చేయటానికి ప్రయత్నిస్తున్నాడా లేక వాటిని ఛేదించి అందరికీ ఎదిగే అవకాశాలున్న సమాజ నిర్మాణానికి ప్రయత్నిస్తున్నాడా అన్న దాన్ని బట్టే ఒక వ్యక్తి కుల, మత, ప్రాంతీయ స్వభావాన్ని అంచనా వేయాలి. జేపీ భావజాలం కుల, మత, ప్రాంతీయాలను ఛేదిస్తుంది అనటానికి బోలెడు సాక్ష్యాలున్నాయి. హేతుబద్ధంగా తప్పు పట్టే అవకాశం ఒక్కటి కూడా కనిపించదు. జేపీ లేదా లోక్‌సత్తా ప్రతిపాదించిన అందరికీ ఉచిత నాణ్యమైన విద్య, ఆరోగ్యంతో మొదలుపెట్టి క్లస్టర్ల గ్రామీణ స్థానిక ప్రభుత్వాల దాకా అన్నీ కుల, మత, ప్రాంతీయ సంకుచితాల నుంచి ప్రజలను వికాసం, స్వావలంబన, సాధికారత వైపు నడిపించేవే. వీటి కోసం కాకుండా మరి వేటి కోసమైనా జేపీ మాట్లాడిన లేక నిలబడిన సందర్భాలున్నాయా? అంతెందుకు, ప్రాంతీయత పేరుతో తెలంగాణ ఉద్యమంలో జేపీ గొంతును వినిపించకుండా నొక్కేయటం వల్ల తెలంగాణ నష్టపోయిందని ఈవేళ అనేకమంది




బాధపడుతున్న మాట వాస్తవం కాదా?

నేను ఒక సాధారణ మహిళను. చిన్నతనం నుంచీ పత్రికలు, మంచి సాహిత్యం చదివే అలవాటు మా తల్లిదండ్రుల నుంచి వచ్చింది. మంచి రాజకీయాలూ, మంచి విషయాలూ తెలుసుకోవాలన్న కుతూహలం ఉంది. మంచి పనులు చేసే అధికారులు కావచ్చు, రాజకీయ నేతలు కావచ్చు, మన తోటివారు కావచ్చు.. వారి పట్ల అత్యంత గౌరవం! అలా నేను పుట్టిన జిల్లా (తూర్పు గోదావరి/కాకినాడ)కి కలెక్టర్‌గా వచ్చిన డా॥ జేపీ గురించి మా నాన్నగారు చెప్పారు. అందులోనూ నా కజిన్ ఒకరు జేపీగారి దగ్గర అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేయడం వలన వారి గురించి మరింతగా తెలుసుకునే అవకాశమూ కలిగింది. ఆనాటి నుంచీ అందరమూ జేపీ గురించి గౌరవభావంతో మాట్లాడుకునేవాళ్లం.

తర్వాత ఎన్‌టీఆర్ ముఖ్యమంత్రి కావటం, జేపీగారిని పర్సనల్ సెక్రటరీగా తీసుకోవడం జరిగాయి. స్వయంకృషితో ఎదిగిన ఒక సమగ్ర ప్రతిభావంతుడు ఎక్కడున్నా ఆ ప్రత్యేకత ప్రతీ అంశంలోనూ కన్పిస్తూనే ఉంటుంది. లేకుంటే ఎవరి మాటా వినని ఎన్టీఆర్ జేపీగారికి సముచిత గౌరవమివ్వడం సాధ్యమయ్యేది కాదు, జేపీని ప్రత్యేకించి పిలిపించుకునేవారూ కాదు. అధికారం మార్గమే తప్ప లక్ష్యం కాదని అధికారిగా, రాజకీయ ఉద్యమ వ్యవస్థాపకునిగా, పౌర సమాజ నేతగా జేపీకి నూరు శాతం స్పష్టత ఉంది. అధికారమే కావాలనుకుంటే ఎన్‌టీఆర్ స్వయంగా పదవిని పళ్లెంలో పెట్టి అందించేవారు.

అప్పట్లో హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని తెలుగుదేశం కార్యాలయానికి వెళ్లటానికి జేపీతో కలిసి కారులో ఎన్‌టీఆర్ ప్రయాణించిన సందర్భాలు అనేకం. రాజ్యసభ సభ్యత్వం ద్వారా కావచ్చు, మరో రూపంలో కావచ్చు.. జేపీ సేవల్ని తెలుగుదేశం పార్టీ వేదికగా ప్రజలకు అందించాలని ఎన్‌టీఆర్ ఉత్సాహపడేవారు. కానీ జేపీ లక్ష్యం మౌలిక మార్పు కావటంతో ఆ పార్టీ కార్యాలయంలోకి అడుగుపెట్టటానికి ఇష్టపడేవారు కాదు. తెలంగాణ ఉద్యమ సమయంలో కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ కూడా లోక్‌సత్తా పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తే రాష్ట్రంలోని అతిపెద్ద పదవి ఆఫర్‌ను జేపీకి ప్రతిపాదించినట్లు వినికిడి. లోక్‌సత్తాలోని ఒక సీనియర్ నాయకుడే మాటల సందర్భంలో ఈ విషయం తెలిపారు. ఆ తర్వాత మరో రెండు ప్రధాన రాజకీయ పార్టీల నుంచి కూడా ఈ రకమైన ఆఫర్‌లు వచ్చినా జేపీ తిరస్కరించటం మాలో చాలామందికి తెలుసు. 'మార్పుకి అవకాశం లేని పదవులు, పార్టీలు నాకనవసరం' అని జేపీ ఇప్పటికీ నిర్ద్వంద్వంగా చెబుతుంటారు.

మళ్లీ ఎన్‌టీఆర్ కాలానికి వద్దాం.

ఎన్‌టీఆర్ హయాం తర్వాత జేపీ కొన్ని బాధ్యతల్ని నిర్వహించినా, భారత్‌లో వ్యవస్థీకృత మార్పులు సాధించేందుకు మరింత మెరుగైన మార్గాన్వేషణ మీద ఎక్కువ దృష్టి సారించారు. తర్వాత ఐఏఎస్ పదవికి రాజీనామా చేసి లోక్‌సత్తా ఉద్యమ సంస్థను హైదరాబాద్‌లో ప్రారంభించారు. నేను కూడా అనుకోకుండా హైదరాబాద్‌లో స్థిరపడటంతో లోక్‌సత్తా సంస్థ సంస్కరణలు తెలుసుకునే అవకాశం లభించింది. అప్పట్లో టెక్నాలజీ లేదు గదా, ప్రతిదీ చాలా కష్టపడి తెలుసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు గూగుల్ వగైరా సెర్చ్‌లు చూస్తుంటే.. లోక్‌సత్తా భావజాలాన్ని అంత ప్రామాణికంగా, అజరామరంగా నిలిచేరీతిలో తయారుచేయటానికి జేపీ ఎన్ని అవస్థలు పడి ఉంటారోననిపిస్తుంది! ఒక ఆప్తురాలైన యువతి సమస్య కారణంగా జేపీని కలుసుకోవడం జరిగింది. ఆయన సూచన పాటించటం వల్ల ఆ యువతి జీవితం బాగుపడింది. ఈ విషయం ఆ అమ్మాయికి, నాకూ జీవితకాలం గుర్తుంటుంది. కానీ వేలమందికి ఇలా కనిపించని సాయాలు చేసి ఉంటారు గనుక జేపీ గారికి గుర్తుండకపోవచ్చు. ఉపశమనం పొందిన వ్యక్తి మాత్రం మరువరు. ఇలా ఎందరో ఆయన ద్వారా బాగుపడినవారు నాకు తెలుసు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో, ప్రకాశం జిల్లాలో, ఇతర చోట్లా అధికారిగా జేపీ వల్ల లబ్ధి పొందిన వేలాది కుటుంబాలు ఇప్పటికీ ఆయన్ని దైవంలా భావిస్తూ మాట్లాడుకుంటుంటారు. మొన్నటికి మొన్న ఒంగోలు ప్రభుత్వాస్పత్రిలో పనిచేసే ఒకామె.. ఎప్పుడో 30-35 ఏళ్ల క్రితం తమ జిల్లాకు కలెక్టర్‌గా జేపీ చేసిన సేవల గురించి అపురూపంగా చెప్పుకొచ్చారు. 2000 సంవత్సరంలో నేను లోక్‌సత్తా ఉద్యమసంస్థలో సభ్యురాలిగా చేరాను. ఒక పౌరురాలిగా నావంతు ఏదో ఒక పని సాటి వారి కోసం, దేశం కోసం చేయాలనుకున్నాను. లోక్‌సత్తా సంస్థ ద్వారా నాకు కొన్ని బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత పార్టీలోకి కూడా నన్ను తీసుకున్నారు. కార్యకర్తగా పనిచేశాను. ఇక్కడ కూడా ఎంతమంది జేపీ నుంచి సాయం పొందారో, ఎంతమంది దానికి తగ్గట్లు సమాజానికి తిరిగి సాయం చేశారో నాకు తెలుసు. అయితే, జేపీతో మనకున్న అనుబంధం ఉమ్మడి లక్ష్యానికి సంబంధించినదని, వ్యక్తిగతంగా ఉదారంగా సాయం చేయటం ద్వారా కూడా ఆ లక్ష్యం వైపు మనల్ని నడిపించేందుకు జేపీ తన శాయశక్తులా ప్రయత్నిస్తున్నారని సంస్థాగత కోణంలో అర్థం చేసుకున్నవారి సంఖ్య తక్కువనే నా అభిప్రాయం.

2006లో స్థాపించిన లోక్‌సత్తా పార్టీకి రహస్య బ్యాలెట్

ద్వారా ఎన్నికల్ని ప్రకటించి జేపీ తాను స్వయంగా బరిలో నిలిచారు. ఏకగ్రీవమయ్యే అవకాశమున్నా కూడా సీనియర్ నేత డి.వి.వి.ఎస్ వర్మగారిని పోటీలో నిలబడమని ప్రోత్సహించారు. అలా దేశంలోనే తొలిసారిగా రహస్య బ్యాలెట్ ద్వారా ఎన్నికైన అధ్యక్షుడిగా పదవీ కాలం పూర్తయ్యాక 2010లో తాను అధ్యక్ష పదవికి మళ్లీ పోటీ చేయనని, కేవలం పార్టీ భావజాలం, ప్రచారం వరకే పరిమితమవుతానని జేపీ ప్రకటించారు. అడహాక్ నియామకాలు చేశారు. ఆ తర్వాత పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. 2013లో పార్టీ సంస్థాగత ఎన్నికల్ని రహస్య బ్యాలెట్ ద్వారా నిర్వహించారు. ఆ సమయంలో నన్ను కూడా పిలిచి, 'పార్టీ అభ్యర్థులుగా తగినవారిని' సూచించమన్నారు. పార్టీ సభ్యులు ఎవరిని ఎన్నుకుంటారో వారిష్టం, అది వారు, స్వతంత్ర ఎన్నికల కమిషన్‌గా బయట నుంచి పర్యవేక్షించే వారు చూసుకుంటారు. కానీ వారి ముందు సరైన అభ్యర్థులను నిలబెట్టేందుకు మనం ప్రయత్నించాలి.. అని జేపీ అన్నారు. నేను నా సన్నిహిత మిత్రులైన ఇద్దరి పేర్లు ఇచ్చాను. వారు నిజాయతీపరులు, పార్టీ పట్ల గౌరవం ఉన్నవారు. నా కులం వారు కాదు, జేపీ కులానికి చెందినవారు కాదు. వెంటనే జేపీ వారిని సంప్రదించారు. వారు కాకుండా మరో నలుగురి పేర్లు కూడా ఇచ్చాను. కానీ జేపీ సుముఖత చూపలేదు. ఎందుకంటే, వారు జేపీ సామాజిక వర్గీయులు. ఏ కులంలో పుట్టాలన్నది మన చేతుల్లో లేని యాదృచ్ఛిక ఘటనే అయినా, కులరహిత సమాజం కోసమే లోక్‌సత్తా నూటికి నూరుపాళ్లూ పోరాడుతున్నా.. ప్రతి పనికీ కులాన్ని అంటగట్టే పేలవమైన సమాజం మనది. అందువల్ల వీలైనంత వరకూ సొంత కులం వారిని ఇలాంటి పదవుల్లో పోటీకి నిలబెట్టే ప్రయత్నం వద్దు అని జేపీ అన్నారు. అలాంటి నిందలకు ఆస్కారం ఇవ్వొద్దన్నారు. నిజానికి ఆ అభ్యర్థులు పార్టీకి చాలా అవసరం. సొంత వనరులతోనే పార్టీని బలోపేతం చేయగలరు, ప్రజల్లో ప్రచారం చేసుకోగలరు. అయినా జేపీ మెట్టు దిగలేదు. 'కులాభిమానంతో లోక్‌సత్తాకు సాయం చేసేవారు కూడా ఉన్నారు. వారి సేవల్ని సైతం ఉపయోగించుకోవాల్సిందే. పార్టీ ద్వారా ప్రజలకు సేవ చేయటానికి కులం అనేది ఆటంకం కాకూడదు. కానీ అలాంటి వారి సేవలను ఉపయోగించుకోవటం.. కులాన్ని బలోపేతం చేసే అవకాశాలకు, అపోహలకు, నిందలకు ఆస్కారం లేకుండా ఉండాలి. వారి సేవలను మరో రూపంలో ఉపయోగించుకుందాం' అని జేపీ స్పష్టం చేశారు. అన్నట్లు, ఇక్కడే ఇంకో విషయం. జేపీ గారి బంధువులే మా అపార్ట్‌మెంట్‌లో ఉండేవారు. వారు జేపీని ఏనాడూ సపోర్ట్ చేయలేదు. ఎందుకంటే, వారి ఆస్తులు, వాటిని ఎలా సంపాదించారు వంటి వివరాలు జేపీకి తెలుసని వారి భయం. దటీజ్ జేపీ.

ప్రజల్లో ఉన్న కులపిచ్చిని ఆసరాగా చేసుకునే.. 2009 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఓటమికి జేపీ, లోక్‌సత్తాయే కారణం అని చంద్రబాబు నాయుడు పెద్దఎత్తున తప్పుడు ప్రచారం చేశారు. అవినీతి పార్టీ లోక్‌సత్తా అని అప్పట్లో జీహెచ్ఎంసీ ఎన్నికల్లో టీడీపీ నేతల చేత దుర్మార్గపు ఆరోపణలు చేయించారు. మీడియా అండను ఇందుకు విశృంఖలంగా ఉపయోగించుకున్నారు. ఒక్కటంటే ఒక్క ఆరోపణకు కూడా ఆధారాల్ని చూపలేకపోయారు. గట్టిగా అడిగితే 'చంద్రబాబు బురద జల్లమన్నారు, మేం జల్లుతున్నాం' అని టీడీపీ నేతలు ప్రైవేటు సంభాషణల్లో చెప్పారు. రాజకీయ పార్టీలకు సొంత ఓట్లంటూ ఉండవు, ప్రజలు తమకు నచ్చినవారికి ఓట్లు వేయటమే ప్రజాస్వామ్యం.. అని ఎంత చెప్పినా చంద్రబాబు వినిపించుకోకుండా లోక్‌సత్తా మీద విమర్శల దాడిని కొనసాగించారు. చివరకు లోక్‌సత్తాకు నిధులిచ్చేవారిని కూడా కట్టడి చేశారు. తన ఓటమికి ఎవరో కారణమని ఆరోపించే ధోరణిని మానుకోవాలని ఆరోజు లోక్‌సత్తా చెప్పిన మాటల్ని చంద్రబాబు పెడచెవిన పెట్టారు. దానివల్ల లోక్‌సత్తాకు తాత్కాలికంగా నష్టం, తెలుగుదేశంకు తాత్కాలిక లాభం జరిగి ఉండొచ్చు.. కానీ చివరకు అది 2019లో తెలుగుదేశం పార్టీ ఘోరపరాజయానికి దారితీసింది. 2009లో లోక్‌సత్తా జేపీ మీద నింద వేసి తప్పించుకున్నట్లు 2019లో ఈవీఎంల మీద ఆరోపణలు చేసి మసి పూసి మారేడుకాయ చేద్దామన్న ఎత్తుగడ వికటించి తెదేపా చిత్తుగా ఓడింది. కనీస నైతిక, భావజాల పునాది లేకుండా సీజనల్ రాజకీయ ధోరణులతోనే వ్యవహరిస్తే.. ఏదోకరోజు పెద్ద వైఫల్యం తప్పదు. ఆనాడే తప్పుల్ని దిద్దుకుని, సంస్కరణలకు చిరునామా అయిన లోక్‌సత్తాతో రాజకీయ సామరస్యతతో వ్యవహరించి ఉంటే.. రాష్ట్ర విభజన కూడా అందరికీ ఆమోదయోగ్యంగా జరిగేది, నూతన ఆంధ్రప్రదేశ్ కూడా ఈపాటికి రెవెన్యూ సంక్షోభాన్ని అధిగమించి అభివృద్ధి పథంలో దూసుకెళ్తుండేది, జగన్‌కు, చంద్రబాబు తేడా లేదు అనే పరిస్థితి తలెత్తేదే కాదు. ఎప్పటికెయ్యది.. అనే తాత్కాలిక ధోరణి గల నాయకత్వ వ్యూహంలో చిక్కుకుని కులపిచ్చితో ముఖ్యంగా కమ్మ, వారితో ఎక్కువ రాజకీయ సఖ్యత గల కులాల ఓటర్లు విజ్ఞత కోల్పోవటం వల్ల ఆ పరిణామాలు జరిగాయి.

వైఎస్ జగన్ పార్టీకి కూడా ఇవి పెద్ద పాఠాలు. ఎందుకంటే తెదేపా ధోరణిలోనే వైకాపా వారు కూడా జేపీకి కులం అంటగట్టి మాట్లాడారు. చూడండి విచిత్రం.. జేపీ తెదేపాకు వ్యతిరేకమని చంద్రబాబు, ఆయన వర్గీయులు ప్రచారం చేస్తే.. వైసీపీకి వ్యతిరేకమని జగన్ అండ్ కో ప్రచారం చేసింది. వైఎస్ రాజశేఖర రెడ్డి బతికున్నప్పుడు ఆయనకు అనుకూలమని, వ్యతిరేకమని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ఆ ప్రచారాన్ని కూడా ఇటీవల మళ్లీ సోషల్ మీడియాలో ప్రచారంలో పెట్టారు. రాజశేఖర రెడ్డి హయాంలో కుంభకోణంలా సాగిన అతిపెద్ద భూకేటాయింపు వాన్‌పిక్ అంశాన్ని అసెంబ్లీలో లేవనెత్తి రద్దు చేయించింది జేపీయే, ఆయన ప్రతిష్ఠాత్మక పథకాలు ఆరోగ్యశ్రీ, జలయజ్ఞంలోని ప్రాణహిత–చేవెళ్ల వంటి ఎత్తిపోతల్లోని లోపాల్ని నిర్ద్వంద్వంగా విమర్శిస్తున్నది ఆనాడూ ఈనాడూ జేపీయేనన్న ఇంగితం కూడా లేకుండా విమర్శలు సాగాయి. వైఎస్సార్,

# ఆలోచనాశక్తిని పెంచుకోవటమే పరిష్కారం

వైరస్ కన్నా వేగంగా సోషల్ మీడియాలో ఫేక్‌న్యూస్ వ్యాపిస్తాయి. ప్రజల్లో ఉండే భయాలు, అనుమానాలనే స్థావరంగా ఉపయోగించుకుంటూ ఫేక్‌న్యూస్ వైరస్ విస్తరిస్తుంటుంది. కరోనా వంటి వైరస్‌లు వ్యాపించటానికి కొంతసమయం పడుతుంది. కానీ నకిలీవార్తలు వ్యాపించటానికి కొన్ని క్షణాలు చాలు. ప్రపంచవ్యాప్తమైపోతాయి. మన దేశంలో పది రూపాయల కాయిన్స్ దగ్గర్నుంచి కరోనా వరకు ఎన్నో నకిలీ వార్తలు సామాజిక మాధ్యమాల్లో వ్యాపించి ప్రజల విలువైన సమయాన్ని, వనరుల్ని వృధా చేశాయి. వారి ఆలోచనాశక్తిని కుంగదీశాయి. ప్యాండమిక్‌ల కంటే వేగంగా విస్తరిస్తూ, ఎప్పటికప్పుడు కొత్తరంగులతో ప్రజల మనోభావాలతో చెలగాటమాడుతున్న సోషల్ మీడియా 'ఇన్ఫోడెమిక్' వైరస్‌ల వ్యాప్తికి ఉగ్ర, వికృత ధోరణులున్నవారితోపాటు ప్రధాన రాజకీయపార్టీలు కూడా కారణమని నిపుణులు, సామాజికవేత్తలు అంటున్నారు. కేవలం పుకార్లను వ్యాపింపచేసి ప్రజల్లో భావోద్వేగాలను రెచ్చగొట్టి లబ్ధి పొందటానికే పార్టీలు కొన్ని సోషల్ మీడియా సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోవటం ఇందుకు కారణం. మనం అభిప్రాయాలు ఏర్పరచుకోవటానికి, నిర్ణయాలు తీసుకోవటానికి ఎంతో కీలకమైన సమాచారం ఈ రకంగా కలుషితమైతే మనం వ్యక్తిగతంగా, ఒక సమాజంగా కూడా తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది. ఈ వైకల్యం ప్రపంచమంతటా ఉన్నా.. 2019 ఎన్నికల్లో భారత్‌లో ఆందోళనకర రీతిలో విజృంభించింది. 2019 ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పోటీపడి నకిలీ, తప్పుడు వార్తలను వ్యాప్తి చేశాయని గుర్తించారు. ఏదైనా పెద్ద అంశం తెర పైకి వచ్చినప్పుడల్లా ఫేక్ న్యూస్ వైరల్ అవ్వడం సర్వసాధారణంగా మారిపోయింది. పుల్వామా దాడి ఘటన, ఆర్టికల్ 370 రద్దు, సీఏఏ తదితరాలపై జరిగిన ఆందోళనలకు సంబంధించి కూడా విపరీతమైన అవాస్తవాలు వైరల్ అయినట్లు గుర్తించారు. ప్రకృతి వైపరీత్యాలను కూడా ఆ జాడ్యం వదల్లేదు. 2018 ఆగస్టులో కేరళలో వరదలు బీభత్సం సృష్టించినప్పుడు నకిలీలు రకరకాలుగా షికార్లు చేశాయి. కాస్త ఆలస్యంగానే అయినా ప్రింట్ మీడియా వాటిని వెల్లడించింది. వాటిలో ఒకటి ఇది. 'ఒక వ్యక్తి లైఫ్ జాకెట్ వేసుకోవటానికి నిరాకరించాడు. దీనికి కారణం అది కాషాయ రంగులో ఉండటమే. కాషాయం హిందూత్వకు చిహ్నం కావటంతో బాధితుడు నేను వేసుకోనని తెల్చిచెప్పాడు. చివరికి ప్రాణాలే పోగొట్టుకున్నాడు' అంటూ వరదల సమయంలో ఒక పోస్టు వైరల్ అయింది. ఆ ఘటనలతో ముఖ్యమంత్రి పి.విజయన్ లైఫ్ జాకెట్లను కాషాయ రంగుకి బదులుగా ఆకుపచ్చ రంగులో తయారు చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారని కూడా ఆ వార్తకు రంగులద్దారు. జాతీయ మీడియా కూడా దాన్ని దాన్ని ప్రచురించి తర్వాత తూచ్ అని దిద్దుబాటు చేసుకుంది. అలాగే ఇంకాసేపట్లో ముల్లపెరియార్ డ్యామ్ కూలిపోయి ఎర్నాకులం మునిగిపోతుందన్న పుకారు కూడా షికారు చేసింది. తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే తరహాలో సమాచార కాలుష్యం తీవ్రస్థాయిలో ఉంది. ఈ విధమైన అవాస్తవాల వ్యాప్తి వల్ల కొన్నిచోట్ల ఘర్షణలు, నేరాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. 2023-24 ఎన్నికల్లో సామాజిక మాధ్యమాల్లో ప్రచారం ఏ రూపం దాలుస్తుందో, ఏ స్థాయికి చేరుతుందో ఎవరూ ఊహించలేకపోతున్నారు. పాలనలో ప్రదర్శించరు గానీ, ఎన్నికల్లో మన నాయకుల తెలివి కొత్త పుంతలు తొక్కుతుంటుంది గదా! ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో వార్తల్ని, కనీసం కాస్త పెద్దవార్తల్ని నమ్మే ముందు మనం ఒక్కసారి డిజిటల్ టూల్స్‌తోనో, ప్రింట్ మీడియాలోనో, ఒరిజినల్/సోర్స్ వెబ్‌సైట్స్ ఉంటే వాటిలోనో, జేపీ లాంటి అవగాహన, విశ్వసనీయత గల వ్యక్తుల ఖాతాల్లోనో తరచి చూసుకోవటం మేలు. ప్రింట్ మీడియాలో కొంత కల్తీ ఉండొచ్చుగానీ, నకిలీ తక్కువ. ఇంకా ముఖ్యమైన వార్తయితే.. డిజిటల్ టూల్స్‌ను ఉపయోగించటంతోపాటు కన్వర్జెన్స్ ఆఫ్ మీడియా.. అంటే డిజిటల్, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలు, పుస్తకాలు, విశ్వసనీయ వ్యక్తుల సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించి వివరాల్ని పోల్చి చూసుకోవటం మంచిది. జేపీ సూచించినట్లు "నేర్చుకోవటాన్ని నేర్చుకోవాలి, ఆలోచించటాన్ని నేర్చుకోవాలి". ఈ రకమైన ఆలోచనాశక్తి, చట్టబద్ధ ఏర్పాట్లే సోషల్ మీడియాను మనకున్న గొప్ప ప్రజాస్వామిక సాంకేతికావకాశంగా మారుస్తుంది.

చంద్రబాబు మధ్య అక్రమాస్తులపై అసెంబ్లీలో వాదోపవాదాలు జరిగినప్పుడు, ఇద్దరి ఆస్తుల మీదా ప్రత్యేక కోర్టు వేయాలని డిమాండ్ చేయటం ద్వారా నేతలను కాకుండా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను జేపీ పరిరక్షించారని కూడా విస్మరించి విషం కక్కారు. రాజకీయంగా కాంగ్రెస్ ఏజంటని, బీజేపీతో ఒప్పందం ఉందని జేపీపై రకరకాల విమర్శలు చేశారు. ఇలా పరస్పర విరుద్ధంగా అనుకూలంగా, వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నాము, కాస్త ఇంగితజ్ఞానమున్న జనం నవ్వుకుంటారు, భవిష్యత్ తరాలు మనల్ని పురుగుల్లా చూస్తాయి అన్న సోయి కూడా లేదు. కులరహిత సమాజం కోసం రిజర్వేషన్లు సహా పలు కోణాలలో తిరుగులేని విధానాలని ప్రతిపాదిస్తూ, వాటి అమలు కోసం దశాబ్దాల తరబడి నిరంతరం ప్రయత్నిస్తూ.. కులాభిమానంతో వచ్చేవారి శక్తిసామర్థ్యాలను, వనరులను కూడా కులరహిత సమాజం వైపు మళ్లిస్తూ దీపస్తంభంలా కొనసాగుతున్న జేపీలాంటి వ్యక్తి మీద కూడా నిందలు వేస్తుంటే ఇక మార్పు ఎక్కడ నుంచి వస్తుంది? మన కులపిచ్చి ఎప్పటికి పోతుంది? మన పాపాలకు నిష్కృతి ఎలా సాధ్యమవుతుంది?

ఇక్కడ పాపం అనే పదాన్ని ఎందుకు వాడాల్సి వస్తోందంటే, దేవుడు నమ్మకమైతే.. పాపం మాత్రం ప్రాపంచిక వాస్తవం. దేవుడు, ఆత్మ గురించి మాట్లాడని మౌలిక బౌద్ధం సహా ఆధునిక మనస్తత్వ శాస్త్రం వరకూ అన్నీ.. 'చేసిన పనికి ఫలితాన్ని అనుభవించకతప్పదు' అనే చెబుతున్నాయి. అందుకే సమాజానికి మేలు చేసే వ్యక్తుల మీద తెలిసోతెలియకో బురద జల్లినా, వారిని కించపరచాలని వారిపై నిందారోపణలు చేసినా అంతకంటే

మహాపాపం ఇంకోటి ఉండదు. సమాజానికి ఎంత ఎక్కువ మేలు చేసేవారి మీద, ఎంత ఎక్కువ నిందారోపణలు చేస్తే.. అంత ఎక్కువ పాపాన్ని మనం చేజేతులారా పెంచుకుంటున్నామన్న మాట. సమాజానికి ఉపయోగపడటం చుట్టూ అల్లుకుని ఉన్నవారి మీద బురద జల్లటమంటే చివరికి మన పతనానికి మనమే బాటలు వేసుకోవటమవుతుంది.

మా ఇంట తాతల రోజుల నుంచీ కులమత భేదాలు ఎరగం. నేను గర్వపడతాను నా కుటుంబంలో అన్ని కులాలు, విదేశీయులు కూడా ఉన్నారని! నాకు జేపీ గారితో దాదాపు 22 సంవత్సరాల ప్రత్యక్ష పరిచయం. అందువలన వారి గురించి కొంత బాగా తెలిసినవారిలో నేనూ ఉన్నాను. ఆ నాయకుడ్ని చూసి నేను ఎన్నో నేర్చుకున్నాను. లోక్‌సత్తా సంస్థ నాకు ఎంతో ఎదిగే అవకాశం ఇచ్చింది. జేపీ పేరు చెబితే ఇక్కడ అమెరికాలో కూడా నీరాజనాలు పట్టే స్నేహితులు అనేకమంది ఉన్నారు. లోక్‌సత్తా సంస్థలో పనిచేస్తున్నందుకు నాకే, ఇక్కడ కూడా ఎంతో గౌరవం లభించిందంటే, జేపీ కృషి ఏ స్థాయిలో ఉందో ఊహించుకోండి. ఆయనేమీ సినిమా స్టార్ కాదు, వేల, లక్షల కోట్ల సంపన్నుడు కాదు, వారసత్వంగా రాజకీయ పలుకుబడి ఉన్నవాడు కాదు.. కేవలం ప్రకృతి ఇచ్చిన తెలివితేటల్ని చదువు ద్వారా వికసింప చేసుకుని ప్రపంచ స్థాయికి ఎదిగిన ఒక సామాన్య మధ్యతరగతి వ్యక్తి. తన శక్తియుక్తులన్నింటినీ సమాజహితం కోసం పెట్టుబడిగా పెట్టిన సమున్నత నాయకుడు. జేపీతో పరిచయం లేకపోయినా, మాట్లాడకపోయినా.. కేవలం ఆయన భావజాలాన్ని, అందుకోసం కృషిని చూసి ఆయన్ని అభిమానించేవారు, అనుసరించేవారు కోకొల్లలుగా అన్ని ప్రాంతాల్లో ఉన్నారు. కుల వివక్షను తొలగించి అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే నిర్దిష్ట విధానాల రాజకీయం చేస్తున్నారు కాబట్టే జేపీ ఇలా కాలపరీక్షను తట్టుకుని భావజాల బలంలో ఇప్పటికీ ఇండియాలో నెంబర్‌వన్‌గా కొనసాగుతున్నారు. కులం పోవాలంటే, దాతృత్వాలతోనో, వీరావేశ ఆదర్శాలతోనో, ఉచితాలు, తాయిలాల పథకాలతోనో సాధ్యం కాదు. కచ్చితంగా హేతుబద్ధ విధానాలతోనే కులనిర్మూలన సాధ్యం. అటువంటి సమగ్ర విధానాలను కలిగిన నాయకుడు, పార్టీయే నిజంగా కుల నిర్మూలన శక్తులు. అటువంటి సమగ్ర విధానాలతో కుల నిర్మూలనకు కృషి చేస్తున్న జేపీపై, లోక్‌సత్తాపై కులం పేరుతో బురద జల్లటమనేది మీకున్న కుల గజ్జిని ఎదుటివారికి అంటించే ప్రయత్నం తప్ప మరోటి కాదు. ఏదైనా సందేహం ఉంటే, నిజాల్ని తెలుసుకునే ప్రయత్నం చేయండి. తరచితరచి అడిగి హేతుబద్ధ వివరాల్ని తెలుసుకోండి. ఆ తర్వాతే స్పందించండి. అంతేగానీ, తాత్కాలిక అవసరాల కోసమో, వ్యక్తిగత ఆవేశంతో తొందరపాటుతనంతోనో, ఇగోను సంతృప్తి పరచుకోవటానికో, వికృతానందం కోసమో అమానుషమైన కులవ్యవస్థ నిర్మూలనకు జరుగుతున్న సమగ్ర కృషిపై బురద జల్లొద్దు.

ఈ లేఖ ఉద్దేశం జేపీని ఆకాశానికెత్తేసే రీతిలో పొగడడం కాదు. నాకు తెలిసిన యదార్థాన్ని లోక్‌సత్తా సభ్యురాలిగా, కార్యకర్తగా, భారతీయ ఆత్మ కలిగిన వ్యక్తిగా చెప్పటం అవసరమనిపించి చెబుతున్నానంతే.

సోషల్ మీడియాలో ఉచ్చనీచాలు లేకుండా, ఆవేశాన్ని- ఆలోచనను హేతుబద్ధంగా సమన్వయం చేసే శక్తి లేకుండా చేస్తున్న గాలివాటపు వ్యాఖ్యల వల్ల అనేకమంది వ్యక్తిగత నిజాయతీపరులు, ఆలోచనాపరులు కూడా నలిగిపోతున్నారు. అమాయకులు తమ భావాలను లోలోపలే దాచేసుకుంటున్నారు. ఈ వైఫల్యాన్ని సరిచేసుకుంటే.. తక్కువ ఖర్చుతో అందరికీ అందుబాటులోకి వచ్చే ఒక గొప్ప సమాచార మాధ్యమంగా సోషల్ మీడియా ప్లాట్‌ఫారాలు రూపుదిద్దుకుంటాయి. ప్రభుత్వాలేవో ఈమధ్య కొత్తగా నిబంధనల్ని అమలు చేస్తున్నాయి. ఆ చర్చను అలా పెట్టి.. మనం స్వీయనియంత్రణను, మన భావాల్ని సృజనాత్మకంగా, బహిరంగ చర్చ ప్రమాణాలతో వ్యక్తం చేసే సామర్థ్యాన్ని అలవరచుకుందాం.

కనీసం ఒక రూల్ పెట్టుకుని మార్పు కోసం మొదలవుదాం. సమాజహితం కోసం విధానపరంగా పనిచేసే వారి మీద ఎట్టి పరిస్థితుల్లోనూ బురద జల్లే పనిచేయకూడదని నిబంధన పెట్టుకుందాం. అలాంటి మెస్సేజీలను, వీడియోలను ఫ్వార్వర్డ్ చేయకూడదని, ప్రోత్సహించ కూడదని నియంత్రణ పాటిద్దాం. ఇతరుల పట్ల వ్యక్తిగత దూషణలు, అబద్ధాల ప్రచారం చేయాలని మనలో చాలామంది పనిగట్టుకుని అనుకోం. కానీ కొద్దిమంది ఛాందసులు, హార్డ్‌కోర్ స్వప్రయోజకుల, పరిస్థితుల, ప్రచార ప్రభావానికి లోనై తప్పుడు ప్రచారంలో మనమూ భాగమవుతుంటాం. వేగంగా చోటుచేసుకునే పరిణామాల మధ్య మనం వాస్తవాల్ని తెలుసుకునేలోగానే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. సమాజహితకారుల మీద నిందారోపణల వల్ల ప్రజలకు, మన కుటుంబానికి, చివరికి మనకు కూడా తీవ్ర నష్టం చేసుకున్నవారమవుతామని గుర్తిద్దాం. సద్విమర్శలు చేయవచ్చు, ప్రశ్నించవచ్చు, విధానపరమైన అంశాలపై సంఘర్షించవచ్చు కానీ.. అది కూడా బహిరంగ చర్చ ప్రమాణాల పరిధులు దాటకుండా, అబద్ధాల చుట్టూ అనుచిత వ్యాఖ్యలు, వ్యక్తిగత విమర్శలు లేకుండా.

మన వేలితో మన కళ్లు పొడుచుకునే సంకుచితత్వాన్ని వీడదాం, సమాజానికి ఉపయోగపడే వ్యక్తులపై బురద జల్లకూడదనే సూత్రానికి నిక్కచ్చిగా కట్టుబడదాం, క్రమంగా ప్రతి ఒక్కరి విషయంలో ఈ సూత్రాన్ని వర్తింపచేద్దాం, బహిరంగ చర్చ ప్రమాణాల్ని పెంపొందించుకుందాం, సామాజిక మాధ్యమాల్ని మన నిజమైన ప్రయోజనాల కోసం పూర్తిస్థాయిలో సద్వినియోగపరచుకుందాం.

**"విధానాలే నాయకత్వ స్థాయికి అంతిమ కొలమానాలు..**
**పర్యవసానాలే విధానాలకు గీటురాళ్లు"**

**- డా॥ జేపీ**

INDIA
INDEPENDENCE DAY
75TH

# నిజమైన దేశభక్తిని ప్రదర్శిద్దాం: జేపీ

స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అవుతున్నా, దేశ సమగ్రనిర్మాణం ఇంకా ఓ కలగానే మిగిలిపోయింది. కులం, మతం, ప్రాంతం తప్ప భారతీయత ఇంకా వ్యాప్తి చెందలేదు. రాజకీయాలు సంకుచితంగా మారి, స్వల్పకాల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్నాయి. ఎలాగోలా తాము అధికారంలోకి రావటమో లేక ఇతరులను అధికారం నుంచి తప్పించటమో అనే ఏకైక అంశం చుట్టూనే పార్టీల ఎజెండా తిరుగుతోంది. ఈ పరిస్థితుల్లో జనాభాలో అధికశాతం ఉన్న యువత మనకున్న పెద్ద ఆశాకిరణం. ఎటువంటి ఆత్మన్యూనత లేకుండా ఉత్సాహంతో ఉన్న మన యువశక్తిని జాతినిర్మాణం దిశగా, నిజమైన దేశభక్తి దిశగా వినియోగించాల్సిన బాధ్యత రాజకీయపార్టీలు, మీడియా, ఉన్నత వర్గాలవారు, సమాజం మీద ఉంది. నిజమైన దేశభక్తి అంటే భారతమాతకు పూలదండలు వేయటం, ఆరాధించటం మాత్రమే కాదు.. ప్రజలందరికీ ఎదిగే అవకాశమున్నరీతిలో దేశ సమగ్ర నిర్మాణంలో భాగస్వాములవ్వటం.



RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th August, 2021 Posting Date 15 &16th of every month

# సరైన విధానాలతో వేగిరం వైఫల్యాల్ని సరిదిద్దుకుందాం..
# భారతదేశ సామర్థ్యాన్ని వృధా పోకుండా ఆవిష్కరించుకుందాం



INDIA
INDEPENDENCE DAY
TH

మనం సరైన విధానాలతో, వేగంగా దేశ వైఫల్యాల్ని సరిదిద్దుకోవాలి. మిగతా ప్రపంచం శరవేగంతో పరిగెడుతుంటే, తీరిగ్గా తప్పుల్ని దిద్దుకునే ధోరణిని అవలంబించటం భారతదేశం ఎదుగుదలను దెబ్బతీస్తుంది. వైఫల్యాలకు ప్రజాస్వామ్యం కారణమని మనల్ని మనం మోసం చేసుకోవద్దు. మన లక్ష్యాన్ని వేగంగా చేర్చే సాధనాలుగా రాజకీయ, పాలనా వ్యవస్థల్ని పునర్వ్యవస్థీకరించేందుకు ఇది సరైన సమయం. మన ప్రజలకు ఇంకా మెరుగైన జీవితాల్ని, మన బిడ్డలకు ఇంకా గొప్ప భవిష్యత్తుని అందించేందుకు అన్ని వనరులూ, అవకాశాలూ మనకున్నాయి. ప్రపంచంలో సగర్వంగా చెప్పుకోగలిగిన వారసత్వం మనదేశానికి ఉంది. సరైన విధానాల ఆచరణ లేని ఊకదంపుడు ఉపన్యాసాలు, మాటల గారడీలు కట్టిపెట్టి గట్టి సంకల్పంతో కార్యాచరణను చేపడదాం. పాలనలో జవాబుదారీతనం, స్థానిక ప్రభుత్వాలకు సాధికారతతో జనం చేతికి అధికారం, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా పౌర సేవలు, అవినీతి నిర్మూలన, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, మౌలిక వసతులు, ఉపాధి నైపుణ్యాలు కల్పించి వివక్ష లేకుండా అందరికీ ఎదిగే అవకాశాల్ని అందించటం, చట్టబద్ధపాలన, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా ఎన్నికల పద్ధతితోపాటు కొన్ని దీర్ఘకాలిక సంస్కరణల్ని వేగిరం సాధించే సంకల్పాన్ని, నైపుణ్యాన్ని రాజకీయ వ్యవస్థ, సమాజం, ముఖ్యంగా యువత 75వ స్వాతంత్ర్య దినోత్సవం నుండయినా ప్రదర్శించగలిగితే భారతదేశం తన సామర్థ్యాన్ని ఆవిష్కరించుకుని కలల్ని సాకారం చేసుకోగలుగుతుంది. ఇప్పుడు మనం ఈ కార్యాచరణ చేపడితే వచ్చే దశాబ్దంలోనే చైనాకు దీటుగా అగ్రస్థాయికి ఎదగగలుగుతాం. మేధస్సు, నైతికత ఉన్న దేశానిదే సుస్థిర అగ్రస్థాయి. సాటిలేని మన జాతీయోద్యమానికి, నాగరికతకు ఈ లక్ష్యం మాత్రమే నిజమైన కొనసాగింపు.

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,**
**ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు**

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*Tulips Apartments, 6-3-655,*
*Flat.No. 407,*
*Behind civil supplies office,*
*Somajiguda,*
*Hyderabad - 500 082*

Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020